# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 4 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 217 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## నాటి ఫైటింగ్ కార్నర్ నేటి ఫ్రెండ్‌షిప్ టౌన్



2

## మరో 8 కాన్సులేట్ కేంద్రాలు



2

## సీఎం సార్‌ను కలిసిన మెగా స్టార్

**హైదరాబాద్,ఆగస్టు 03, (మనం బ్యూరో):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి కలిశారు. జూబ్లీ హిల్స్ లోని సీఎం నివాసానికి ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో చేరుకున్న చిరంజీవి ఆయనతో భేటీ అయ్యారు. అయితే, ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందని సీఎంవో వర్గాలు పేర్కొన్నారు.



## టార్గెట్ కేసీఆర్

### 2 గంటలకు క్యాబినెట్ భేటీ

### కాళేశ్వరం నివేదికపై ప్రత్యేక చర్చ



**హైదరాబాద్, ఆగస్టు 03, (మనం బ్యూరో):** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం జరుగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మద్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టులో చోటుచేసుకున్న అవకతవకలపై నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. మూడు రోజుల క్రితం ఘోష్ కమిషన్ 650 పేజీల పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేసిన విషయం తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. నీటి పారుదల శాఖ సెక్రటరీ, న్యాయశాఖ సెక్రటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా ఉన్న ఈ కమిటీ నివేదికను ఇప్పటికే అధ్యయనం చేసింది ఈ పూర్తి సారాంశాన్ని అధికారుల బృందం నేడు క్యాబినెట్ ముందు ఉంచనుంది.

కాళేశ్వరం కమిషన్ సమర్పించిన నివేదికను ఈ భేటీలో చర్చించనున్నారు. నివేదికలో పేర్కొన్న మేరకు కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలకు

...మిగతా 2లో

### హైదరాబాద్ నుంచి విజయవాడకు

# రెండు గంటల్లోనే

### రూ.650 కోట్లతో నిర్మితమవుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్‌ను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి ● 6న సీఎం, నేను గడ్కరీని కలుస్తం



**హైదరాబాద్, ఆగస్టు 03, మనం బ్యూరో:** హైదరాబాద్ నుంచి విజయవాడకు రోడ్డు మార్గం ద్వారా రెండు గంటల్లో చేరుకునేలా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మెట్రో రైల్ రెండో దశ అనుమతులపై ప్రధాని మోడీని త్వరలో కలువనున్నట్లు వెల్లడించారు. ఎల్బీనగర్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు సుమారు రూ.650 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి వనస్థలిపురం జంక్షన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఏఐ ఎస్‌ఈ ధర్మారెడ్డి ఎలివేటెడ్ కారిడార్ ప్రపోజల్స్, డిజైన్లను మంత్రికి వివరించారు. వీటిని పరిశీలించిన మంత్రి త్వరంగా కేంద్రం అనుమతులు పొంది పనులు ప్రారంభించే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

...మిగతా 2లో

## ముర్ముతో అమిత్ షా భేటీ



**ఢిల్లీ, ఆగస్టు 3:** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన ఆయన అధ్యక్షురాలితో ప్రత్యేకంగా సమావేశమైనట్టు రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మధ్యాహ్నా సమయంలో ప్రధాని మోడీ కూడా రాష్ట్రపతితో భేటీ అయిన విషయం తెలిసిందే. వీరి వరుస భేటీల వెనక కారణాలు తెలియనప్పటికీ గంటల వ్యవధిలోనే ఇరువురు కీలక నేతలు రాష్ట్రపతితో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. జులై 21న మొదలైన సమావేశాలు ఆగస్టు 12 వరకు జరగనున్నాయి. ఇటీవలే ఆపరేషన్ సిందూర్‌పై ఉభయ సభల్లో చర్చ జరిగిన సంగతి తెలిసిందే.

## వానలొస్తే ఏ నగరమైనా

# మునిగిపోతది

### అందులో ఆశ్చర్యమేముంది?

### సోషల్ మీడియాపై హరియాణా సీఎం ఆగ్రహం

**గురుగ్రామ్, ఆగస్టు 3:** భారీ వర్షాల కారణంగా హరియాణాలోని గురుగ్రామ్ నగరం జలమయమైంది. ఈ వరద దృశ్యాలకు సంబంధించిన వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. వీటిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. వరదలు వస్తే ఏ నగరమైనా మునిగిపోతుందని.. అమెరికాలోని కాలిఫోర్నియా నగరం మునిగిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా

...మిగతా 2లో



**తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ హాస్టల్ గదిలో విద్యార్థిని అశ్విని (24) చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన అశ్విని తెలుగులో పీజీ చేస్తోంది.**

# అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఈసీ

### బీహార్‌లో నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటర్లకు లేకుండా చేస్తోంది ● కాంగ్రెస్ నేత చిదంబరం ఆరోపణలు

**ఢిల్లీ, ఆగస్టు 3:** బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది' అని చిదంబరం పేర్కొన్నారు. పెరిగిన ఓటర్లను శాశ్వత వలస కార్మికులు అని పిలిస్తే అసలైన వలస కార్మికులను అవమానించినట్లు అవుతుందన్నారు. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లేకుండా చేసేందుకు ఓట్ల పెంపుదల జరిగిందని చిదంబరం మండిపడ్డారు. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం

...మిగతా 2లో

## ఖండించిన ఎన్నికల సంఘం

**ఢిల్లీ, ఆగస్టు 3:** తనపై మాజీ మంత్రి చిదంబరం చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ను తమిళనాడుతో ముడిపెట్టడం అసంబద్ధమని పేర్కొంది. తమిళనాడులో ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ఇంకా నిర్వహించలేదని గుర్తుచేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది

...మిగతా 2లో



## పీవోకేలో పహల్గాం ఉగ్రవాది అంత్యక్రియలు



- 'అధికారికం'గా కర్మకాండలు
- టెర్రరిస్టుల వెనుక పాక్ ఉందనడానికి మరో సాక్ష్యం

**ఢిల్లీ, ఆగస్టు 3:** పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్నది పాక్ ఉగ్రవాదులే అనడానికి మరో తిరుగులేని ఆధారం బయటపడింది. తాజాగా 'ఆపరేషన్ మహాదేవ్'లో హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడైన తాహిర్ హబీబ్ కు పీవోకేలో జనాజా ఏ గైబ్ విధానంలో అంత్యక్రియలు నిర్వహించారు. చనిపోయిన వ్యక్తి మృతదేహం అందుబాటులో లేకపోతే ఈ విధానంలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తారు. రావల్కోట్ ఖైగలాలో పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఉన్న వీడియోలు, చిత్రాలను ఓ టెలిగ్రామ్ ఛానెల్లో పోస్టు చేశారు. ఆ సమయంలో స్థానిక లష్కరే కమాండర్ రిజ్వాన్ హనీఫ్, ఇతర సభ్యులు కూడా దానిలో భాగం కావాలని ప్రయత్నించారు. కానీ, తాహిర్ ను అతడి కుటుంబీకులు అంత్యక్రియలకు హాజరుకాకుండా అడ్డుకొన్నారు. కానీ, హనీఫ్ పట్టుబట్టడంతో..

...మిగతా 2లో



## హసీనాపై విచారణ షురూ

**ఢాకా, ఆగస్టు 3:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మానవాళికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' (ఐఖీ) అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నేడు ఆయా కేసుల్లో హసీనాపై విచారణను ప్రారంభించింది. తాత్కాలిక ప్రభుత్వం నియమించిన చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం.. హసీనాను అన్ని నేరాలకు మూలకేంద్రంగా పేర్కొన్నారు. ఆమెకు గరిష్ఠ శిక్ష

...మిగతా 2లో

## ఎల్లుండి ఢిల్లీలో ఈసీ కీలక భేటీ

### హాజరుకానున్న కేటీఆర్ బృందం

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** బీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం పంపింది. రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం ఈ నెల 5న మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి హాజరు కావాలని బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బృందానికి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ లేఖ పంపారు. అదే సమయంలో తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా సైతం బీఆర్ఎస్ అధినేతకు

...మిగతా 2లో

## పాదయాత్రకు బ్రేక్

- రేపు ఉదయం ఛలో ఢిల్లీకి మీనాక్షి
- కార్యకర్తలతో కలిసి రైలులో పయనం

**హైదరాబాద్, ఆగస్టు 3:** బీసీ బిల్లు అమలు చేసి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 5, 6, 7 తేదీలలో ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఉద్యమ

...మిగతా 2లో



## కవిత వాడిన పదాలనే రేవంత్, రాధాకృష్ణ మాట్లాడుతుండ్రు

### ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

2

## ఆ ఓటరు కార్డు అప్పగించండి

### ఆర్‌జేడీ నేత తేజస్వీకి ఈసీ నోటీసులు



2

## రేటింగ్ పెంచుకునేందుకు కానిపనులు చేస్తున్న కశ్మీరీ యువత

### టెర్రరిస్టుల ఫోటోలను వాడుకుంటూ ఫాలోయర్లను పెంచుకునే యత్నం

### యువతీయువకులకు పోలీసుల కౌన్సెలింగ్





**కశ్మీర్, ఆగస్టు 3:** సోషల్ మీడియాలో రేటింగ్ పెంచుకునేందుకు కొంతమంది కశ్మీరీ యువత అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఫాలోవర్లను పెంచుకునేందుకు, ఆదాయాన్నిచ్చే అడ్వర్టైజ్‌మెంట్స్ తెచ్చుకునేందుకు వేర్పాటువాదులను, ఉగ్రవాదులను పొగడటం వంటి రెచ్చగొట్టే కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నట్లు సమాచారం. భావజాలంతో పని లేకుండా.. కేవలం ఫాలోవర్లు, ఆదాయం కోసమే ఇలా వ్యవహరిస్తున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. ఇటువంటి ఖాతాలను నడిపిస్తున్న కొంతమంది యువకులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. ఈ వ్యవహారం వెలుగుచూసింది. కరడుగట్టిన ఉగ్రవాది హిజ్బుల్ కమాండర్ బుర్హాన్ వానీ.. 2016లో భద్రతాబలగాల చేతిలో హతమైన విషయం తెలిసిందే. ఆన్లైన్లో ఫాలోవర్ల కోసం అటువంటి వ్యక్తుల ఫొటోలను వినియోగించడం వంటి వ్యూహాలు అమలు చేస్తున్నట్లు సంబంధిత యువకులు విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఇలా దేశ, విదేశాల నుంచి అనేక మంది ఫాలోవర్లను సంపాదించిన అనంతరం.. ఆ వ్యక్తుల ఫొటోలను తొలగించి

...మిగతా 2లో

## రష్యాలో మరోసారి భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై రికార్డైన తీవ్రత 7.0
- సునామీ హెచ్చరికల జారీ





**మాస్కో, ఆగస్టు 3:** రష్యాలోని కురిల్ దీవులలో ఆదివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.0 తీవ్రత నమోదైంది. జపాన్ వాతావరణ శాఖ, యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ ఈ విషయాన్ని వెల్లడించాయి. రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ పలు ప్రాంతాల్లో సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. భూకంపం ధాటికి పలు నగరాల్లోని భవనాలు ఊగిపోయాయని రష్యా మీడియా తెలిపింది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్ల నుంచి పరుగులు

...మిగతా 2లో

## అదృశ్యమైన 4గురు ప్రవాసీ వృద్ధులు మృతి

**న్యూయార్క్, ఆగస్టు 3:** అమెరికాలో న్యూయార్కులో నివాసముంటున్న నలుగురు భారత సంతతి వృద్ధులు అదృశ్యమైన ఘటన విషాదాంతంగా ముగిసింది. వెస్ట్ వర్జీనియాలోని ఓ ఆధ్యాత్మిక ప్రదేశానికి వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు మార్షల్ కౌంటీ పోలీసులు వెల్లడించారు.

బాధితులు ఒకే కుటుంబానికి చెందిన ఆశా దివాన్(85), కిశోర్ దివాన్ (89), శైలేష్ దివాన్ (86), గీతా దివాన్ (84)లుగా పోలీసులు గుర్తించారు. న్యూయార్క్ లోని బఫలో నుంచి వెస్ట్ వర్జీనియాలోని మార్షల్ కౌంటీలో ఉన్న ప్యాలెస్ ఆఫ్ గోల్డ్ కు బయలుదేరారు. ఈ క్రమంలో బిగ్ వీలింగ్ క్రీక్ రోడ్డులో వీరి

...మిగతా 2లో

# రెండు గంటల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఎల్బీనగర్ ప్రాంత ప్రజల కష్టాలు తనకు తెలుసనీ, ఎంపీగా ఉన్నప్పుడే ఈ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి కోసం కృషి చేశానని గుర్తు చేశారు. ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ 6 లేన్ల రోడ్డు కోసం రూ. 541 కోట్లు మంజూరు చేయించాననీ, ఇందులో నాలుగు వెహికిల్ అండర్ పాస్ పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు వెల్లడించారు. రూ.2300 కోట్ల వ్యయంతో గౌరెల్లి, వలిగొండ, భద్రాచలం గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరైందనీ, ఇప్పటికే వలిగొండ-తొర్రూరు మధ్య నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. తొర్రూరు-భద్రాచలం మధ్య రోడ్డు పనుల కోసం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందనీ, అందోల్ మైసమ్మ నుంచి విజయవాడ వరకు రూ.375 కోట్లతో రోడ్డు నిర్మాణం శరవేగంగా కొనసాగుతుందని ఈ మధ్య 17 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని యాక్సిడెంట్స్ జరిగి ఏ ఒక్క ప్రాణం రోడ్డు నిర్మాణం చేయడమే తమకు అత్యంత ప్రాధాన్యమిచ్చామన్నారు. మెట్రో రైల్ రెండో దశ అనుమతులకు సంబంధించి బాధ్యతలు సీఎం రేవంత్ రెడ్డి తనపై ఉంచారనీ, ఇటీవల బీజేపీ, కాంగ్రెస్ పాఈర్టల ఎంపీలకు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి మెట్రో మొదటి దశ నిర్మాణం కోసం అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి కృషి చేశారనీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే రెండో దశ మెట్రోకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మెట్రో రైలు అనుమతుల కోసం రీజినల్ రింగ్ రైల్ కోసం ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు, స్థానిక ప్రజా ప్రితినిధులను కలవనున్నట్లు వెల్లడించారు. దేశానికి రోల్ మోడల్గా కులగణన చేశామనీ, బీసీ రిజర్వేషన్లకోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందనీ, అందుకే అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్రానికి పంపామని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి అన్నారు.



# రేటింగ్ పెంచుకునేందుకు కానిపనులు చేస్తున్న కశ్మీరీ యువత

(మొదటి పేజీ తరువాయి)

పర్వతాలు, చినార్ చెట్ల వంటి ఇతర ఫొటోలను ఉంచుతున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలో ఈ కొత్త ధోరణి కలవరపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేపథ్యంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసం సున్నితమైన అంశాలను వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు తమ నిఘాను ముమ్మరం చేశారు. అదేవిధంగా.. పిల్లల భవిష్యత్తుపై దీని దుష్ప్రభావం గురించి కుటుంబాలకు అర్థమయ్యేలా వివరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి వ్యవహారంలో ఇటీవల ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. తల్లిదండ్రుల ముందే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపా

శ్మీర్ లోయలో రెచ్చగొట్టే ఫొటోలు ఉపయోగించే ఇన్ఫ్లుయెన్సర్ల సంఖ్య పెరుగుదల వెనుక ఆర్థికపరమైన కారణాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రకటనదారుల నుంచి ఆదాయాన్ని పొందేందుకు.. ఈ విధమైన అక్రమ మార్గాలను అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. ఇటువంటి ఇన్ఫ్లుయెన్సర్లలో చాలామంది సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో బ్రాండ్ పార్ట్‌నర్‌షిప్ ఆధారపడ్డారని తెలిపారు. సంబంధిత ఉత్పత్తుల గురించి ప్రచారం చేయడం, కంటెంట్లో వాటి ప్రస్తావన తీసుకురావడం వంటివి చేస్తున్నారని చెప్పారు.

## మరో 8 కాన్సులేట్ కేంద్రాలు

న్యూయార్క్, ఆగస్టు 3: అమెరికాలో కొత్తగా 8 కాన్సులేట్ దరఖాస్తు కేంద్రాలను భారత్ ప్రారంభించింది. వీటి ద్వారా పాస్పోర్టు, వీసా, ఇతర సేవలను మరింత సులభతరం చేయనుంది. బోస్టన్, కొలంబస్, డాలస్, డెట్రాయిట్, ఎడిసన్, ఓర్లాండో, రాలీ, శాన్జోస్‌లలో ఈ కేంద్రాలను అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా వర్చువల్గా ప్రారంభించారు. దీంతో మొత్తం భారత్ కాన్సులేట్ దరఖాస్తు కేంద్రాల సంఖ్య 17కు చేరుకుంది. కొత్త కేంద్రాల్లో శనివారం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. లాస్ఏంజెలెస్లో మరో కేంద్రం త్వరలో ప్రారంభం కానుందని క్వాత్రా తెలిపారు.

## కవిత వాడిన పదాలనే రేవంత్, రాధాకృష్ణ మాట్లాడుతుండ్రు

● ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి: నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి వారికి ఉన్న జ్ఞానానికి నా జోహార్లు అని అంటూ మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వాళ్ళు, బీఆర్ఎస్ పార్టీని ఖతం చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఏం మాట్లాడుతున్నారో? వారు అదే మాట్లాడుతున్నారని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఉపయోగించిన పదాలను రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఉపయోగించారు. వాళ్ళు ఉపయోగించిన పదాలను కవిత వల్లెవేస్తున్నారు. నల్గొండ జిల్లాలో 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, గెలుపుకు నేను భాధ్యత అయితే ఓటమికి నేను భాధ్యుడను. పార్టీ అంతిమంగా ఫైనల్. వ్యక్తులుగా ఏదో చేస్తామని అంటే వారి భ్రమ. కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారు అని జగదీశ్ రెడ్డి తెలిపారు. తాను పార్టీకి సైనికుడిని. నేను కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో 50 సార్లు కలిశాను. వారి గురించి చర్చ రాలేదని నేను చెప్పాను. వారి గురించి మాట్లాడటం వృధా అని చెప్పాను అంతే. కేసీఆర్‌తో బనకచర్ల, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశంపైనే చర్చించామన్నారు. కేసీఆర్ లేకపోతే? మేము ఎవరం లేము. అందులో ఎలాంటి సందేహం లేదు. నేను చావుతప్పి కన్నులొట్టబోయినట్లు గెలిచిన.. కానీ, కొంతమంది గెలవలేదు కదా?. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి రాలేదు?.. నేను చూడలేదు? నేను చూసి ఉంటే కచ్చితంగా స్పందించేవాడిని అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

# రష్యాలో మరోసారి భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

తీసినట్లు పేర్కొంది. ఇటీవల రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 8.8 తీవ్రత నమోదైంది. ఈ భారీ భూప్రకంపనల ధాటికి రష్యా, జపాన్తో పాటు ఉత్తర పసిఫిక్లోని పలు తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని నిపుణులు పేర్కొన్నారు. దాని ప్రభావంతోనే తాజాగా భూకంపం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాలు సూచించాయి.

**బద్ధలైన అగ్నిపర్వతం..**

రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల సంభవించిన భారీ భూకంపం వల్ల దాదాపు 600 ఏండ్ల తర్వాత మొదటిసారి ఈ అగ్నిపర్వతం బద్దలైనట్లు రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో 6 వేల మీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడినట్లు వెల్లడించింది. మరో ఘటనలో కమ్చట్కా ద్వీపకల్పంలోని అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యూచెస్కీ బద్ధలైంది.

## నాటి ఫైటింగ్ కార్నర్లే నేటి ఫ్రెండ్‌షిప్ టౌన్

న్యూయార్క్, ఆగస్టు 3:ఆ ఊరిపేరు 'ఫ్రెండ్ షిప్ పేరుతో పెద్ద పట్టణమే ఉంది. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా కూడా ఇది నిజం. కొన్ని వందల ఏళ్ల క్రితం అక్కడ రెండు తెగల మధ్య తరచూ గొడవలు జరిగేవట. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఫైటింగ్ కార్నర్స్'గా పిలిచేవారట. ఆ తర్వాత అక్కడుండే జనాలు కలిసిమెలిసి ఉండాలంటూ వాళ్లలో సయోధ్యను పెంచడానికి రకరకాల కార్యక్రమాలు మొదలయ్యాయి. అందులో భాగంగానే 1815లో అధికారికంగా ఆ ఊరికి ఫ్రెండ్షిప్ అనే పేరు పెట్టారు. అమెరికాలోని ఆడమ్స్ కౌంటీలో కూడా 'ఫ్రెండ్షిప్' పేరుతో మరో ఊరు ఉంది. 1857లో న్యూయార్క్‌లోని 'ఫ్రెండ్షిప్' పట్టణం నుంచి వలస వెళ్లినవాళ్లందరూ కలిసి ఓ దగ్గరకు చేరి గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారట. కలిసికట్టుగా ఉండాలన్న ఆలోచనతో తమ సొంత ఊరి పేరునే కొత్త గ్రామానికి కూడా పెట్టుకున్నారు.

# వానలొస్తే ఏ నగరమైనా మునిగిపోతది

(మొదటి పేజీ తరువాయి)

మారాయి. 'శక్తిమంతమైన దేశంగా చెప్పుకునే అమెరికాలోని కాలిఫోర్నియా నగరం కూడా భారీ వర్షాల కారణంగా మునిగిపోతుంది. ప్రకృతిని ఎదుర్కోవడం ఎవరికీ సాధ్యం కాదు. భారీ వర్షాలు నష్టాన్ని కలిగిస్తాయి' అని పేర్కొన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు రక్షణ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన అంగీకరించారు. గురుగ్రామ్ అభివృద్ధి చెందుతున్న నగరమని తెలిపారు. భారీ వర్షాలను ఎదుర్కొనేలా వ్యవస్థలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

కుండపోత వర్షాల కారణంగా గురుగ్రామ్ లోని పలు ప్రాంతాలు నీట మునిగిపోయాయి. జలమయమైన రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలు నీట మునిగిపోయాయి. వీటికి సంబంధించిన వీడియోలను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వీటికి సంబంధించిన మీమ్స్ కూడా నెట్టింట వైరలయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీఎం పైవిధంగా స్పందించడం చర్చనీయాంశమైంది.

## అదృశ్యమైన 4గురు ప్రవాసీ వృద్ధులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. రోడ్డు పక్కన ఉన్న కట్టవైపు దూసుకెళ్లడంతో ఎవ్వరూ గమనించలేదని తెలుస్తోంది. జులై 29న అదృశ్యం కాగా వీరి వాహనం ప్రమాదానికి గురైనట్లు ఆగస్టు 2 రాత్రి పోలీసులు గుర్తించారు. ఆ నలుగురు చనిపోయినట్లు ధ్రువీకరించిన అధికారులు.. కారును కూడా స్వాధీనం చేసుకున్నారు.అంతకుముందు వీరి అదృశ్యానికి సంబంధించి గాలింపు చేపట్టిన పోలీసులు వారి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తులో భాగంగా చివరిసారిగా జులై 29న వీరు పెన్సిల్వేనియాలోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లినట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా గుర్తించారు. క్రెడిట్ కార్డును కూడా చివరిసారి అక్కడే వాడినట్లు తెలిసింది. నలుగురి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించిన పోలీసులు హెలికాప్టర్లనూ రంగంలోకి దించారు. చివరకు వారి అదృశ్యం ఇలా విషాదంతో ముగిసింది.

# టార్గెట్ కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

కారణం ఎవరు? ప్రాజెక్టు వ్యయం అంచనాలకు మించి భారీగా ఎందుకు పెరిగింది? ఐఏఎస్‌లు, ఇంజినీర్ల మధ్య సమన్వయ లోపానికి కారణం ఏంటి? గత ప్రభుత్వంలోని పాలకుల పాత్ర ఎంత? ఎవరిపై చర్యలు తీసుకోవాలి? వంటి విషయాలపై నేడు జరుగనున్న ప్రత్యేక క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ అందించిన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన ఆదివారం సచివాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముగ్గురు ఉన్నతాధికారుల కమిటీ హాజరైంది. రాష్ట్ర మంత్రివర్గానికి అందించాల్సిన కాళేశ్వరం నివేదికపై ఈ కమిటీలో సమావేశంలో చర్చించారు.

**టార్గెట్ కేసీఆర్ ?**

కాగా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలకు పూర్తిగా మాజీ సీఎం కేసీఆర్ కారణమనే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు చోటుచేసుకున్నాయనీ, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమనీ, వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్ట ప్రకారమే పనులు జరిగాయనీ, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నిర్ణయాలు తీసుకున్నారని స్పష్టం చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా ఆర్థిక అవకతవకలు జరిగాయనీ, ఐఏఎస్‌లకు, ప్రాజెక్టులో పని చేసిన ఇంజినీర్లకు మధ్య సమన్వయం లోపించిందనీ, ఈ కారణంగా ప్రాజెక్టులో పలు లోపాలు చోటు చేసుకున్నట్లు కమిషన్ నివేదికలో పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు మార్చడం, అంచనాలను పెంచడం, మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ మొదలుకుని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం, అన్నారం సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో



ఎప్పుడు ఏం జరిగింది ? రికార్డుల ఆధారంగా మొత్తంగా కేసీఆర్ బాధ్యుడని వివరంగా జస్టిస్ ఘోష్ ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. ఈ నివేదికపై మంత్రివర్గం వివరంగా చర్చించి ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి బాధ్యులు ఎవరు ? వారిపై ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

## పీవోకేలో పహల్గాం ఉగ్రవాది అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణ చోటు చేసుకొంది. స్థానికులను ఉగ్రవాదులు తమ ఆయుధాలతో భయపెట్టారు. దీంతో వారు ఆందోళనకు దిగారు తాహిర్ హబీబ్ తొలుత ఇస్లామిక్ జమాత్ తలాబా, స్టూడెంట్ లిబరేషన్ ఫ్రంట్‌లో పనిచేశాడు. అతడికి అఫ్గాని అనే మరో పేరు ఉంది. ఇదే ఇంటెలిజెన్స్ రికార్డుల్లో కూడా నమోదైంది. పాక్ సైన్యంతో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయి. అదే అతడిని ఉగ్రవాదిగా మార్చాయి. పహల్గాం ఉగ్రమూక శ్రీనగర్ లోనే అత్యంత ఎత్తైన మహాదేవ్ పర్వత పరిసరాల్లో నక్కినట్లు సమాచారం అందింది. ఇది 13,000 అడుగుల ఎత్తుతో ఏడాది పొడవునా మంచుతో కప్పి ఉంటుంది. గత ఆదివారం అర్ధరాత్రి దాటాక చైనా తయారీ ఎన్క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సెట్ 'టీ82' యాక్టివేట్ అయినట్లు భద్రతా దళాలు గుర్తించాయి. పహల్గాం ఉగ్రదాడిలో వీటిని వాడారు. దీంతో దళాలు అప్రమత్తమయ్యాయి. ఆ సెట్ లొకేషన్ డాచిగామ్ నేషనల్ పార్క్‌లో ఉన్నట్లు గుర్తించాయి. సైన్యం, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీస్ ఆపరేషన్‌కు సన్నాహాలు మొదలుపెట్టాయి. ఉదయం 11 గంటల సమయంలో ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించి మట్టుబెట్టాయి.

## అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఈసీ

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రాల ఎన్నికల విధానాలను మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని విరుచుకుపడ్డారు. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. చిదంబరం తన పోస్టుకు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి.

## పాదయాత్రకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

కార్యాచరణలో పాల్గొనేందుకు టీపీసీసీ నేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు.
ఈ సందర్భంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రేపు రేపు ఉదయం 9 గంటలకు చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి నాగపూర్ వరకు కార్యకర్తలతో కలిసి ప్రత్యేక రైలులో ప్రయాణించనున్నారు.
ఆమెతో పాటు ప్రత్యేక రైలులో కొందరు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తదితరులు పయనిస్తారు. ఈ సందర్భంగా జనహిత పాదయాత్రకు బ్రేక్ పడనుంది.

## ఎల్లుండి ఢిల్లీలో ఈసీ కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అందించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలోని ఉన్నత స్థాయి బృందం ఢిల్లీకి వెళ్లనున్నది. ఈ బృందంతో పార్టీ సీనియర్ నేతలతో పాటు, ప్రస్తుత ఎంపీలు, మాజీ ఎంపీలు సభ్యులుగా ఉండనున్నారు.

రాజ్యసభలో బీఆర్ఎస్ పక్షనేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ బృందంలో సభ్యులు. సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తదితర కీలక అంశాలపై చర్చించే అవకాశాలున్నాయి. పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. త్వరలోనే పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. బిహార్తో పాటు పలు రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - డ్రైవ్ పెద్ద ఎత్తున దుమారం రేగుతున్నది. ఈ క్రమంలోనే ఈసీ సమావేశం నిర్వహించనుండడం గమనార్హం. ప్రస్తుతం సర్ అంశంపై ప్రతిపక్షం కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ లోక్‌సభ, రాజ్యసభను స్తంభింపజేస్తున్నాయి.

## హసీనాపై విచారణ షురూ

(మొదటి పేజీ తరువాయి)

విధించాలన్నారు. ఈ కేసుల్లో మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజీపీ చౌదురీ అబ్దుల్లా అల్ మామున్లు సహ నిందితులుగా ఉన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో గత ఏడాది జులై-ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు హసీనా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. భారీ సంఖ్యలో ఉద్యమకారులను చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలను ఆమెపై మోపారు. వీటిపై ఐసీటీ నేడు విచారణను ప్రారంభించింది. హసీనా, అసదుజ్జమాన్లు ఇప్పటికే దేశాన్ని వీడారు. మామున్ ఒక్కరే కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో సాక్షిగా మారేందుకు ఆయన అంగీకరించినట్లు తెలుస్తోంది. నిరసనల సమయంలో గాయపడిన వ్యక్తులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి ఆధారాలు సమర్పిస్తామని ప్రాసిక్యూషన్ తెలిపింది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా.. భారత్లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు హోంశాఖ మాజీ మంత్రి కూడా బంగ్లాదేశ్‌ను వీడారు. ఈ క్రమంలోనే స్థానికంగా నోబెల్ పురస్కార గ్రహీత యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ఆయా కేసుల్లో విచారణ కోసం హసీనాను అప్పగించాలని భారత్ ను అభ్యర్థిస్తోంది. ఇదిలా ఉండగా.. జులై 10న హసీనా, కమల్, మామున్లపై ఐసీటీ అభియోగాలు మోపింది. అంతకుముందు కోర్టు ధిక్కరణ కేసులో ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

# ఖండించిన ఎన్నికల సంఘం

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది' అని పి.చిదంబరం ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రం నుంచి శాశ్వతంగా వలస వెళ్లారనే కారణంతో బీహార్లోని లక్షలాది మంది ఓటర్లను తొలగించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ధరణకు వచ్చిందని ప్రశ్నించారు. ఈసీ తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు.

చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంటూ ఎన్నికల సంఘం ఖండించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి ఢిల్లీలో నివసిస్తున్నట్లయితే.. ఢిల్లీలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. అలాగే బీహార్కు చెందిన వ్యక్తి చెన్నైలో ఉంటే.. అదే విధానం వర్తిస్తుందని తెలిపింది..

చిదంబరం వ్యాఖ్యలను నిరాధారమైనవిగా, తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంటూ ఎన్నికల సంఘం ఖండించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 19(బీ) ప్రకారం.. ఒక నియోజకవర్గంలో నివసిస్తున్న వ్యక్తి స్థానిక ఓటర్ల జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడానికి అర్హుడని పేర్కొంది. త

ఈ నేపథ్యంలో.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నేతలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం తగదని ఈసీ పేర్కొంది. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. అదేవిధంగా.. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్ల నమోదు గురించి తప్పుడు ప్రచారం జరుగుతోందని చెప్పింది. ఆ రాష్ట్రంలో ఇంకా ఓటర్ల జాబితా సవరణ చేపట్టలేదని.. కాబట్టి బీహార్లోని ఎస్ఐఆర్ ప్రక్రియతో ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేసింది.

## 'ఆ ఓటరు కార్డు అప్పగించండి'

**ఆర్‌జేడీ నేత తేజస్వీకి ఈసీ నోటీసులు**

పాట్నా, ఆగస్టు 3: బీహార్ ఓటర్ల జాబితా ముసాయిదాలో తన పేరు లేదని ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ ఆరోపించడంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి స్పందించింది. ఆ కార్డు అధికారికంగా జారీ చేసింది కాదని, సమగ్ర దర్యాప్తు జరిపేందుకు దానిని అప్పగించాలంటూ నోటీసులు జారీ చేసింది.'ఆగస్టు 2న పాట్నాలో విలేకరుల సమావేశంలో తేజస్వీ చూపించిన గుర్తింపు కార్డు అధికారికంగా జారీ చేసింది కాదు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఆ కార్డును అప్పగించాలని కోరుతున్నాం' అని పేర్కొంటూ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌కు ఎన్నికల సంఘం అధికారులు లేఖ రాశారు. మరోవైపు తన ఓటరు కార్డు నంబరు మార్చారని తేజస్వీ చేసిన వాదనను జిల్లా కలెక్టర్ తిరస్కరించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న ఓటరు గుర్తింపు నంబరు కూడా ఇదేనన్నారు.

మరోవైపు ఓటరు గుర్తింపు కార్డుపై తేజస్వీ యాదవ్ చేసిన ఆరోపణలపై బీహార్‌లోని ఎన్డీయే కూటమి పక్షాలు మండిపడ్డాయి.

# సింగరేణిలో రాజకీయ కక్ష పూరిత బదిలీలు

- **ఎస్డిల్ యాక్టింగ్ ఆపరేటర్ రాచపల్లి శ్రావణ్ మరణం దురదృష్టకరం**
- **యాజమాన్య అశ్రద్ధ వల్లే సింగరేణిలో కార్మికుల ప్రమాదాలు**
- **రాజకీయ జోక్యం, మంత్రులు ఎమ్మెల్యేలు ఆధిపత్యం నడుస్తుంది**
- **హామీల అమలుజేయకుంటే సింగరేణి వ్యాప్తంగా పోరాటాలు చేస్తాం మాజీ మంత్రి, టీబీజీకేస్ ఇంచార్జ్ కొప్పుల ఈశ్వర్ ద్వజం**



హైదరాబాద్, మనం ప్రతినిధి: సింగరేణిలో 9 నెలల తర్వాత జూలై 30 31న జరిగిన మెడికల్ బోర్డులో పిలిచిన ఉద్యోగుల్లో యాబై ఐదు మందిలో కేవలం ఐదుగురిని మాత్రమే అన్‌ఫిట్ చేయడం దారుణమని మాజీ మంత్రి కొప్పుల వ్యాఖ్యానించారు. మైనింగ్ స్టాఫ్‌ను సూటబుల్ జాబ్ అని చెప్పి జనరల్ అసిస్టెంట్‌గా మార్చడం గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం అని ఆయన పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ వందకు వంద శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారని, మెడికల్ బోర్డుకి ఇబ్బంది జరుగుతుందని 80 నుండి 90% ఇన్వాల్యుయేషన్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సింగరేణి లో 19 వేల మందికి ఉద్యోగాలు కల్పించారని, కానీ ఇప్పటి పరిస్థితిని చూస్తే రాబోయే రోజుల్లో కారుణ్య నియామకాలను కనుమరుగు చేసే పరిస్థితి కనబడుతుందని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయి మంత్రులు ఎమ్మెల్యేలు ఆధిపత్యం నడుస్తుందని టీబీజీకేస్‌లో పనిచేసే నాయకులను ఇబ్బంది పెట్టే కుట్రలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ జోక్యంతో బదిలీ అయినా టీబీజీకేస్ నాయకులు మాదాసు రామ్మూర్తి, జావిద్ పాషా, కొమురయరల కక్ష పూరితమైన బదిలీలను వెంటనే రద్దు చేయాలని యాజమాన్యాన్ని కోరామని తెలిపారు.

సింగరేణిలో రక్షణ వైఫల్యాలు జరుగుతున్నాయని మందమర్రిలో జరిగిన ప్రమాదంలో ఎస్డిల్ యాక్టింగ్ ఆపరేటర్ రాచపల్లి శ్రావణ్ కుమార్ మరణం దురదృష్టకరమని అన్నారు. రక్షణ కమిటీ సమావేశాలు జరగడం లేదని, యాజమాన్యం సింగరేణి కార్మికుల రక్షణ పై ఎలాంటి శ్రద్ధ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మెడికల్ బోర్డులు అప్లై చేసుకున్న వారందరిని వందశాతం అన్ఫిట్ చేస్తామని ఎలక్షన్ల ముందు వాగ్దానాలు చేసి ఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికుల నోట్లో మట్టి కొట్టారని, 30 31 తారీఖున జరిగిన మెడికల్ బోర్డును పునః సమీక్షించి కార్మికులకు న్యాయం చేయాలి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, టిబిజికేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, మాదాసు రామ్మూర్తి, నూనె కొమరయ్య, వడ్డేపల్లి శంకర్, నాగెల్లి సాంబయ్య, మేడిపల్లి సంపత్, చెల్పూరి సతీష్, మాకు రమేష్, అన్వేష్ రెడ్డి, పొశం శ్రీనివాస్ రెడ్డి, ముదంనపల్లి రాజేశం, చిలకలపల్లి శ్రీనివాస్, చల్లా రవీందర్ రెడ్డి, దూట శేషగిరి, కొండ్ర అంజయ్య, వాసార్ల జోసెఫ్, బొడ్డు రమేష్, రొడ్డ సంపత్, పులిపాక శంకర్, మీసరాజు, మురళి, అధిక సంఖ్యలో టీబీజీకేస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరవయ్యేళ్ళకు సరిపడా విద్యుత్

- పంపుడ్ స్టోరేజీని వినియోగంలోకి తీసుకోవాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కొల్లాపూర్లో ట్రాన్స్కో, జెన్కో ఉన్నతాధికారులతో సమీక్ష



**నాగర్ కర్నూల్, ఆగస్టు 03(మనం ప్రతినిధి):** హైడల్ పవర్ తోబాటు పంపడ్ స్టోరేజీతో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద ఆదివారం జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈమేరకు రాష్ట్రంలో 23 పాయింట్స్ ను గుర్తించి వాటి మీద సమగ్రమైన రిపోర్ట్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం విద్యుత్ అధికారులను ఆదేశించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణా నది మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టులను సమీక్ష చేసి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైతే ప్రపంచ పేరు గాంచిన కన్సల్టెంట్ల సేవలను ఉపయోగించుకోవాలన్నారు. సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తిని స్టోరేజ్ చేసి రాత్రి వేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికకు అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించుకోవాలన్నారు. ముందు చూపుతో అత్యాధునికమైన సాంకేతికతను పరిచయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 1978లోనే లోతుగా అధ్యయనం చేసి రివర్స్ పంపింగ్ కోసం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జపాన్ కు చెందిన తొషిభా, మిట్ సుబిషిలాంటి దిగ్గజ సంస్థల సాంకేతికతను ఉపయోగించడంపట్ల ముందు చూపును, వారి సేవలను డిప్యూటీ సీఎం కొనియాడారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్ ను ఉత్పత్తి చేసి అందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండును దృష్టిలో పెట్టుకుని రాబోయే ఇరవై ఇండ్లకు సరిపడా విద్యుత్తు డిమాండుకు అవసరమైన ఉత్పత్తినీ అందుకోవడానికి, జెన్కో అధికారులు, డైరెక్టర్స్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ లో రాష్ట్రంలో పెరుగుతున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే పది, ఇరవై ఏళ్ల అవసరాలకు సరిపడ విద్యుత్తు ఉత్పత్తిని అందించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సింది గా అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఈ సంవత్సరం నిరంతరాయంగా డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్తు ను అందించిన సిబ్బందిని అభినందించారు. సీఎండీ నుంచి కింది సిబ్బంది దాకా వాళ్ళకి అవసరమైన సాంకేతికతను పెంపొందించుకోవడానికి మూడు రోజుల ట్రైనింగ్ కోసం అవసరమైన సిలబస్ రూపకల్పనతో పాటు అవసరమైన నిపుణుల పర్యవేక్షణలో ట్రైనింగ్ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైన టెక్ ఎక్స్పోజర్ ఉన్న నిపుణుల ఆధ్వర్యంలో సిలబస్ ట్రైనింగ్ మాడ్యూల్ తాయారు చెయ్యాలని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్, ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్ థర్మల్ పవర్, పవన విద్యుత్తు, అణువిద్యుత్తు, బ్యాటరీ స్టోరేజ్ లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్తు కోసం వినియోగాన్ని ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేసుకోవాలన్నారు.

## ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్తో టీపీసీసి రాష్ట్ర కార్యదర్శి



తుర్క యంజాల్, ఆగస్టు 3( మనం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ జనహిత పాదయాత్ర లో తెలంగాణ పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్తో పాటు ఆదివారం పాదయాత్రలో పాల్గొన్న టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, జనహిత పాదయాత్రలో నాలుగవ రోజు నిజమాబాదులో పాదయాత్ర శ్రమదానం కళాశాలలో పరిశుభ్రత పనుల్లో స్వయంగా పాలు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజ నర్సింహ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల16లు విరాళం



**చేవెళ్ల, ఆగస్టు 3(మనం న్యూస్ ):** దేవాలయాల నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బాసగళ్ళ నర్సమ్మ ఆలయ నిర్మాణానికి తన వంతు కృషిగా రూ.2లక్షల16లు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## మొక్కలను సంరక్షించాలి



- బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఎండీ ఆసిఫ్

**చేవెళ్ల, ఆగస్టు 3(మనం న్యూస్ ):** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు ఎండి. ఆసిఫ్ అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఊరెళ్ళవార్డులో స్నేహితుల దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో రవి, రాజు, విజయ్ కుమార్, రామకృష్ణ, అమీర్, ముస్తాక్, అరుణ్ కుమార్, ఫైజన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**కడ్తాల్, ఆగస్టు 03 ( మనం, న్యూస్ ) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో పెద్దమోని రాములయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా అధైర్య పడొద్దు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇస్తారి బైకు ప్రమాదంలో కాలు విరిగిపోయింది. ఇంటి వద్దఉన్న ఆయనను పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పిటిసి దశరథ నాయక్, సభావాత్ శ్రీను నాయక్, వెంకటేష్,కాళిదాసు, నాగరాజు, శ్రీశైలం, శ్రీకాంత్ యాదవ్, బండారి నరసింహ, నేనావత్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



**చేవెళ్ల, ఆగస్టు 3(మనం న్యూస్ ):** కార్మికుల ఆకుల కోసం వరసీల పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్ గూడ చౌరస్తాలో సిఐటియూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని వెల్లడించారు. కార్మికుల హక్కుల కోసం పాలకవర్గాలతో పోరాటం చేస్తూ కార్మికుల గుండెల్లో సిఐటియు ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోర్సుగా తీసుకువచ్చారని ఫలితంగా ఎనిమిది గంటల పని విధానం పోయి 12 గంటలకు పెరిగే ప్రమాదం ఉందన్నారు. చందన్ వెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో కంపెనీ కార్మికులకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ కంపెనీలు వలస కార్మికులతో వెట్టిచాకి చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని అయినప్పటికీ కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. కార్మికులకు ఏ సమస్య ఉన్న సిఐటియు ముందుండి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి భీమయ్య, మండల నాయకులు అంజయ్య, రైతు సంఘం నాయకులు బాల రాజ్, షాబాద్ మండల సిఐటియు నాయకులు మానయ్య, సాయిలు, నర్సింలు పాల్గొన్నారు.



చిగురు మామిడి మనం విలేకరి శేషం నరసింహ చార్యులు (చారి) చిన్న కుమారుడు శేషం నవీన్ కుమార్, బృందావనం ధరణి ల ఎంగేజ్మెంట్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మనం ఎడిటర్ ఉప్పరి రమేష్ కుమార్ ఇతర జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు.

## పేదింటి వివాహానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**కడ్తాల్, ఆగస్టు 03 ( మనం, న్యూస్ ) :** పేదింటి వివాహానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ కొండంత భరోసానిస్తుంది. ట్రస్ట్ అధినేత మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ పేదింటి ఆడపిల్ల వివాహానికి మేనమామ కట్నం కింద 21వేల రూపాయిల ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందిస్తున్నారు. ఆదివారం కడ్తాల్ మండలలోని గానుగమర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని కానుగబాయి తండాకు చెందిన నెనావత్ దేవి కిషన్ దంపతుల కుమార్తె మీనా వివాహానికి 21వేల ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను ట్రస్ట్ చైర్మెన్ దశరథ్ నాయక్ చేతుల మీదుగా అందించారు. దానికి తోడు మీనా వివాహానికి మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ. 5వేలు, డైరెక్టర్ సేవ్య 5వేలు, మాజీ ఉపసర్పంచ్ శారద పాండు, శ్రీను,లక్ష్మణ్, శ్రీను, ఆర్థిక సహాయం అందించగా,. అలాగే రేఖ్య తండ గ్రామపంచాయతీ పరిధిలోని టాక్ రాజ్ గూడ గ్రామపంచాయతీకి చెందిన వడ్త్యావత్ అనిత దేవుల దంపతుల కుమార్తె నిహారిక వివాహానికి ట్రస్టు ద్వారా 21 వేల రూపాయలతో పాటు పట్టుచీరను కానుకగా అందించారు. కోట్య 10వేలు నిహారిక కు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, సులోచన సాయిలు, మాజీ ఎంపిటీసీలు ప్రియా రమేష్, మంజుల చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, జగన్, నాయకులు రాములు నాయక్, ధర్మ, కృష్ణయ్య, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, చందు, పాండు, రాజు, శ్రీకాంత్, మహేష్, చందర్, రాజేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల చైతన్యమే గ్రామీణ మాస్ కమిటీల ఏర్పాటు

- అట్టడుగు స్థాయి నుండి బీసీల ఉద్యమం బలంగా నిర్మించాలి
- బీసీ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు



**తుర్కయంజాల్, ఆగస్టు 3( మనం న్యూస్ ):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి అంబేద్కర్ చౌరస్తాలో మన ఆలోచన సాధన సమితి బీసీల చైతన్యమే మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, పిలుపు మేరకు, ప్రధాన కార్యదర్శి యల్లావుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మన ఆలోచన సాధన సమితి బీసీల ఐక్యత కోసం జెండా ఆవిష్కరణ చేశాము . ప్రధాన కార్యదర్శి యల్లావుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, 37 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరణ సమావేశాలు నిర్వహించబడ్డాయి. రెండో విడత 3 వ తేదీ ఆదివారం రోజు 515 గ్రామాలలో బీసీల జెండా ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా జరుపుకున్నాము. వచ్చే దసరా పండుగ వరకు సుమారు 200 మండలాల్లో మాస్ కమిటీల ఏర్పాటులో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, మరియు నాయకత్వ నిర్మాణం పూర్తి చేయడమే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మన ఆలోచన సాధన సమితి బీసీ ఉద్యమం బలంగా నిర్మించాలని, రాజకీయ పార్టీలకు అతీతంగా క్రియాశీలకంగా ప్రతి ఒక్కరిని కదిలించాలని నిర్ణయం తీసుకున్నాము. మన బీసీల ఆలోచన సాధన సమితిలో అందరిని, కలుపుకొని ముందుకు సాగుదామని బీసీల ఐక్యతతో ప్రతి ఒక్కరూ అడుగులో అడుగేస్తూ కదం తొక్కుతామని, బీసీల చైతన్యమే లక్ష్యంగా భావిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి జక్కుల బాలరాజు యాదవ్, శశి కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, రాజేష్ యాదవ్, హుస్సేన్, పాణికంటి వెంకటయ్య, జెల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ నగరంలో నాకాబందీ

**కరీంనగర్, ఆగస్టు 3(మనంప్రతినిధి):** శాంతిభద్రతల పర్యవేక్షణ, పరిరక్షణలో భాగంగా, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని 20 ప్రధాన కూడళ్ళ వద్ద దాదాపు 150 మంది పోలీసులతో నాఖబంది నిర్వహించి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొత్తం 151 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రివెంటివ్ చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు .మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని, నంబర్ ప్లేట్ లేని టాంపర్ చేసిన వాహనాలను, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం అని తెలిపారు.

**సీజ్ చేసిన వాహనాల వివరాలు.**

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ53 పట్టుబడినవి,నంబర్ ప్లేట్ సరిగా లేని లేదా టాంపర్ చేసినవి 80,సరైన ధ్రువపత్రాలు 11 లేనివి, నంబర్ ప్లేట్ లేనివి 7 వాహనాలు.ఈ ఆకస్మిక తనిఖీలు



భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలను సరైన ధ్రువపత్రాలతో, నిబంధనలకు అనుగుణంగా నడపాలని సూచించారు

## రామగిరి ఖిల్లాను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**రామగిరి, ఆగస్టు 03 (మనం న్యూస్):** రామగిరి మండలం లోని రామగిరి ఖిలా ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు అలాగే మంథని నియోజకవర్గాన్ని శాంతియుత నియోజకవర్గంగా కాంగ్రెస్ ప్రభుత్వం నడిపిస్తుందని ఎవరైనా అశాంతికి గురి చేస్తే వారికి పుట్టగతులు ఉండవు అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం రాత్రి కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభినందన సభ సభ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం ఎవరి చుట్టం కాదు వారి పని వారు చేసుకోబోతుందని ఎవరైనా గ్రామాల్లో అలజడి సృష్టిస్తే వారిని పోలీసులు క్షమించారని అన్నారు. గతం సర్కారు హయాంలో వైనాల రాజును మద్దెల రాజయ్యను మరో ఎందరినో ఇబ్బందులకు గురి చేసిన దాఖలాలు ఉన్నాయని ఈ సర్కార్ లో ఎవరిని ఇబ్బందులకు గురి చేయమని అన్నారు. కష్టపడ్డ వారికే కాంగ్రెస్ లో పదవులు ఉంటాయని ముందే చెప్పామని దీనికి ఉదాహరణగా కమాన్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజుకు అలాగే వైస్ చైర్మన్ గా మధ్యల రాజయ్య తో పాటు డైరెక్టర్ పదవులు ఇవ్వడం జరిగిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల్లో అవకాశం ఇవ్వడం జరుగుతుందని వారిని గుర్తించామని త్వరలోనే శ్రీ ఆది వరాహ స్వామి పాలక మండలిని ప్రకటిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఓటు వేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని అన్నారు. కమాన్ పూర్ నుండి పెంచికలపేట వరకు అలాగే మండల వాగు బ్రిడ్జి పనుల కు ఒక్కో దానికి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని అన్నారు. అలాగేరామగిరి ఖిలా ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దామని దీనికిగాను కేంద్రం నుండి కూడా నిధులు తెప్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇది దివ్య ఔషధాల మొక్కలకు నిలయంగా మారిందని అన్నారు. కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అధునాతనమైన మార్కెట్ యార్డ్ తో పాటు మార్కెట్ భవనాన్ని త్వరలోనే నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని అన్నారు. కమాన్ పూర్ లో గ్రంథాలయ భవనాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కమాన్ పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్లో టూ టీఎంసీ ఎల్లంపల్లి నుండి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రస్తుతం దాన్ని పెంచే యోచనలో ప్రభుత్వం ఉందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులే చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంథని నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు డైరెక్టర్లు మాజీ ఎంపీపీ మారుతి, ఏఎంసీ సెక్రటరీ సురేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, చొప్పరి సదానందం, నడిపల్లి సూరజ్ రావు, వైనాల వినోద్, డైరెక్టర్లు గుమ్మడి వెంకన్న, అబ్దుల్ రఫీ, గుగులోతు ప్రవీణ్ కుమార్, పుల్లెల కిరణ్ ఆర్ఎల్లి శ్రీనివాస్, ముసుగుల నరేందర్ రెడ్డి, జాగిరి సమ్మయ్య, సిద్ధం మురళీకృష్ణ, బి బుచ్చారావు, గుండా భాస్కర్, సురభి జగన్మోహన్ రావు, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**మెమొంటోలు అందజేసిన మంత్రి శ్రీధర్ బాబు**

కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గానికి మెమొంటోలు ను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అందజేశారు. వైనాల రాజు ఆధ్వర్యంలో తయారుచేయించిన మెమొంటో ను ముందుగా దివంగత స్పీకర్ శ్రీపాదరావు మెమొంటో ను వైనాల రాజు మంత్రి శ్రీధర్ బాబుకు అందజేశారు. అనంతరం డైరెక్టర్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు మరియు ఇతరులకు అందజేయడం జరిగింది.



## నాయకుడు!

ముక్తకంఠపు మాటలు,
తూటాలై గుచ్చుతుంటే
పరిష్కారం ఏది?
అర్థం లేని పెనుగులాటలు
అపార్థాలకు తావిస్తుంటే
వివరణ ఏది?

మధుర జ్ఞాపకాలు
కళ్ల ముందు మెరుస్తుంటే
సాంత్వన ఏది?

అలసిన హృదయాలు
శోకసంద్రంలో మునుగుతుంటే
ఓదార్పు ఏది?

ఆహారం కరువై
అన్నజీవులు అల్లాడుతుంటే
అంతం ఏది?

అమాయక ప్రాణాలు
మట్టిలో కలుస్తుంటే
ముగింపు ఏది?

భావితరం వనరులు
ప్రశ్నలై సంధిస్తుంటే
జవాబు ఏది?

అకారణంగా రాజుకున్న అగ్గి
రక్తమై పారుతుంటే
భద్రత ఏది?

సింహాసనం ఎక్కి,
అగ్నికి ఆజ్యం పోసి
నిప్పు ఎగదోస్తే
నాయకుడు కాదు

ఆయుధాల కంటే,
అక్షరాలను ఎంచుకున్నవాడే
అసలైన నాయకుడు!!

- దివిజ

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

- ఎడిటర్

# 'కోసలి' సామాజిక కవి హల్ధార్ నాగ్



భారతీయ సాహిత్య చరిత్రలో కొన్ని అద్భుతాలు జరిగిన సందర్భాలు ఎన్నో! అలాంటిదే ఆశ్చర్యకరమైన సంఘటన ఒకటి 1991లో ప్రప్రథమంగా కోసలి సాహిత్య చరిత్రలో చోటు చేసుకున్నది. కోసలి భాష ఒరియా భాషకు అనుబంధం. అప్పుడు వేదికపైన ఓ నిరుపేద మూడవ తరగతి మధ్యలోనే మానేసిన పిల్లాడు. అతడు కోసలిలో తన కవితను ఆలపిస్తూ ప్రతిభ కనబరిచాడు. అతడే కోసలి సాహిత్య గాయకుడు (బార్డ్), ప్రముఖ కవి హల్ధార్ నాగ్. హల్ధర్ నాగ్ నిరుపేద కుటుంబంలో ఒరిస్సాలోని బార్‌ఘర్ జిల్లాలో గల ఘెన్స్ గ్రామంలో జన్మించారు. భారత్ బానర్ పై నిర్మించిన వెయ్యి లఘు చిత్రాలలో నాగ్ ను డాక్యుమెంటరీ డైరెక్టర్ భరత్ బాలా ఎంచుకున్నారు.



ప్రఖ్యాత ఉర్దూ కవి గుల్జార్ హల్ధర్ నాగ్ రచనలు జీవితంపై దాదాపు 8 నిమిషాలు వివరించారు. 'నాగ్ ఎంచుకున్న కవిత్వం కావ్యాంజలి' శీర్షికన సురేంద్రనాథ్ చేసిన ఆంగ్ల అనువాదంతో నాగ్ బాగా పేరుపొందారు. హల్ధర్ నాగ్‌కు 2019లో సంబల్పూర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీ ఇచ్చి సత్కరించింది. మూడవ తరగతిలోనే చదువుకు స్వస్తి పలికిన హల్ధార్ రాసే కవిత్వం సాంద్రంగా లోతుగా విశాలంగా పరుచుకున్న ఆలోచనల గని. అది అంలంకారాల వ్యక్తీకరణలతో ఉంటుంది. అతనికి తెలికుండానే రూపకాలు, అనుకరణలు, అంతర్గత ప్రాస వ్యక్తీకరణతో,ధ్వనిలా శబ్దించే పదాలతో ఉన్న ఒనమటోపియా లక్షణాల ప్రభావం పుష్కలంగా అల్లుకోవడం హల్ధార్ కవిత్వంలో కనిపిస్తుంది. ఆతని కవితల్లో ఘెన్సాలి నది యొక్క గొప్ప వ్యక్తీకరణ కనిపిస్తుంది. ఇక్కడ ఉత్సాహంగా ఒక చిన్న అమ్మాయిగా ప్రవహించే నదిని రూప వ్యక్తీకరణగా భావోద్వేగంగా కవి పేర్కొంటాడు. హల్ధర్ యొక్క సోనెట్స్‌ను ఎక్కువగా అధ్యయనం చేయాలి. నియమబద్ధ ప్రాసతో ఉంటాయి. 'ఈ సృజన ఎవరినైనా ఆశ్చర్యపరుస్తుంది. కారణం హల్ధార్ కవిత్వంలో గ్రాడ్యుయేషన్ చేసుంటే దైవికంగానే ఈ సాహిత్య ప్రయోగాలన్నీ అతనికి మెదడులో నాటుకోవచ్చని భావించాలి. అచ్చంగా అలాంటి భావనే నాలో ఉంది' అంటాడు అనువాదకుడు సురేంద్రనాథ్ ఒక సందర్భంలో. ఇక ధ్వని ప్రభావం(సౌండ్ ఎఫెక్ట్ ) కోసం హల్ధర్ 'ఛేతర్ సకాల్' (మార్చి ఉదయం) సోనేట్‌లో గమనించవచ్చు హల్ధర్ సోనెట్స్‌లోని ప్రత్యేకత.

పన్నెండు చరణాలున్న సోనెట్ అది. ఒనోమాటో పోయిక్ రచనలలో ఇతర భాషలో ప్రత్యేక ప్రభావాన్ని కాపాడుకోవాల్సిన అనువాదకుడి పట్ల జాలి పడాలి. 'నేను మరోసారి అనువాద పరిమితులను ఆశ్రయించి విషయాన్ని స్పష్టంగా తెలుపుతున్నాను, అనువాదాలు ఎప్పటికీ మూల రచన అందాన్ని పొందలేవు. మనం మూలాన్ని ఆకర్షణీయమైన పెయింటింగ్‌తో అనుకుంటే గొప్ప అనువాదం కూడా పేయింటింగ్ యొక్క ప్రతిరూపం లేదా ఛాయాచిత్రంగా ఉండవచ్చు' అంటాడు కావ్యాంజలి సురేంద్రనాథ్ అనువాదకుడు.' హల్ధర్‌నాగ్ కవిత్వంలో మడత (ట్విస్ట్)ముఖ్య లక్షణంగా ఉంది. దాన్నే నేను హల్ధర్ ట్విస్ట్ అని పిలుస్తాను'అంటాడు కూడా అనువాదకుడు. అతని కవితలలో చివరి చరణంలోని ఆశ్చర్యకరమైన మలుపు పాఠకులకు 'వావ్'అనే అనిర్వచనీయ ప్రభావాన్ని కలిగిస్తుంది. మూడు కవితలు నా తెలుగు అనువాదంతో

హల్ధర్ నాగ్ శీర్షికతో ...'ఏవరైతే ఓటమిని ఎప్పటికీ అంగీకరించరో/అలాంటివారే మన అందరికీ హలధర్ నాగ్'

దనం లేకుండుడు శీర్షిక తో...'మానవత్వం ఎందుకు నేడు ఆలసింది,/కళ్ళలో కూడా కన్నీరు నిండింది' ఇలా ఈ సంకలనంలో చాలా కవితలు హల్ధర్ ట్విస్టు్ను ప్రదర్శిస్తాయి. మా గ్రామ దహన సంస్కారాల స్థలం, ఒక క్యూబిట్ టాలర్, ది డవ్ ఈజ్ మై టీచర్, ఓల్ బన్యన్ ట్రీ వంటి కవితలూ పేర్కొనవచ్చు అంటారు అనువాదకుడు ముందు మాటలో.

హల్ధర్ నాగ్ మార్చి 31, 1950న బార్ఘర్ జిల్లా ఒడిశాలోని ఘేన్స్ ఊరులో జన్మిం చాడు. ఆయన భార్య మాలతి నాగ్, వారికి ఒక కుమార్తె ఉంది. నిరుపేదగా పుట్టిన హల్ధార్ చిన్నప్పుడే బడి మానేసి కుటుంబ జీవనోపాధికై గిన్నెలు తోమే పని చేశారు. చిన్నా చితక పనులూ చేశారు. ఆ గ్రామ సర్పంచ్ చొరవతో హైస్కూల్ లో 10 ఏండ్లు కుక్ గా పనిచేశాడు. అప్పుడు అప్పుచేసి బడికి దగ్గరే ఒక చిన్నపాటి స్టేషనరీ షాప్ పెట్టాడు.అక్కడే నాగ్ కు సాహిత్య రచనపై ఆసక్తి కలిగింది.రచనలు చేశాడు.మొదటి కవిత 'పాత మర్రిచెట్టు' (ధోడా బార్గచ్/ఓల్ బనియన్ టీ) 1990లో స్థానిక పత్రికలో అచ్చైంది. దాంతో ఆయనకు మంచి పేరు వచ్చింది.

అంచెలంచెలుగా ఎదిగి నాగ్ మంచి కవిగా నిలబడ్డాడు. మరోవైపు ఆయన రచనలపై పరిశోధన చేసి పి.హెచ్ డి. కొరకు విద్యార్థులు ఐదుగురు థీసీస్ సమర్పించారు. అతని రచనలను సంబల్పూర్ విశ్వవిద్యాలయం హల్ధర్ గ్రంథబాలి -2 పేరుతో సంకలనంచేసి, దానిని సిలబస్‌లో ఒక భాగంగా చేర్చింది. హల్ధర్ సామాన్యమనిషి, ఆయన వస్త్రధారణ కూడా అతి సాధారణంగా ఉంటుంది.తెల్ల పంచె,బనీన్ ఆయన రోజూ వేసుకునే బట్టలు. ఒకచోట కవిత్వం గురించి హల్ధర్ 'నా దృష్టిలో కవిత్వానికి వాస్తవిక జీవితంతో సంబంధం ఉండాలి' అంటూ 'అది ప్రజలకు ఓ గొప్ప సందేశాన్ని పంపాలి'అని చెప్తాడు. నేటి సాహిత్యలోకంలో ఈ మాట చెప్పేవాళ్ళు ఎక్కవే ఉండొచ్చు కానీ ఆచరించే వారు వేళ్ళమీదనే.

హల్ధార్ రచనాశైలిలో అతన్ని గంగాధర్ మెహతా గొప్పగా ప్రశంసిస్తూ 'అతని కవిత్వ రచనలో మానవీయత, మనిషిపట్ల గౌరవం వంటి అంశాలు ఉంటాయి. ఆ రచనలో స్వీయ, సామాజిక సంస్కరణలో ఒక పోరాట యోధుడు కనిపిస్తాడు' అంటారు. ఇక సంబల్పురి శైలి రచనను ఇష్టపడే జనం హల్ధర్‌ను బాగా ప్రోత్సాహించారని నాగ్ ఓ సందర్భంలో చెప్పాడు. అలాగే 'నన్ను సత్కరించారు. ఇది మరింత ఎక్కువ రాయడానికి నన్ను ప్రోత్సాహించింది' అంటారు కవి హల్ధార్.

హల్ధర్ నాగ్ చిన్న కవితలు,దీర్ఘ కవితలు,నాలుగు పాదాల సోనెట్స్ రాశాడు. వాటిలో మచ్చుకు కొన్ని నా తెలుగు అనువాదంతో అందిస్తున్నాను.

'టికర్పాడ వేశ్య' అనేది నీతిమాలిన ప్రజలపై విమర్శానాత్మ సంకేత భాష. ఒక వేశ్యకు, ఒక మనిషి నీతిలేని పనులు మాని పెండ్లి చేసుకొని కుటుంబ జీవితం గౌరవంగా గడుపని సూచించగా, ఆమె 'సమాజాన్ని ఎండగడుతూ ఎవరూ అంతఃసౌందర్యాన్ని చూడరగానీ అందరికీ డబ్బు కావాలని, వరకట్నానికి నా దగ్గర సరిపడ డబ్బు ఉంటేనే నాకు భర్త వస్తాడు' అంది.

ఆ సందర్భంలో హల్ధార్ కవితకు నా తెలుగు అనువాదం...'నా ఒళ్ళు అమ్ముకొని సంపాదించిన సొమ్మును/ నేను ఖర్చు చేస్తా/ ధనదాహాన్ని ఖరీదు చేసేందుకు,

నేను ఎప్పుడైనా కొత్తగాపెళ్ళైన వధువుగా వెళ్లినప్పుడు' హల్ధర్ వరకట్న మహమ్మారిపై ఎక్కుపెట్టిన బాణం వేశ్య పాత్రధారి మనసులో దూరి వినిపించారు.

ఇక్కడ హల్ధార్ ఓ కవితలో

'ఆవిష్కరణలేని పాడబడని ఆమె/ మొత్తం ఏడు రామాయణ గ్రంథాలలో/నాలోని కవికి ఆమె సతి/ పవిత్రత సీతకన్నా మిక్కిలి ఎక్కవ'అని చిత్రించడం నాగ్ లోని వైవిధ్య మానవీయ కోణానికి అద్దం పడతుంది. 'పాత మర్రిచెట్టు' కవితలో 'అది చూస్తుంది,దానికి తెలుస్తుంది,అది వుంటుంది, అది దొరుకుతుంది/కానీ మాట్లాడదు ఒక్క పలుకు కూడా/అది నిలబడుతుంది ఓ నిశ్శబ్ద సాక్ష్యంగా/ బయటికి పరుచుకున్న దాని బలమైన చేతులతో' ఎందరికో నీడనిచ్చిన మౌన సాక్షి ఆ చెట్టు అంటాడు నాగ్. 'ఒక జాతి గొంతు మూగదౌతుంది/ ఒకవేళ వారి భాష మృగ్య మైతే,/తద్వారా వారి ప్రజలు అస్థిత్వం కోల్పోతారు' /అంటాడు కవి హల్ధర్.

తన మరోకవితలో

'వారసత్వం లేని గోత్రంలో /కొత్త శిశువుచే దీపం వెలిగింది/వత్తిని కాలి వ్యాపించనీ/ అదే ఒడిషా పశ్చిమ భాష'/అంటాడు. ఇలా హల్ధార్ సామాజిక కవిత్వకృషికీ ఆయన సేవలకు గౌరవంగా భారతప్రభుత్వం 2016లో పద్మశ్రీ తో సత్కరించింది. హల్ధర్ కవితలు అసమానతలను అధిగమించే నీతిగీతాలు.

తెలుగు సాహిత్యంలో ప్రజాకవి వేమన శతక కవిత్వాన్ని పోలి ప్రజాహిత ప్రేరణతో సామాజిక రుగ్మతలపై సమరం చేసేవిగా స్ఫురింపజేసే హల్ధర్ నాగ్ 'లోక్ కవిరత్న' బిరుదాంకితుడు. హల్ధర్ నాగ్ గొప్ప సంఘ సంస్కర్త కూడా. ఆయన కోసలి సాహిత్యానికి చేసిన కృషికి పద్మశ్రీని అందుకున్నాడు.

- డా. టి. రాధాకృష్ణమాచార్యులు
9849305871

# సాహిత్యమూ, పాత్రికేయమూ కలిసిన నండూరి పార్థసారథి

తెలుగు సాహిత్య, పత్రికా రంగంలో నిండుగా రసదాయకంగా దశాబ్దాల పాటు విస్తరించిన పేరు - నండూరి పార్థసారథి. వ్యంగ్యం, హాస్యం, విమర్శ, సంగీతం, చలనచిత్రం వంటి అనేక కళా విభాగాలపై లోతైన చింతన తో రచన చేసి పాఠకులకు కొత్త పోకడలను చూపించిన అరుదైన రచయిత. 1939, జూలై 31న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, ఆరుగొలను గ్రామంలో జన్మించిన ఆయన, 2024 జూన్ 14న హైదరాబాదులో మృతి చెందారు. తన రచనల ద్వారా చిరంజీవిగా నిలిచిపోయారు.





విజయవాడలో ఇంటర్మీడియట్ చదివిన ఆయన, హైదరాబాద్‌లో బి.ఏ. పూర్తిచేసి, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. పూర్తి చేశారు. విద్యార్థత మాత్రమే కాదు, అభిరుచి, పాండిత్యం కలగలిసిన భావదృష్టితో 1959లో ఆంధ్రప్రభ పత్రికలో పాత్రికేయుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. తరువాత ఏకకాలంలో శార్వరి, విద్వాన్ విశ్వం, గొల్లపూడి మారుతీ రావుల వంటి సాహిత్య వేత్తలతో కలిసి పనిచేశారు. ఆయన రచనా నైపుణ్యం, సామాజిక పరిపక్వత, వ్యవస్థలపై వాడిగా బాణాలు ఎక్కు పెట్ట గలిగిన ధైర్యం ఆయనను పత్రికా రంగంలో విశిష్టంగా నిలబెట్టాయి.

పార్థసారథి రచనలు మొదటిగా 1957లో ప్రచురితమవ్వగా, తరువాత 'రాంబాబు డైరీ' (మూడు భాగాలు), 'పిబరే హ్యూమరసం', 'అయోమయ రాజ్యం', 'సాహిత్య హింసావలోకనం', 'ఖార్ఖానాఖ్యానము', 'జేజి మావయ్య పాటలు' వంటి హాస్య రచనలతో తెలుగు పాఠకులను నవ్విస్తూ ఆలోచింపజేసే శైలిని ఏర్పరచుకున్నారు. ఆయన రచనలు కేవలం వినోదం కోసం గాక, సంఘాన్ని ప్రశ్నించే, అలసిన మానవ సమాజాన్ని చైతన్యపరచే రీతిలో సాగాయి. ఆయన వ్యాసాలు, సమీక్షలు, సంగీతంపై రచనలు హిందుస్తానీ సంగీతం పై నిశిత అవగాహనను చాటాయి. స్వరార్ణవం, సంగీత కళా చరిత్ర, శ్రీకృష్ణ కథామృతం వంటి రచనలు సంగీతారాధకులను ఆకట్టుకున్నాయి. నాటక, శిల్ప, చిత్రకళలపై కూడా వ్యాసాలు రాశారు.

2000 అక్టోబరులో దీపావళి సందర్భంగా ఆయన ప్రారంభించిన 'రసమయి' మాసపత్రిక (95 సంచికలు) ఒక సాంస్కృతిక వేదికగా నిలిచి, నాటకీయ సమీక్షలు, కళా విశ్లేషణలు, సంప్రదాయ-నవీన విలయ రూపంగా పాఠకులకు వినూత్న అనుభవాన్ని అందించింది. సంపూర్ణంగా స్వంత ఖర్చుతో, సాహిత్యాన్ని సేవా ధర్మంగా భావించిన తపస్విగా ఆయన దీనిని నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయం 1992లో హాస్య రచనకు, 2002లో పాత్రికేయ సేవలకు ఆయనకు పురస్కారాలు అందించింది. 1993లో హాస్య రచయితగా విశ్వవిద్యాలయ ప్రత్యేక గుర్తింపు పొందారు. అతని రచనా వైవిధ్యం, భాషలో సరళత, లోతైన విశ్లేషణ సామర్థ్యం, మరియు నిర్భయంగా భావాలు చెప్పగల ధైర్యం ఆయనను అసామాన్య రచయితగా నిలిపాయి.

వ్యక్తిగతంగా ఆయన అతి సామాన్యుడిగా, మితభాషిగా, పరిపక్వ విశ్లేషణతో కూడిన అరుదైన వ్యక్తిగా పేరుగాంచారు. ఆయనతో పనిచేసిన యువ రచయితలు, పాత్రికేయులు ఆయన దగ్గర నుండి స్పష్టత, నిబద్ధత, శాస్త్రీయతను నేర్చుకున్నారు.

నండూరి పార్థసారథి పేరు, రచనలు, విమర్శా ధృక్కోణం తెలుగుకు ఒక ఆత్మీయమైన ఖ్యాతిని తెచ్చాయి. ఆయన జీవితం - రచనకు అంకితమైన జీవితం. ఆయన పదాలు - నవ్విస్తూ, తోచిస్తూ, చదివించిన తర్వాత ఆలోచింపజేసే పదాలు. అలాంటి రచయితలను ఒక్కసారి చనిపోయారని చెప్పినా, నిజంగా వాళ్లు చదివే ప్రతి పాఠకుడి హృదయంలో నవ్యంగా పునర్జన్మిస్తుంటారు.

తెలుగు పత్రికా, సాహిత్య రంగాలకు చేసిన ఆయన సేవలు ఎనలేనివి. నండూరి పార్థసారథి సాహిత్యమూ, దృక్కోణమూ భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఆయన జ్ఞాపకాలను, రచనలను మనం గౌరవంగా, స్ఫూర్తిగా భావించాలి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# 'ముస్తాదు' కవిత్వం - గౌడన్న కళకు దర్పణం

ప్రాచీనమైన చరిత్ర పుటల్లో అనేక వృత్తులు కొలువైనాయి. ఒక్కో వృత్తిలో ఒక్కో కులం తమ ప్రావీణ్యత సాధించుకున్నాయి. నేటికీ మానవ జీవన క్రమంలో కల్లుకు వున్న ప్రాధాన్యత సమసిపోలేదు. గౌడ కులస్తుల వృత్తి నైపుణ్యతలో విశిష్టత చెరిగిపోలేదు. వారి జీవన విధానంలో ఎన్నో విశేషాలు వున్నాయి. గౌడ కులం వారు సాంప్రదాయంగా తాటిచెట్టు (ఈత) నుంచి కల్లు తీయడం ప్రాచీన కాలం నుండి వస్తోంది. ఆ కులంలోని సంస్కృతికి సంబంధించినదే 'ముస్తాదు' కవిత్వ పుస్తకం.




తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా కు చెందిన కవి రచయిత శీలం భద్రయ్య కవితా సంపుటి 'ముస్తాదు' చక్కటి నిగూఢమైన భావంతో అలతి పదాలతోనే చిక్కగా అల్లుకున్న కవిత్వ సంపుటి. గౌడుల యొక్క సాంప్రదాయ వృత్తిలోని ప్రతి ఒక్క పనిని ఇందులో సంపూర్ణంగా తెలుపుతూ రాసిన పుస్తకం. దేవతలు మొదలు రాజుల వరకు నేటి విభిన్న సాంప్రదాయాల కాలంలో కూడా కల్లుకు ఒక సముచితమైన స్థానం వుంది.

శీలం భద్రయ్య రచించిన ముస్తాదు కవిత్వం అందుకు ప్రతీక.. నేటి గీతం పాడుతాను అనే శీర్షికతో రాసిన కవనం మొదటి పేజీలోనే ఆకట్టుకుంది - ఎద్దు తోలును వలిచి, తంగేడు చెక్కతోశుద్ధి చేసి, ఆరబెట్టి సానబెట్టి,మురిపెంగా ముస్తాదు కట్టి..అంటూ ముస్తాదు తయారీ విధానాన్ని ఈ కవితలో స్పష్టంగా తెలియపరిచారు. ఎద్దు చర్మాన్ని తంగేడు చక్కతో మొదట శుద్ధి చేసి బాగా ఆరబెట్టిన తర్వాత ముస్తాదు కడతారు. గౌడన్న జీవితం, ఆరుద్ర పురుగు, కార్తి వెనుక జీవన పరుగు. గౌడన్న జీవితం ఆరుద్ర కార్తితో పోల్చుతూ దాని వెనక ఉన్న జీవన ప్రయాణం కోసం పడే ఆత్రుతలాగా వుంటుందని చిత్రీకరించారు.

రచయిత ప్రత్యేకించి గౌడుల యొక్క జీవన విధానాన్ని కవిత్వంగా మలుచుకోవడం నూతనత్వాన్ని సంతరించుకుంది. బతుకమ్మలా మర్రి చెట్టును నెత్తిన ఎత్తుకుంది తాటి చెట్టు వనం బతుకమ్మ తాటిచెట్టు. తెలంగాణ ప్రాంతంలో కల్లుతో ముడిపడిన పండుగలు చాలా వున్నాయి కల్లు ముంతలతో ఊరేగింపు కూడా నిర్వహిస్తారు ఈత కల్లుకు నేటికి కూడా ఒక విశిష్టమైన స్థానం ఉంది. తాడుపై నిలువునా నడిచే దివి బాటసారి అంటూ చాలా లోతైన భావం తో ఈ వాక్యాన్ని కూర్చారు. నడుంకు తాడును కట్టుకుని నిలువునా నడుస్తూనే చెట్టు మొదటికి చేరుకుంటాడు. కల్లు గీసి దిగ్విజయంగా దిగి వస్తాడు. కల్లు గీత కార్మికలోకానికి ఈ పుస్తకం ఒక దివిటీగా నిలబడుతుంది. మట్టి కుండలో పోసి విక్రయించే దుకాణాలు ఇప్పుడు కూడా మారుమూల గ్రామాల్లో కొనసాగుతూనే వున్నాయి. కల్లు గీతకు ఒక ప్రాధాన్యత నేటికి చెదరిపోలేదు. వెన్నులు ధనువులా వంగినా - తాటిచెట్టు నిటారుగా నిలబెడుతుంది. ఇక్కడ సంకల్పబలం మెండుగా వుంది చెట్టును ఎక్కేటప్పుడు నడుం ధనువులా వంగిపోతుంది ఐనా కూడా తాటి చెట్టు తిరిగి నిలువునా నిలబెడుతుంది. కష్టానికి ప్రతిఫలం చూపిస్తుంది కల్లు మా కులదేవత మండువా మా భరతమాత తాటిచెట్టు మా జాతి పతాక సర్వాయి మాజాతిపిత అంటూ చక్కటి పోలికలతో వాడే వస్తువులను పోల్చడం జరిగింది. శీలం భద్రయ్య గారు గౌడ కళకు (వృత్తికి) దర్పణంగా ఈ ' ముస్తాదు' కవిత్వాన్ని పాఠకులకు అందించారు.

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

# తెలంగాణ అస్తిత్వం-బర్కతి



సాగర్ల సత్తయ్య ప్రస్తుతం నల్లగొండ సాహితీ వనంలో సుగంధాలను వెదజల్లుతూ సాహితీ ప్రియులందరినీ పలకరిస్తున్న సుపరిచితమైన పేరు. సాగర్ల సత్తయ్య ఒకేసారి హఠాత్తుగా ఎవరి ప్రోత్సాహంతోనో, ప్రోద్బలంతోనో ఎదిగి వచ్చిన కవి ,రచయిత, విమర్శకుడు కాదు. నిరక్షరాస్యులు అయిన తల్లిదండ్రుల నుండి నీతివంతమైన కుటుంబం నుండి పేదరికంని వెక్కిరిస్తూ, కష్టాలకు సవాలు విసురుతూ కన్నీళ్లను అక్షరాలుగా పోగేసుకుని సాహితీ సౌధాన్ని నిర్మించుకున్న అక్షర ప్రేమికుడు సాగర్ల. సత్తయ్య మనుషులను ప్రేమిస్తాడు. మానత్వాన్ని కురిపిస్తాడు. అతడు మాట్లాడితే సమయాన్ని మరిచిపోతాం. ఇలాంటి వ్యక్తి కథకుడుగా మారితే ఆ కథలు మనవిగా మన చుట్టూ ఉన్న వాళ్ళవిగా సమాజాన్ని ప్రతిబింబించేవిగా మనసును తట్టి లేపుతాయి అవే ఈ బర్కతి కథలు.

బర్కతి అనేది ఉర్దూ పదం.ఈ పదానికి సంపద, భాగ్యం, ధనం అనే అర్థాలు చెప్పవచ్చు. నిజంగా ఈ కథా సంపుటితో రచయితకు సాహితి బర్కతి కలిగిందని చెప్ప వచ్చు. ఈ పుస్తకంలో మొత్తం 15 కథలు ఉన్నాయి. దేనికి అదే ప్రత్యేకం. ఈ కథలన్నీ రచయిత సమాజంలో తాను చూసినవి, విన్నవి స్వయంగా తన అనుభవాల్లోంచి వెలికి తీసిన సన్నివేశాలు, సంఘటనలను కథగా మలిచి పాఠకుని మదిని దోచుకున్నారు. పరిష్కారం కథలో సరిత పాత్రతో చదువు యొక్క గొప్పతనాన్ని అదేవిధంగా ఆడపిల్ల పడేటువంటి కష్టాలను, మైనర్‌లకు పెళ్లిచేస్తే వచ్చే నష్టాలను వివరించారు. అంజయ్య, నరసమ్మ ఎదిగొచ్చిన పిల్ల పెళ్లి చేసి భారం దించుకోవాలని చూశారు, కానీ అల్లుడు నరేష్ కూతురు కడుపులో తన్నడం ద్వారా గర్భస్రావం అయిన విషయాన్ని రచయిత చాలా ఆర్ద్రంగా వివరించారు. ఈ సమయంలో శ్రీనివాస్ రెడ్డి అనే ఉపాధ్యాయుడు చేసిన మేలు వల్ల సరిత ఏ విధంగా చదువుకోగలిగింది అనే విషయాన్ని రచయిత అద్భుతమైన ముగింపుగా ఇచ్చాడు.

ఊరబోనాలు కథలో చేతివృత్తుల వారి జీవితాలు ఏ విధంగా క్రమక్రమంగా నాశనమై పోయిన దుస్థితిని కళ్ళకు కట్టినట్టు వివరించాడు రచయిత.

ప్రస్తుతం ఊర్లో జరిగే పండుగలు బీసీ, ఎస్సీలకు ఉన్నటువంటి బేధాలు వివరించే ప్రయత్నం చేశాడు. లచ్చిరెడ్డి మనవడు అవినాష్ రెడ్డికి దేవుడిపై వచ్చినటువంటి అనుమానాన్ని రచయిత నివృత్తి చేయలేదని పాఠకుడు భావించే అవకాశం ఉంది. బర్కతి కథలో వీరయ్య కొలువు చెప్పి ఏ విధంగా అమాయకమైన ప్రజలను మోసం చేసి బంగ్లాలు కట్టి కారు కొన్నాడు, అనేవి రచయిత వివరించాడు. తెలంగాణలో ఉన్న అన్ని దేవస్థానాలను స్పృశిస్తూ కథ నడిపించాడు.

సూదరు ఎల్లమ్మ, బాపన ఎల్లమ్మ గురించి నటువంటి వివరణ ఇవ్వడం సందర్భంగా అనిపించింది. మల్లమ్మ మారయ్యల అమాయకత్వాన్ని ప్రోది చేసుకొని వీరయ్య లాంటి ఎందరో ప్రస్తుత సమాజంలో మూఢనమ్మకాలను పురికొల్పి వారి నుండి డబ్బులు లాగడం చేస్తున్నారు. బర్కతి (సంపద) కలగాలని మల్లమ్మ, మారయ్య, వీరయ్యను నమ్మి ఏవిధంగా అప్పుల పాలయ్యారో ఈ కథ తెలియజేస్తుంది. తశ్వ అనే కథలో ఆలుమగలు పంచాయతీ పెట్టుకున్నప్పుడు ఊర్లో పెద్ద మనుషులు ఏ విధంగా డిపాజిట్ పెట్టిస్తారు. ఏ విధంగా ఈ కుటుంబాలు అప్పులపాలై ఆగమయ్యే పరిస్థితి వస్తుంది అనే విషయాన్ని తశ్వ అనే కథలు వివరించారు.

కోటి దీపాల వెలుగు కథలో విద్యార్థి దశలో పత్తి తీయపోవడం, వ్యవసాయ కూలీ పనులకు పోవడం, చదువుకోవాలని ఇష్టం ఉన్నా ఇంట్లో పరిస్థితుల వల్ల తమ చదువును కొనసాగించలేకపోతున్న ఎంతోమంది అమ్మాయిల విషయం ఈ కథ చదివితే మనకు అర్థం అవుతుంది. ఈ కథలో శంకరయ్య, శంకరమ్మ దంపతుల కూతురు శివాని చదువుపై ఉన్నా మక్కువను సైన్స్ టీచర్ శ్యాంసుందర్ సార్ ప్రోత్సహించిన విధానాన్ని మనం గుర్తించవచ్చు.

మరుగు మందు కథ ప్రస్తుత సమాజంలో జరుగు తున్న మూఢనమ్మకాలను కళ్ళకు కట్టినట్టు వివరించింది. అశోక్‌కు అన్నంలో కలిపి మరుగు మందు పెట్టారని సాలమ్మ సిద్దయ్య దగ్గర బాగు చేయించి కక్కు పోయించడంకు గల కారణాలు, ప్రస్తుత భూత వైద్యుల బండారాన్ని బయట




పెడుతుంది. 'దెశిత్..... ఆ సిద్దిగాడా నీకు కక్కబోసింది?ఆడు పెద్ద లఫంగి. పెద్ద మోసగాడు. బట్టేబాజ్ గాడు. ఇంత దగ్గర వున్న నాకు చెప్పొద్దా? వాని గురించి తెల్వక దూరం దూరం ఊర్ల నుంచి వస్తరు. తెలిసినోళ్ళు ఎవ్వలు వాని కాడికి పోరు. నువ్వు కుండ పెంకల వాంతి చేసుకున్న తర్వాత ఇంట్లకి రాంగనే దిడ్డి దర్వాజ కానించి అని మనుసులు పోయి అండ్ల మునగ బంక కలిపి వస్తరు'. ఇది విని కనువిప్పు కలిగి తన భార్యను తీసుకొచ్చుకున్న అశోక్‌ను చూసి నేటి సమాజం మారుతుందని ఆశించే కథ అందించాడు రచయిత.

ఓ మొక్క నవ్వింది కథలో పదవ తరగతి చదివే అమ్మాయికి పెళ్లి చేస్తున్న లలితమ్మ తండ్రి నరసింహను ఆనంద్ సార్ ఈ ఏ ధంగా బ్రతిమిలాడాడు, బెదిరించాడు, అయినా కూడా ఆ పెళ్లి నిశ్చయానికి జరిగినప్పుడు చివరికి ఆనంద్ సార్ పోలీస్ కంప్లైంట్ ఇచ్చి ఏ విధంగా పెళ్ళిని ఆపించాడు. కావ్య మొహంలో నవ్వును విరబూయించాలని ఉపాధ్యాయుడు విద్యార్థినికి ఉన్న అవినాభావ సంబంధాన్ని అద్భుతంగా చూపించినటువంటి కథను చదివి తీరాల్సిందే.

సోషల్ మర్డర్ కథ మానవత్వంతో కూడిన ఒక మనిషి పడే ఆవేదన ఏ విధంగా ఉంటుంది. మానవ విలువలు నేటి సమాజంలో ఎంతవరకు మిగిలి ఉన్నాయి అనే అంశాన్ని వాట్సాప్‌లో ఉన్నటువంటి ఒక సందేశం మనకు శేఖర్ అనేటువంటి పాత్ర ద్వారా కన్నీటిని తెప్పిస్తుంది. సోషల్ మీడియాలో వస్తున్నటువంటి అన్ని విషయాలు వదంతులుగా నమ్ముతుంటాం. సరైన సమయానికి స్పందించకపోవడం వల్ల పోయే ప్రాణాల గురించి ఈ కథ తెలియజేస్తుంది.

చాపకింద నీరుకథ లో నిరుపేద కుటుంబం లోంచి బాగా చదువుకున్నటువంటి విద్యార్థులు ఇంజనీరింగ్ మెడిసిన్లు చేరిన తర్వాత ఏ విధంగా డ్రగ్స్‌కు అలవాటై తమ జీవితాలను చిద్రం చేసుకుంటున్నారు అనేది ఈ కథలో ముఖ్యమైన విషయం. మనతో ఉండేటువంటి స్నేహితులే మనల్ని ఏ విధంగా డ్రగ్స్ అలవాటు చేస్తారనేది రాజకుమార్ అనే విద్యార్థి జీవితాన్ని ఏ విధంగా అన్వేష్ నాశనం చేశాడో తెలియజేస్తుంది. చివరగా ఒక ఉత్తమ విద్యార్థి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు అల వాటు పడి చైన్ స్నాచర్‌గా మారి ఆక్సిడెంట్‌గురై ఏ విధంగా ప్రాణాలు వదిలాడు చదువుతుంటే పాఠకుని మనసు నీరు అయిపో తుంది. తల్లిదండ్రులు పెట్టుకున్నటు వంటి ఆశలు అడియాశలుగా చేస్తూ విద్యార్థులు తమ భవిష్యత్తు ను ఏవిధంగా నాశనం చేసుకుంటున్నారో ఈ కథ వివరించింది.

వీటితోపాటు ఎన్నుగ్రర, సారే, తోడేళ్లు ,రాతి గుండెలు, పేగు బంధం మొదలగు కథలు సమాజంలో మార్పును తెచ్చేవిగా ఉన్నాయి.

ఈ కథలు మనవిగా మనలోని అనుభవాలుగా ప్రతి పాఠకుడి మనసును దోచుకుంటా యనడంలో సందేహం లేదు. 'ఆడి బిళ్ళ అన్నంక అన్ని పనులు నేర్వాలి','దిష్టి తాకిందంటే దిగ దాగిందంటరు','చింత చచ్చిన పులుపు చావలేదు','తీగకు కాయ బరువా' మొదలయిన అనేక సామెతలు సందర్భోచితంగా వాడిన సాగర్లసత్తయ్యను అభినందించలేకుండా ఉండలేము.

- డా. మెంతబోయిన సైదులు
90 109 109 56

# రామగుండంలో ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటుకు కృషి

- 968 టీఎంసీల నీటి వాటా వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం
- బనకచర్ల ప్రాజెక్టు ను అన్ని దశలలో అడ్డుకుంటాం
- తుమ్మిడి హట్టి, ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం
- 3 కోట్ల 17 లక్షల జనాభాకు నెలకు 6 కిలోల సన్నబియ్యం రేషన్ సరఫరా
- పత్తిపాక రిజర్వాయర్ డీపీఆర్ తయారీకి కోటి 10 లక్షల మంజూరు
- రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**గోదావరి ఖని/ అంతర్గాం, ఆగస్టు 03(మనం న్యూస్):** గోదావరి నదిలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటా సంపూర్ణంగా వినియోగించు కునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుదిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహా హర కర వేణుగోపాల్ ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణా రావు లతో కలిసి ప్రారంభించారు.



**శాసన సభ్యుల కృషి మేరకే రామగుండం ఎత్తిపోతల..: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

అనంతరం అక్కడ అంబేద్కర్ చౌరస్తాలోని మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యుల కృషి మేరకు రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు కోటీ పది లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ద్వారా 75 కోట్లు ఖర్చు చేసి అంతర్గాం, ముర్మూరు, బ్రాహ్మణ పల్లి ,ఎల్లంపల్లి సోమనపల్లి, మద్దిరాల , తొట్యాల పురం మొదలగు గ్రామాలకు, 17ఎల్ ద్వారా కుక్కల గూడూరు, నిట్టూరు గ్రామాలకు మొత్తం 13 వేల పైగా ఎకరాలకు నీరు చేరుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడంలో రవాణాశాఖ మంత్రి పూర్ణం ప్రభాకర్ కృషి ఎంతగానో ఉందని అన్నారు. స్వతంత్ర భారత దేశంలో మొదటిసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత సాధించడంలో మన ప్రభాకర్ కృషి చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో ముఖ్యమంత్రి సైతం శ్రీధర్ బాబు సలహాలు సూచనలు తీసుకుంటారని చెప్పారు.

తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని చూస్తుందని, గోదావరి పేపర్ మేనేజ్మెంట్ బోర్డు నుంచి సీడబ్ల్యూసీ వరకు ఫిర్యాదు చేసి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నామని మంత్రి తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టం, నీటి హక్కులకు వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ చూస్తుందని, దీనిని అన్ని వేదికలలో, న్యాయ పరంగా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన మంథని నియోజకవర్గం, పెద్దపల్లి జిల్లాకు ఒక ఎకరాకు నీరు ఆందించలేదని అన్నారు. సుప్రీంకోర్టు జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెడ్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం లక్ష కోట్లు వృథా చేసిందని అన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టు 38 వేల కోట్లతో నిర్మించి ఉంటే నేడు గోదావరి పరివాహక ప్రాంతంలో కరువు ఉండేది కాదని అన్నారు. గత ప్రభుత్వం దోపిడి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని తెలిపారు. 3 బ్యారేజీలు ఫౌండేషన్ బలహీనంగా ఉందని, అక్కడ నీరు నిల్వ చేస్తే 44 ఊర్లు , భద్రాచలం కొట్టుకొని పోతాయని ఎన్.డి.ఎస్.ఏ రిపోర్ట్ అందించిందని అన్నారు. 3 బ్యారేజీల మరమ్మతు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ, నీటీ పారుదల ప్రాజెక్టు సమన్వయంతో 3 బ్యారేజీలు నిరూపయోగంగా ఉండగా, గత సంవత్సరం రికార్డు స్థాయిలో 2 కోట్ల 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు. గోదావరి నదిపై తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన 968 టీఎంసీల నీరు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం చేస్తామని అన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో మంథని రామగుండం, పెద్దపల్లి ఉన్నాయని, ఇక్కడ సాగు నీరు ఆందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజి నిర్మాణం పునః ప్రారంభం చేసి పూర్తి చేస్తామని అన్నారు. ఇచ్చంపల్లి వద్ద కూడా మరో ప్రాజెక్టు నిర్మిస్తామని అన్నారు.

**అర్హులందరికీ రేషన్, రుణాలు, ఇండ్లు: మంత్రి తుమ్మల**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు నాయకులు ఇచ్చిన హామీల అమలు మేరకు ఉమ్మడి జిల్లా మంత్రి వర్యులుగా తన వంతు కృషి చేస్తానని అన్నారు. రేషన్ కార్డులు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ పంపిణీ చేస్తామని అన్నారు.

**మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్**

మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో లక్షాధికారుల చేయాలని లక్ష్యంతో పని చేశామని, నేడు మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. బండ్లవాగు ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో అనేక ధర్నాలు చేశామన్నారు. ప్రస్తుతం గత ప్రభుత్వాల తప్పి దాల ను సరి చేస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల ఖర్చు చేస్తే మన ప్రాంతంలో ఒక ఎకరాకు సాగు నీరు ఇవ్వలేదని విమర్శించారు. టెయిల్ ఎండ్ ప్రాంతాలకు సాగు నీరు స్థిరికరణ కోసం పత్తిపాక రిజర్వాయర్ ఎన్ని కోట్ల ఖర్చు చేసినా నిర్మిస్తామని, కోటిన్నర రూపాయల నిధులు మంజూరు చేసే సర్వేకు ఆదేశాలు జారీ చేశామన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం వల్ల 2 లక్షల 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 10 వేల ఎకరాల నూతన ఆయకట్టు సృష్టించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులు అధిక ఆదా యం సంపాదించాలనే లక్ష్యంతో ఆయిల్ పామ్ విస్తరణ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. రైతు ఆదాయ వనరులు పెంచే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని రావాలన్నారు. రామగుండం ప్రాంతంలో ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశారాం సిమెంట్ వంటి పరిశ్రములు ఉన్నాయని, ప్రైవేట్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేస్తామన్నారు.

**ప్రతి నీటి చుక్కను వాడుకునేలా ప్రణాళికలు: మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ప్రతి నీటి చుక్కను ఉత్తర తెలంగాణ ప్రాంతాలు వాడుకునేలా ప్రణాళికలు చేయాలన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే కోరిక మేరకు స్థానిక బస్ స్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

**రైతులకు సాగు నీరు అందించే ప్రాజెక్టు: ఎమ్మెల్యే చింతకుంట**

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17ఎల్, 27ఎల్ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యం అవుతుందని అన్నారు.

**ప్రజల చిరకాల వాంఛ రామగుండం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజల చిరకాల వాంచ రామగుండం ఎత్తిపోతల పథకం ప్రారంభం చాలా సంతోషంగా ఉందన్నారు. రామగుండం ప్రాంతంలో 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మించాలని కోరారు. స్థానికంగా ధాన్యం నిల్వ చేసేందుకు అదనపు గోడౌన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పారిశ్రామిక వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ్య గౌడ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ప్రాంతాన్ని ఎండబెట్టింది కాంగ్రెస్ పార్టే: చందర్

- తొలి సీఎం కేసీఆర్ హాయంలోనే రామగుండం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం.. 90 శాతం పూర్తి
- రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదు
- రామగుండం మాజీ శాసన సభ్యుడు, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి




**గోదావరిఖని, ఆగస్ట్ 03(మనం న్యూస్):** తలాపునే గోదారినది పారుతున్న ఈ ప్రాంతానికి నీళ్లివ్వకుండా నాడు ఎండబెట్టింది కాంగ్రెస్ పార్టీ అని, ముఖ్యమంత్రి కేసీఆర్ హాయంలోనే రామగుండం ఎత్తిపోతల పథకానికి శంఖుస్థాపన చేసి 90 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని, ఎన్నికల కోడ్ కారణంగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించులేకపోయామని, రామగుండం ఎత్తిపోతల పథకం ఘనత అంతా మాజీ సీఎం కేసీఆర్దేనని రామగుండం మాజీ శాసన సభ్యుడు, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే చందర్, బీఆర్ఎస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. చందర్ మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు సర్వస్వం కోల్పోయారని, ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి చుక్కా నీరు కూడా దక్కని పరిస్థితి నాటి కాంగ్రెస్ పార్టీ హాయంలో నెలకొందన్నారు. ఈ ప్రాంత భూములను సస్యశామలం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో రూ.80 కోట్లతో రామగుండం ఎత్తిపోత ల పథకానికి శ్రీకారం చుట్టా రని, వారి హాయంలోనే 90 శాతం లిఫ్ట్ పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. 'ఎవరి కో పుట్టిన బిడ్డ.. నా బిడ్డ' అంటే అబ ద్ధం నిజం అవుతుందా? అని ప్రశ్నిం చారు. ఎత్తిపోతలు, ప్రాజెక్టులు, అభి వృద్ధి డీఎన్ఏ బీఆర్ఎస్‌వే అని అన్నారు. రామగుం డం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించే అర్హత ఈ ప్రభు త్వానికి లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ప్రాంతానికి నీళ్లు అందించాలని కేసీఆర్ రామ గుండం ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి నిధు లు మంజూరు చేశారని గుర్తు చేశారు. 90 శాతం పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కొబ్బ రికాయ కొట్టడం తప్ప చేసింది ఏమి లేదన్నారు. ఈ ప్రాంతానికి కేసీఆర్ కారణంగానే నీళ్లు వస్తున్నందు కు కేసీఆర్‌కు రామగుండం ప్రజల తరపున పాలాభి షేకం చేసి ధన్య వాదాలు చెప్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆముల నారాయణ, మాజీ కార్పోరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువత సన్మార్గంలో నడవాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రామండ్లపెల్లి యుగేందర్




**చిగురు మామిడి, ఆగస్టు 3(మనం న్యూస్):** ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రామండ్లపెల్లి యుగేందర్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐవైఎఫ్ చిగురుమామిడి మండల మహాసభ అమరజీవి ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ సిపిఐ కార్యాలయంలో పైడిపల్లి శశి అధ్యక్షతన జరిగినది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన యుగేందర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని పోరాటాలు నిర్వహించింది ఏఐవైఎఫ్ అని, ఉన్నత చదువులు చదువుకొని నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరంతరం యువతను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తున్నది ఏఐవైఎఫ్ అని, దేశ సంపద అయిన యువతను పాలకులు విస్మరిస్తున్నారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏటాకోటి ఉద్యోగాలు ఇస్తామని గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి నెరవేర్చకుండా యువతను మోసం చేసిందని, డిగ్రీలు, పీజీలు చేత పట్టుకొని ఉద్యోగాల కోసం తిరుగుతే ప్రభుత్వ ఉద్యోగాలు దొరకకపోవడంతో ప్రైవేట్ సెక్టార్లలో ఎంతో మంది యువత చాలీచాలని వేతనాలతో బ్రతుకుతున్నారన్నారు. నేటి సమాజంలో యువత సన్మార్గంలో నడుస్తూ చెడు అలవాట్లకు పోకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలనలో కఠినంగా వ్యవహరించడం పట్ల ఏఐవైఎఫ్ స్వాగతిస్తుందని, నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకం అందిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం అన్యాయమని ప్రభుత్వం వెంటనే ఆ పథకాన్ని అమలు చేసి నిరుద్యోగ యువతకు ఊరట కలిగిం చాలని యుగేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో ఏఐవైఎఫ్ మండల నాయకులు చెంచల రవి, పైడిపల్లి శశి, మహేష్, శ్యామ్, అజయ్, హరీష్, నవీన్, వెంకట్, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నలుగురికి ఆదర్శంగా.. జిల్లా పాలనాధికారి

- పరిపాలనను సామాన్యుడికి చేరువ చేసిన కలెక్టర్
- క్రమశిక్షణకు మారుపేరుగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్
- అనాథ యువతికి అన్నితానై వివాహం చేసిన పెద్దన్న
- కన్నకొడుకు చేరదీయని తల్లికి పెద్ద కొడుకుగా కోయ శ్రీహర్ష
- ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించిన మనస్తత్వ వైద్యుడు





**పెద్దపల్లి, ఆగస్టు 03(మనం ప్రతినిధి):** పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా 2024 జూన్ 15వ తేదీన కోయ శ్రీహర్ష బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీ హర్ష జిల్లాలో విద్యా, వైద్యం, సామాజిక న్యాయం, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారు. ఎప్పటికప్పుడు జిల్లా అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ సామాన్యునికి తలలో నాలుకలా మెదులుతున్నారు. అంతేకాక జిల్లా పాలనపై ఎప్పటికప్పుడు పలు శాఖలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటూ అధికారులు సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తూ అభివృద్ధికి తోడ్పడుతున్నారు. ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తూ సామాన్య ప్రజలకు అండగా నిలుస్తున్నారు. కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా బాధ్యతలు చేపట్టక ముందు నారాయణపేట జిల్లా మొట్ట మొదట కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కోయ శ్రీహర్ష 2017 యూపీఎస్సీలో 6వ ర్యాంకు సాధించి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో ఆదర్శంగా నిలిచారు. శ్రీహర్ష ఎస్సెస్సీ, ఇంటర్ వరకు ఖమ్మం జిల్లాలో పూర్తి చేసి, బీటెక్‌ను జంషెడ్పూర్‌లో చదివారు. అనంతరం, హైదరాబాద్ నగరంలోని ప్రముఖ కంపెనీలో నాలుగేండ్ల పాటు ఉద్యోగం చేశాడు. తన వ్యక్తిగత కారణాల వల్ల ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పథకాలు సామాన్యులకు అందేలా చూడాలన్న తను కన్న కలల కోసం తల్లిదండ్రుల కృషితో యూపీఎస్సీ పరీక్ష రాసి 2017లో 6వ ర్యాంకు సాధించి 2018 బ్యాచ్‌లో ఐఏఎస్‌గా ఎంపికయ్యాడు. ఆనాటి నుంచే అతని ప్రస్థానం మొదలై అది నేటికీ కొనసాగుతుంది.

**కన్నకొడుకు చేర దీయని తల్లికి పెద్ద కొడుకుగా..**

కన్న తల్లికి అన్నం పెట్టని కొడుకు పట్ల కఠినంగా వ్యవహరించి తల్లికి న్యాయం చేశాడు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు కొడుకు ప్రవర్తనా తీరు పట్ల తీవ్ర ఆవేదనకు గురయ్యింది. గత కొంత కాలంగా తన బాగోగులు చూసుకోకుండా ఉంటూ ప్రతి విషయంలో తల్లితో గొడవలు పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న కొడుకు వికృత చేష్టలకు విసుగు చెందిన ఆ తల్లి ఓ నిర్ణయం తీసుకుంది. ఏకంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన కలెక్టర్ కొడుకును ఇల్లు ఖాళీ చేయమని చెప్పి ఆదేశాలు జారీ చేసి, తల్లి ఆస్తిపై ఎలాంటి హక్కులు లేకుండా చేసి కొడుకుకు బుద్ధి చెప్పి ఆ తల్లికి కొడుకయ్యాడు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**అనాథ యువతికి అన్నితానై వివాహం చేసిన పెద్దన్న**

అన్నీ తానై జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, అనాథ యువతి వివాహం ఘనంగా చేశారు. బాజా భజంత్రీలు, మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల, మధ్య తరలివచ్చే అతిథుల సమక్షంలో అనాథ యువతి వివాహనికి పెద్దపల్లి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తల్లిదండ్రులను కోల్పోయి రామగుండంలోని తబిత బాలల సంరక్షణ కేంద్రంలో మానస, తన చెల్లితో కలిసి 16 ఏళ్లుగా నివసిస్తుంది. జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేష్‌తో ఆమెకు వివాహం నిశ్చయం కాగా, వివాహానికి పెళ్లి పెద్దగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముందుకు వచ్చి కలెక్టరేట్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వివాహం జరిపించారు.

**ప్రభుత్వ ఆసుపత్రులపై పెరిగిన నమ్మకం**

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కోయ శ్రీహర్ష పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి నిదర్శనం తన సతీమణి గర్భం దాల్చినప్పటి నుంచి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్య సేవలు తీసుకుంటూ చివరకు ప్రభుత్వాస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. కలెక్టర్ చేసిన పని తీరు ఇతర అధికారులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. దీనివల్ల ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా చేశారంటూ ఆస్పత్రి వైద్యాధికారులు కలెక్టర్‌కు ప్రశంసల జల్లు కురిపించారు.

**పొలం పనుల్లో రైతు కూలీలతో కలెక్టర్ దంపతులు**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజలతో ఇట్టే కలిసిపోతారు. కలెక్టర్ శ్రీహర్ష సతీమణి విజయ, కుమారుడితో కలిసి రైతు కూలీలతో కలిసి పొలం బాట పట్టారు. కలెక్టర్, ఆయన భార్య విజయ, కుమారుడు సైతం రైతు కూలీల మధ్య కలిసిపోయారు. రోడ్డుపై వెళుతున్న వారు ఒక్కసారిగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి వద్ద పంట పొలాల వద్ద ఆగి రైతులు, రైతు కూలీలతో మాట్లాడుతూ వారి కష్ట సుఖాలు పంచుకున్నారు. కలెక్టర్ భార్య విజయ ఒక అడుగు ముందుకు వేసి మహిళలతో కలిసి పంట పొలంలోకి దిగి మహిళా కూలీలతో కలిసి కాసేపు నాటువేస్తూ ముచ్చటించా రు. కలెక్టర్‌గా ప్రతి సామాన్యుని సమస్యలు తెలుసుకుంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సామాన్యుడికి తలలో నాలుకల మెదులుతూ జిల్లాలోని పలువురి మన్ననలు పొందుతూ క్రమశిక్షణకు, ఆదర్శానికి మారుపేరుగా నిలుస్తున్నాడు.



# వైభవంగా ఆర్యవైశ్యుల వన భోజనాలు



**సుల్తానాబాద్, ఆగస్టు 3(మనం న్యూస్):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎలిగేడు మండలం ర్యాకల్ దేవ్ పల్లి గ్రామంలోని నాగలింగేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు స్నేహితుల దినోత్సవ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పలువురు దంపతులు, భక్తులు నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు, పూజారి పారువెళ్ల అభిషేక్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆటపాటలతో ఫ్రెండ్‌షిప్‌డే శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకట్ నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరు కలిసి ఉంటే ఏదైనా సాధిస్తారని, ఈ వన భోజనాల వేడుకలను ఇంత పెద్ద ఎత్తున ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషమన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు మంచాల జ్యోతి, జిల్లా నాయకులు కోలేటి రమేష్‌తో పాటు సుల్తానాబాద్ పట్టణ మండల ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా మున్నూరు కాపులను గెలిపించుకోవాలి



**జమ్మికుంట, ఆగస్టు 3(మనం న్యూస్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీలకతీతంగా మున్నూరు కాపు కుల సోదరులను గెలిపించుకోవాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట సింగిల్ విండో అధ్యక్షులు పొనగంటి సంపత్ అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుబ్బ మల్లన్న దేవస్థానం ఆవరణలో ఆదివారం మున్నూరు కాపు కుల బంధువుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పొనగంటి మల్లయ్య, జమ్మికుంట పట్టణ అధ్యక్షులుగా ఏబూసి శ్రీనివాస్, మండల అధ్యక్షుడుగా తోట లక్ష్మణ్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల రాజేందర్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మున్నూరు కాపు కుల బాంధవులు వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ, మున్నూరు కాపు కులస్తులు ఐక్యతతో కలిసి ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మున్నూరు కాపు కులస్తులలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి విద్యాపరంగా తగు ఆర్థిక చేయూతను అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మున్నూరు కాపు కులస్తులు సంఘటితంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారంతో పాటు హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్ పటేల్, పొనగంటి సారంగం, కాసర్ల రాములు, మర్రి అవినాష్, పంతాటి రవీందర్, మర్రి తిరుపతి, పొనగంటి రవీందర్, పొనగంటి శ్రీధర్, చంద మహేందర్, ఆకుల పోశయ్య, పూరెల్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: బీఆర్ఎస్



**గంగాధర, ఆగష్టు 03(మనం న్యూస్):** ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పంపు ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీళ్లు వదలాలని రైతులతో కలిసి ధర్నా చేస్తామని ప్రకటించడంతో పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పిలుపు మేరకు గాయత్రి పంపు హౌస్, ఎల్లంపల్లి ద్వారా నారాయణపూర్ వరద కాలువలోకి నీళ్లు వదలకపోతే రైతుల పక్షాన, గంగాధర మండల పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నా చేస్తామని ప్రకటించడంతో పోలీసులు ముందస్తు అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండించారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఇచ్చిన మాట నెరవేరుస్తాం
- అప్పు అప్పజెప్పినా సంక్షేమం అమలు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- నిమ్స్‌లోనే ఆరోగ్య శ్రీ
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి



**గజ్వేల్, ఆగస్టు 03(మనం న్యూస్):** ఇచ్చిన మాటను నెరవేర్చడమే లక్ష్యంగా ఒక్కో అడుగు ముందుకేస్తూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు లూటీ చేసినా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ హామీల అమలుకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఆదివారంనాడు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ప్రభుత్వం జారీ చేసిన నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకట స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే 12 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించిన లబ్ధిదారులకే డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 12 కోట్ల వ్యయంతో సన్న బియ్యం పంపిణీ చేశామన్నారు. సిద్దిపేట జిల్లాకు 350 కోట్ల రైతు భరోసా, 22 కోట్ల గ్యాస్ సబ్సిడీ రెండు లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా మహిళలు నాలుగు కోట్ల ఉచిత బస్ టికెట్లను వినియోగించుకున్నట్లు తెలిపారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్లు అప్పు అప్పజెప్పినా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమ్స్ ఆసుపత్రిలో మాత్రమే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని, ప్రజలు యశోద, అపోలో ఆసుపత్రులకు వెళితే ఆరోగ్యశ్రీ వర్తించదని తెలిపారు. ఇప్పటివరకు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.900 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని 10000 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని రూ.36 కోట్లతో జిల్లాలో పాఠశాల మరమ్మత్తు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి ఫలితాలు వస్తున్నాయని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. అక్రమాలలో నిర్ణయాలు తీసుకున్న అందరికి శిక్ష పడాలని మంత్రి వివేక్ వెంకటస్వామి మీడియాతో అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ అనంతరం గజ్వేల్ లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాక వెంకటస్వామి ప్రజలకు తాగునీరు సమస్య పరిష్కరించాలని ఎంతో అనుకున్నారని, అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలోనే ప్రజల దాహార్తి తీర్చడానికి రూ. 36 వేలకోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రూపొందించి 11 వేల కోట్లతో పనులు కూడా చేశామన్నారు. దానిలో భాగంగానే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినట్లు తెలిపారు. వేలకోట్ల ప్రాజెక్టును లక్ష కోట్లుగా ప్రణాళిక మార్చి కెసిఆర్ కాంట్రాక్టర్ల జేబులు నింపారన్నారు. ప్రస్తుతం మల్లన్న సాగర్ కు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండే నీరు వస్తున్నట్లు వెల్లడించారు. లక్ష కోట్లు పెట్టినా కాళేశ్వరం వృధాగా మారిందన్నారు. కాళేశ్వరం అక్రమాలలో నిర్ణయాలు తీసుకున్న ప్రతి ఒకరికి శిక్ష పడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్లు గరిమ అగర్వాల్ అబ్దుల్ హమీద్, డీఎస్ఓ తనూజ, ఆర్డీవో చంద్రకళ, తహసిల్దార్లు, అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చేనేత కార్మికులకు కేంద్ర మంత్రి సన్మానం

**సిద్దిపేట, ఆగస్టు 03(మనం ప్రతినిధి):** జాతీయ చేనేత వారోత్సవాల్లో భాగంగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు, కేంద్ర ప్రభుత్వ పెన్షన్ అందుకున్న చేనేత కార్మికులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సన్మానించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేనేత కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా వారికి తువాల కప్పి, జ్ఞాపిక అందించారు. కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందుకు చేనేతలకు కేంద్ర ప్రభుత్వం పింఛను అందించడం నిదర్శనం అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన సుమారు 15 మంది కార్మికులు పాల్గొన్నారు. చేనేత కార్మికులను గుర్తించి సన్మానించడం సంతోషంగా ఉందని చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

## సింగరేణి క్కార్మికుల లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి

- టీఎస్టీయూసీ సింగ్ ప్రధాన కార్యదర్శి టి.మణిరావ్



**మంచిర్యాల, ఆగస్ట్ 3(మనం న్యూస్):** సింగరేణిలో కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతి ఏడాది చెల్లించే 40 శాతంతో లాభాల వాటా తేదీని వెంటనే ప్రకటించాలని సింగరేణి కాలర్స్ లేబర్ యూనియన్ (టీఎస్టీయూసీ) ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్ సింగ్ కోరారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను ఆదారం టిఎస్టిసి ఆధ్వర్యంలో నాయకులు కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా టి.మణిరామ్ మాట్లాడుతూ, సింగరేణి కాలరీస్ సమస్త ప్రగతికి కార్మికులు పునాదులుగా నిలుస్తున్న సింగరేణి ఉద్యోగులు 72 మిలియన్ టన్నుల లక్ష్యానికి గాను 69.06 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 96 శాతం లక్ష్యాన్ని చేరుకొని రికార్డుస్థాయి డిస్పాచ్ ను నమోదు చేశారని, 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి కార్మికులకు లాభాల వాటపై తక్షణమే ప్రకటన చేయాలని 40 శాతం లాభాల్లో బాగా స్వామ్య వాటాను కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రకటించి చెల్లించే తేదీని ఖరారు చేయాలని సింగరేణి కాలర్స్ లేబర్ యూనియన్ తరపున సింగరేణి సీ అండ్ ఎండీకి విజ్ఞప్తి చేశామన్నారు. అలాగే నూతన ట్రాన్స్ఫర్ పాలసీ రద్దు, సొంత ఇంటి పథకం, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు, లేదా పర్మినెంట్ చేయాల ని, నూతన బొగ్గు గనులను వెంటనే ప్రారంభించాలని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూడా కోరామన్నారు. కార్యక్రమంలో టీఎస్టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోస్ ఎస్సీ ఎల్‌యు ప్రధాన కార్యదర్శి, టి.మణిరామ్ సింగ్ ఉపాధ్యక్షులు గద్దెల నారాయణ, టీఎస్టీయూసీ జిల్లా అధ్యక్షులు ముదిగంటి దామోదర్ రెడ్డి, జీడికే టీడీపీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి కొండి శ్రీనివాస్, బొల్లు మల్లయ్య, టి.స్వామిలు పాల్గొన్నారు.

## బాలల కథల పోటీల్లో ధూమాపానంకు ఉత్తమ స్థానం

- రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట చిన్నారికి ప్రథమ స్థానం



**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 03(మనం న్యూస్):** బాలల కథల పోటీలు - 2025లో భాగంగా మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీ 2025లో సిద్దిపేట జిల్లాకు చెందిన చిన్నారి లోహితకు ప్రథమ స్థానం దక్కింది. తెలుగు రాష్ట్రాలలో నిర్వహించిన పోటీల్లో 541 కథల్లో సిద్దిపేట జిల్లా బక్రిచెప్యాల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న జక్కుల లోహిత రాసిన 'ధూమపానం' కథ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం నాడు హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పత్తిపాక మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నారులు కథలు రాయడం ద్వారా పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందన్నారు. ఇలాంటి పోటీలు సమాజానికి శుభ పరిణామమన్నారు. అనంతరం వారు విద్యార్థిని జక్కుల లోహితకు ప్రతిభా పురస్కారంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. లోహిత కథలు రాయడంలో ప్రోత్సహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, అనిల్ కుమార్, సుహాసిని, శ్రీశైలం తోపాటు వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకట రమణ, కంతేటి చంద్రప్రతాప్, చొక్కాపు వెంక టమరణ, పైడిమర్రి రామకృష్ణలు పాల్గొన్నారు.

## బోనాలు మన సంస్కృతికి ప్రతీక



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 3(మనం న్యూస్):** బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శ్రావణ మాసం పురస్కరించుకొని భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో గల పోచమ్మ మరియు ఎల్లమ్మ బోనాల ఉత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐలేష్, నర్సింహ, రవీందర్ రెడ్డి, సామ్యూల్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకున్నా.. అక్రమ నిర్మాణాలు

- అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం
- ఎమ్మెనార్ పరిధిలో రెచ్చిపోతున్న రియాల్టర్లు



**సంగారెడ్డి ఆగస్టు 3(మనం ప్రతినిధి):** సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామ పరిధిలో గల ఎమ్మెల్యే మెడికల్ కళాశాల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా యాధృచ్ఛితగా బహుళ అంతస్తుల నిర్మాణాలు రియాల్టర్లు అక్రమంగా నిర్మిస్తున్నారు. సంగారెడ్డి పరిధిలో జీ ప్లస్ ఫోర్‌కు మాత్రమే అనుమతి ఉన్న జీ ప్లస్ 5 యాధృచ్ఛితగా నిర్మిస్తున్నారు ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలపై పంచాయితీ సెక్రెటరీ కి ఫిర్యాదు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం ధోరణి వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా అక్రమ నిర్మాణాల పై స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఆ భవనానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు: పంచాయతీ సెక్రెటరీ గోవింద్**

ఫసల్వాది గ్రామ పరిధిలో ఎమ్మెనార్ కళాశాల ముందు అక్రమంగా నిర్మిస్తున్న జి ప్లస్ 5 బహుళ అంతస్తు నిర్మాణాలకు గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని పంచాయతీ సెక్రెటరీ అన్నారు. వాళ్ళ మార్లు వారికి నోటీసులు ఇచ్చిన వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం ఏ కాకుండా వారి నిర్మాణాలు ఎదురుచితంగా నిర్మిస్తున్నారని వారిపై పై అధికారులకు ఆదేశాలతో చర్యలు చేపడతామని సెక్రటరీ తెలిపారు.

## బసవేశ్వరుడి ఆశయాలు ఆచరణీయం: నీలం మధు

- వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- విశ్వశాంతి కోసం18వ పాదయాత్ర అభినందనీయం
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



**రామచంద్రాపురం, ఆగస్టు 3(మనం న్యూస్):** మహాత్మ బసవేశ్వరుడి ఆశయాలు ఆచరణీయమైనవని, ఆ మహాత్ముడు చూపిన సన్మార్గంలో వీరశైవులు పయనిస్తూ లోక కళ్యాణం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్ చెరు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పటాన్ చెరు ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయానికి నిర్వహిస్తున్న పాదయాత్రకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ విశ్వశాంతికి వీరశైవ లింగాయత్ లు గత 18 సంవత్సరాలుగా పాదయాత్రను చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరునీ అడుగుజాడలలో నడుస్తూ ఆయన బోధించిన ప్రవచనాలను పాటిస్తూ వీరశైవ లింగాయత్ లు సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. సమాజ హితం కోసం పాటుపడే వీర శైవ లింగాయత్ లకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వీరశైవ లింగాయత్ ల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే లింగాయత్ లను ఓసీ నుంచి బీసీ లకు మార్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో లింగాయత్‌ల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహా రెడ్డి, నాయకులు జలిగారి ఎట్టయ్య, పట్లోళ్ల ఆదిత్య రెడ్డి, రవి, దేవరాజ్, సాయి, అశోక్, ప్రవీణ్, అనిల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి యోగ అవసరం

- జిల్లా పంచాయతి అధికారి దేవకీ దేవి
- ఘనంగా ముగిసిన అస్మిత యోగాసన పోటీలు




**సిద్దిపేట రూరల్, ఆగస్టు 03(మనం న్యూస్):** ప్రతి ఒక్కరికి యోగ అత్యవసరమని, ముఖ్యంగా మహిళల ఆరోగ్య రక్షణకు యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో అస్మిత యోగాసన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు డీపీఓ దేవకీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆరోగ్య రక్షణకు యోగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కాగా, మహిళలను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ యోగా పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారిని ఆమె అభినందించారు. అనంతరం డైరెక్టర్ తోట సంధ్య మాట్లాడుతూ ఈ పోటీల్లో సుమారు 600 మంది యోగా నన క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారని, ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యోగానన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, గౌరవాధ్యక్షులు కొమురవెల్లి అంజయ్య, చీఫ్ పాట్రన్ చివ్వ వభాకర్, టీఎన్‌జీఓ అధ్యక్షులు యాదగిరి, పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి, సంస్కార భారతి అధ్యక్షులు లక్కిరెడ్డి విజయ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాల బాలయ్యకు సినారె పురస్కారం

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 3(మనం న్యూస్):** సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఉత్సవంలో మహాకవి సినారె సాహిత్య పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులో సినారె కళాపీఠం, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగిన ఉత్సవంలో ఆయన ఈ పురస్కారాన్ని పొందారు. పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి.నారాయణరెడ్డి 94వ జయంతి సందర్భంగా సినారె సాహిత్య పురస్కారం అందించారు. ఉత్సవంలో సంస్థ అధ్యక్షులు మల్లెకేడి రాములు , సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిధారెడ్డి , కవి, రచయితలు బైస దేవదాసు, కాకుమాను సునీల్, దాసరి దయానంద్ రెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు డా.పోరెడ్డి రంగయ్య, ప్రముఖ సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటికీ సన్న బియ్యపు బువ్వ అందిస్తున్న ప్రభుత్వం మాది

- దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకం సన్న బియ్యం పథకం
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి



**శంకరపట్నం ఆగస్టు 3(మనం న్యూస్):** నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలుపు రేషన్ కార్డుల పై పంపిణీ చేసిన దొడ్డు బియ్యం రీసైకిలింగ్ దందా, కోళ్ల ఫార్ములా కు కోళ్ల దానాకు 75% పేద ప్రజలు విక్రయించిన సందర్భం ఉందని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శంకరపట్నం మండలం, కేశవపట్నం శ్రీ వెంకటేశ్వర గార్డెన్ అండ్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి, తుమ్మల నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన రేషన్ కార్డు లబ్ధిదారులకు కార్డుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో రెండు కోట్ల 81 లక్ష మందికి దొడ్డు బియ్యం అందిస్తే నేడు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి వర్గం ఎమ్మెల్యేలు దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టి నేడు మూడు కోట్ల 17 లక్షల మందికి సన్న బియ్యాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అర్హులైన పేదలకు, ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. నేటి ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ కలసాకారం చేసేందుకు నూతన రేషన్ కార్డులతో పాటు, రేషన్ కార్డులలో నూతన పేర్లను చేర్చి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహన్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా కమిషనర్ గౌడ్ అలం, సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజ వాకేడి, తహసిల్దార్ కే సురేఖ, ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్, టీపీసీసీ సభ్యులు మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కొత్తగట్టు మచ్చ గిరింద్ర స్వామి దేవస్థానం చైర్మన్ కోరెం రాజిరెడ్డి, మాజీ చైర్మన్ ఉప్పుగల్లు మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, మానకొండూరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహమ్మద్ షారుక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రేషన్ కార్డుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క చుక్క నీటిని వదులుకోబోం...

**రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం**

**ఏపీ ప్రభుత్వ కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతాం**

**బనకచర్ల పాపం ముమ్మాటికీ బీఆర్ఎస్‌దే**

**పదేళ్లలో చేసిందేం లేదు... తప్పులను సరిదిద్దుతున్నాం**

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**





**ఖమ్మం, ఆగస్ట్ 3(మనం బ్యూరో):** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్ దేనని, ఏపీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన 10వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ...'గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలు రైతులకు అందుబాటులో ఉండేవి. మేం అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర వ్యవధిలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలను నిర్మించాం. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అందుకే... దేశంలోనే వరిని అత్యధికంగా పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. 'ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. అందుకే.. సబ్బండ వర్గాలు కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. ఇప్పుడు కూడా మన రాష్ట్రంపై అవే కుట్రలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి... వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. మన పొరుగు రాష్ట్రం ఏపీ... మన పంట పొలాలు ఎండిపోయేలా అక్రమ ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి సమర్థవంతంగా వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది' అని చెప్పారు. 'సాగునీటి రంగ అభివృద్ధికి పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం. కృష్ణా, గోదావరిపై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులే మన పంట పొలాలకు నీళ్లందిస్తున్నాయి. వాళ్ల హయాంలో ఒక్కటంటే ఒక్కటి పనికొచ్చే ప్రాజెక్టును కట్టలేదు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు కూడా నీళ్లందడం లేదు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం మాని, అసలు విషయాలను తెలుసుకోవాలి' అని సూచించారు. 'అప్పుడు పోలవరం కడుతుంటే చోద్యం చూశారు. బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతుంటే పట్టించుకోలేదు. నీళ్లు సముద్రం పాలవుతున్నా పట్టనట్లుగా వ్యవహరించారు. పైగా... అప్పటి ఏపీ పాలకులకు రెడ్ కార్పెట్ తో స్వాగతం పలికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారు. విభజన చట్టంలో లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏపీలో కలుపుతుంటే స్పందించలేదు' అని విమర్శించారు. 'తెలంగాణకు పట్టిన శాపం బీఆర్ ఎస్. గత పదేళ్లలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిదిద్దుతున్నాం. కృష్ణా, గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లందించేలా పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్క దిద్దుతూనే... సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల ఛైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యానారాయణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన లారీ యజమానుల సంఘం ఎన్నికలు



**ఖమ్మం, ఆగష్టు 3(మనం న్యూస్):** ఖమ్మం పట్టణ లారీ యజమానుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం లారీ యూనియన్ ఆఫీస్ లో జరిగాయి. ఇప్పటికే అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఇద్దరు జాయింట్ సెక్రటరీలు పదవులు ఏకగ్రీవమయ్యాయి. మరో ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పదవి కోసం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా బోయ శ్రీను, ఉపాధ్యక్షుడు గా ఇండిపెండెంట్ అభ్యర్థి పొట్లపల్లి సర్వయ్య పై తేజావత్ వీరన్న 78 ఓట్లతో విజయం సాధించారు. నాలుగు కీలక పదవులతో పాటు ఎనిమిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్ల పదవులు ఇంతకు ముందే ఏకగ్రీవయ్యాయి. ఇందులో అధ్యక్షులుగా బోయపాటి కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడిగా బి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా మస్తాన్ వలి మహమ్మద్ అలీమ్ తో పాటు ట్రెజరర్ గా చంద్ర సీతారాం, మరో ఎనిమిది మందిని ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం

**కమలాపురంలో గిడ్డంగు నిర్మాణానికి శంకుస్థాపన**

**ప్రభుత్వ జూనియర్ కళశాలలో డిజిటల్ బోర్డు తరగతులు ప్రారంభం**

**రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు లక్షన్నర వితరణ**



**ముదిగొండ, ఆగస్టు 3(మనం న్యూస్):** ముదిగొండ మండలంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముదిగొండ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర గిడ్డంగులు సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తన సొంత మండలం అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు డిజిటల్ బోర్డు తరగతులు సౌకర్యంగా 1.50 లక్షలు వితరణ చేశారు. దానిలో భాగంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క డిజిటల్ తరగతులను ప్రారంభించారు. తరువాత కమలాపురం పరిధిలోని కొత్తగా నిర్మిస్తున్న గోదాములకు శంకుస్థాపన చేశారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం విద్య,వ్యవసాయం పట్ల చిత్తశుద్ధితో ఉందని రాష్ట్రం డిజిటల్ తరగతులలో ముందు బాగాన ఉందని అలాగే వ్యవసాయం పట్ల రైతులు పంటను నిల్వ ఉంచుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నడుచుకుంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, సొసైటీ చైర్మన్ తుపాకుల ఏలగొండ స్వామి మాజీ జడ్పీటీసిలు బుల్లెట్ బాబు, పసుపులేటి దేవేంద్ర, ఐఎన్టియుసి అధ్యక్షులు ఉసికల రమేష్, మహమ్మద్ అజ్గర్,మల్లెల అజయ్, కందిమల్ల వీరబాబు, కాంగ్రెస్ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ దాడులను ఆపివేయాలి

- **7న పాలస్తీన సంఘీభావ ర్యాలీకి సిపిఎం మద్దతు**
- **సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం**




**ఖమ్మం, ఆగష్టు 3(మనం న్యూస్):** గత అనేక సంవత్సరాల నుండి పాలస్తీనా పైన ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ దాడులను వెంటనే ఆపివేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పాలస్తీనా పైన ఇజ్రాయిల్ గత కొన్ని సంవత్సరాల నుండి యుద్ధం చేస్తూ, వేల మంది ప్రజల ప్రాణాలను బలిగొందని ఆయన విమర్శించారు. కనీస యుద్ధ నియమనిబంధనలను పాటించకుండా విచక్షణార హితంగా పాలస్తీనా పైన బాంబుల వర్షం కురిపిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గాజా ప్రాంతంపైన దుర్మార్గమైన పద్ధతుల్లో యుద్ధాన్ని చేస్తోందన్నారు. గాజా లోని పాఠశాలల పైన, హాస్పిటల్స్ పైన పౌర సముదాయాల పైన,ప్రజలకు ఆహారాన్ని అందించే రేషన్ షాపుల పైన ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో దాడులు చేస్తోందని విమర్శించారు. ఈ దాడుల్లో వేలమంది పాలస్తీనా పౌరులు, పసిపిల్లలు, మహిళలు వృద్ధులు చనిపోయారన్నారు. ఇప్పటికే ఇజ్రాయిల్ యుద్ధం వలన సుమారు 56,000 మంది పాలస్తీనా పౌరులు చనిపోయినట్లు అంతర్జాతీయ సంస్థలు ప్రకటించాయన్నారు. ఇందులో సుమారు 20వేల మంది పసిపిల్లలు ఉండడం బాధాకరమని పేర్కొన్నారు. అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ మొత్తం గాజా ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలని చూస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే గాజా నుంచి పాలస్తీనా ప్రజలందరూ కూడా వెళ్లిపోవాలంటూ ఆజ్ఞలు వేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గాజా ప్రజలకు బయటి ప్రాంతాల నుండి అందుతున్న సహాయ సహకారాలను ఇజ్రాయిల్ దుర్మార్గంగా అడ్డుకుంటుందని తెలిపారు. మంచి నీరు, పాలు,ఇతర ఆహార పదార్థాలను గాజాలోనికి రాకుండా నియంత్రిస్తోందని అన్నారు. దీంతో గాజా ప్రజలు కనీసం తాగడానికి నీరు కూడా దాహంతో చనిపోయేలా ఉన్నారని అన్నారు.పసి పిల్లలకు పాలు, ఆహార పదార్థాలు అందక ఆకలితో అస్థిపంజరాలుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల నుండి ఇజ్రాయిల్ ఇంత దుర్మార్గంగా అమానువీయ పద్ధతుల్లో పాలస్తీనా, గాజా ప్రాంతాలపైన దాడులకు పూనుకుంటుందని ఆయన విమర్శించారు. ఈ అమానవీ యుద్ధాన్ని ప్రపంచంలో మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ నిరసించాలని ఆయన కోరారు. అందులో భాగంగానే ఆగస్టు 7న ఖమ్మం నగరంలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని తెలియ జేస్తూ పెద్ద ర్యాలీ జరగబోతుందని తెలిపారు. పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీకి సిపిఎం పార్టీ సంఘీభావాన్ని తెలియజేస్తోందని, ఆ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో ఖమ్మం జిల్లాలోని విద్యార్థులు, యువకులు, మేధావులు ఉద్యోగులు, వివిధ రాజకీయ ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ ఆత్మీయ సమ్మేళనం




**ఖమ్మం, ఆగష్టు 3(మనం న్యూస్):** శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ, ఖమ్మం వారి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఖమ్మం అర్బన్ తహశీల్దార్ దొడ్డారపు సైదులు చేతుల మీదుగా శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ లోగోను, సొసైటీ విధివిధానాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా వన వనజీవి రామయ్య జ్ఞాపకార్థం వెలుగుమట్ల పార్కు నందు ఒక మొక్కను నాటి వందనం సమర్పించారు. శ్రీశ్రీశ్రీ దక్ష ప్రజాపతి శాలివాహన సొసైటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు సొసైటీ అధ్యక్షులు తిగుళ్ల వెంకటరమణ, కార్యదర్శి విలాసాగారపు ప్రసాద్,, గౌరవ అధ్యక్షులు కానుగుల రాధాకృష్ణ, ట్రెజరర్ కొలిచలం చిరంజీవి, రాచర్ల రాజు, అలాగే శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు దరిపల్లి కిరణ్, ఉపాధ్యక్షులు కాంపాటి రమేష్, ప్రధాన కార్యదర్శి మొగిలిచెర్ల వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి దరిపల్లి భాస్కర్, సంయుక్త కార్యదర్శి గుమ్మడేల్లి సైదారావు, సమన్వయకర్త సర్వయ్య, గౌరవ సలహాదారులు పోలూరి పరశురాములు, సభ్యులు అనగా పోరల్ల కృష్ణ, కానుగుల వేణు, వరికళ్ళు లక్ష్మీనారాయణ అవునురి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి 5న ధర్నా

**టీయస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని**




**ఖమ్మం, ఆగష్టు 3(మనం న్యూస్):** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసంఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదీన కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను స్థానిక యుటిఎఫ్ భవన్ లో ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. పిఆర్సీ నివేదికను వెలువరించి వెంటనే పిఆర్సి ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రతి ప్రైమరీ స్కూల్లో ఇద్దరు టీచర్లు, 40 మంది పిల్లలు దాటితే 5 గురు టీచర్లు ఉండేలాగా పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న 5 డిఏ లలో కనీసం 2 ఇవ్వాలని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలల టైం టేబుల్ మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని, బేసిక్ పే ప్రకటించాలని, మోడల్ స్కూల్, గురుకుల టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు ఇవ్వాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.వి.నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బుర్రి.వెంకన్న, షమీ, కోశాధికారి వల్లంకొండ. రాంబాబు, నాగేశ్వరరావు, సురేష్, ఉద్దండ్, సుధాకర్ పాల్గొన్నారు.

## నాగారపు శ్రీనివాసుకు సువర్ణ కంకణం



**గంగాధర, ఆగష్టు 03, ( మనం న్యూస్) :** గంగాధర మండలం గోపాలరావుపల్లి గ్రామానికి చెందిన హనుమాన్ దేవాలయం కార్యనిర్వాహణ అధికారి నాగారపు శ్రీనివాస్కు లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డు ప్రదానం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయంలో కార్యనిర్వాహణ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాగారపు శ్రీనివాస్కు లలిత కళా సమాఖ్య వారు నిర్వహించిన 31వ స్వాతంత్ర్య దినోత్సవ సువర్ణ కంకణ అవార్డు సంబరాలలో భాగంగా ఆదివారం హైదరాబాద్ లో నిర్వహించిన త్యాగరాయ గాన సభలో ఈ పురస్కారం అందజేశారు. గ్రామీణ అభివృద్ధిలో చేసిన సేవలతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో శ్రీనివాస్ చూపించిన కృషిని గుర్తించి సువర్ణ కంకణ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నాగారపు సత్యనారాయణతో పాటు హనుమాన్ ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు.

## పాల్వంచ బస్టాండ్‌కు మహర్దశ

**ఎమ్మెల్యే కూనంనేని చొరవ**

**జెన్కో సీఎస్ఆర్ నిధులతో నూతన హంగులు**




**పాల్వంచ, ఆగష్టు 3(మనం న్యూస్):** శిథిలావస్థకు చేరిన పాల్వంచ బస్టాండ్ కు మహర్దశ పట్టనుంది. వర్షం వస్తే.. అవుట్ గేట్ వరద నీటితో అలరారుతుంది. ఫలితంగా ప్రయాణికుల రాకపోకలు ఇబ్బందికరంగా మారేవి. ఏళ్లనాటి మరుగుదొడ్లు క్షీణ దశకు చేరాయి. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో.. మరుగుదొడ్ల నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండ్ స్లాబ్ పెచ్చులూడి, వర్షపు నీటితో ప్రయాణికులు నానా అవస్థలు పడే దుస్థితి. ఇటీవల కాలంలో పలు పార్టీలు బస్టాండ్ అరకొర వసతులపై ఆందోళన బాట పట్టాయి. ప్రసార మాధ్యమాలు వరుస కథనాలు ప్రచురించాయి.

**శాసనసభ్యుని చొరవతో ఎట్టకేలకు మోక్షం..**

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్ ల వెతలపై దృష్టి సారించారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బస్టాండులను నవీకరించేందుకు శ్రీకారం చుట్టారు. అన్ని హంగులతో నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణకు దిగారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కొత్తగూడెం బస్టాండ్ కు సింగరేణి సిఎస్ఆర్ నిధులు రూ 14 కోట్లు, పాల్వంచ బస్టాండ్ నిర్మాణానికి జెన్కో సిఎస్ఆర్ నిధులు రూ 14 కోట్లతో కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కూనంనేని సహకారంతో పాల్వంచ బస్టాండ్ కు సర్వహంగులు సమకూరే అవకాశం ఉంది. శాసనసభ్యులు కూనంనేని స్ఫూర్తిని పలు పార్టీలు, సంఘాలు హర్షిస్తున్నాయి.

## గోకారం చెరువును వెంటనే పునరుద్ధరించాలి

- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నర్సింహ...**



**కల్వకుర్తి రూరల్ ఆగస్ట్ 03(మనం న్యూస్):**చారగొండ మండల పరిధిలోని గోకారం చెరువును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించి జిల్లాలో గల వనరులను,ముడి సరుకులతో ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ డిమాండ్ చేశారు.ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్అండ్ బి అతిథి గృహంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సింహ,జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ లు విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం జినుకుంట గ్రామ శివారులో లెదర్ పార్కుకు కేటాయించిన 23 ఎకరాల స్థలంలో లెదర్ పార్క్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీపీఐ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా తృతీయ మహాసభలను ఈనెల 1,2 తేదీలలో కల్వకుర్తి పట్టణంలో నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా మహాసభలలో 9 తీర్మానాలను ఆమోదింప చేయడం జరిగిందని తీర్మానాలను రానున్న కాలంలో అమలు దిశగా పార్టీ ఆధ్వర్యంలో ముందుకు సాగుతామన్నారు. మహాసభలలో చేసిన తీర్మానాలు మొదటిది గోకారం చెరువును పునరుద్ధరించాలని,జినుకుంటా గ్రామ శివారు ప్రాంతంలో లెదర్ పార్కు కు కేటాయించిన 23 ఎకరాలలో తక్షణమే ఇండస్ట్రీ పార్కును ఏర్పాటు చేయాలని, పాలెం సమీపంలో పారిశ్రామిక ఇండస్ట్రీ పార్కును ఏర్పాటుచేసి ఆసక్తివారికి కేటాయించాలని, జిల్లాలో పలు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సామర్థ్యం పెరగడంతో చేపల పెంపకానికి అనువుగా ఉండటంవల్ల మత్స సంపద నిలువకు కోల్ స్టోరేజ్ లను నెలకొల్పాలని, కొల్లాపూర్, కల్వకుర్తి, ప్రాంతాలలో మామిడి పంట విస్తీరంగా సాగు కావడంతో పంటను హైదరాబాద్ మార్కెట్ కు తీసుకెళ్తే దళారులు తరుగు నాణ్యత పేరుతో మోసం చేస్తున్నారని మామిడి అదారిత మార్కెట్ యార్డ్ ను ఏర్పాటు చేయాలని తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు.నాగర్ కర్నూల్ జిల్లాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాపరంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ పాలిటెక్నికల్ కళాశాలలను ప్రతి నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయడంతో పాటు ఈ ప్రాంతంలో గల ముడి సరుకులు ఖనిజాలు విరివిగా ఉండటంతో సిమెంటు కాగితపు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు వరకు రైతాంగానికి సాగునీరు అందడం లేదని ఉపకాల్వలు పూర్తి చేయలేదని,తూములు సెటర్లు లేవని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ఉమ్మడి అన్నారం గ్రామంలో బోనాల పండుగకు షెడ్యూల్ ఖరారు




**పెన్ పహాడ్, ఆగస్టు 03 (మనం న్యూస్):** మండల పరిధిలోని ఉమ్మడి నాగులపాటి అన్నారం గ్రామంలో బోనాల, ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ పండుగలను నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన నాయకులు, గ్రామస్తుల సమక్షంలో ఆదివారం షెడ్యూల్ చేశారు ఈ పండుగలను ఈనెల 14న బోనాల ముత్యాలమ్మ పండుగ,15న కనకదుర్గమ్మ పండుగలను వనభోజనాలను నిర్వహించ తలపెట్టగా ఈ పండుగలకు అయ్యే ఖర్చును నాగులపాటి అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన తండు ఎల్లయ్య తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని ముందుకు వచ్చారు హిందువుగాను ఎల్లయ్యను ఉమ్మడి అన్నారం గ్రామానికి చెందిన ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు అభినందించారు....ఈ కార్యక్రమంలో ఉమ్మడి అన్నారం గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు

- 8 లక్షల 64 వేల నూతన రేషన్ కార్డులు జారీ
- పత్తిపాక రిజర్వాయర్ డిపిఆర్ తయారీకి
- కోటి 10 లక్షల మంజూరు
- బనకచర్ల ప్రాజెక్టు ను అన్ని దశలలో అడ్డుకుంటాం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**పెద్దపల్లి/ధర్మారం, ఆగస్టు 03 (మనం ప్రతినిధి):** ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతనంగా 8 లక్షల 64 వేల నూతన రేషన్ కార్డులు మంజూరు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మార్కెట్ యార్డులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, బీసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులు, లతో కలిసి 45 కోట్ల 15 లక్షలతో నిర్మించే ఐటీఐ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, 1092 పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ**

సమర్థత మారు పేరు తుమ్మల నాగేశ్వర రావు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులుగా రావడం అదృష్టమని అన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడంలో రవాణాశాఖ మంత్రి పూర్ణం ప్రభాకర్ కృషి ఎంతగానో ఉందని అన్నారు. స్వతంత్ర భారత దేశంలో మొదటిసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత సాధించడంలో మన ప్రభాకర్ కృషి చేశారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గానికి తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. 1984 లో ఎన్.ఎస్.యూ.ఐ నాయకునిగా 40 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ లో ఉన్నారని, పార్టీ కార్యకర్త నుంచి రాష్ట్ర కేబినెట్ మంత్రి స్థాయికి ఎదిగారని అన్నారు. నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి గా నేడు లక్ష్మణ్ ఉన్నారని , ఆయన కోరిన ప్రతి అంశం పూర్తి చేస్తామని అన్నారు. ధర్మపురి నియోజకవర్గం సమీపంలో గోదావరి నది పారుతున్నా ఇక్కడ ప్రాజెక్టు కట్టలేదని అన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహ పత్తిపాక రిజర్వాయర్ డిపిఆర్ తయారీకి కోటి 10 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసామని అన్నారు. బోమ్మరెడ్డి పల్లి గ్రామం దగ్గర మైనర్ కాల్వ పెండింగ్ పనుల పూర్తి 5 కోట్ల రూపాయల, ఎస్సారెస్పీ స్టేజి 1 మేడారం లింక్ కేనాల్ పూర్తి చేసేందుకు 3 కోట్ల 26 లక్షలు, యశ్వంత్ రావు పూర్ చెరువు పూడికతీత పనులకు అవసరమైన నిధులు, ధర్మారం లో ఉన్న 6 లిఫ్ట్ నిర్వసణ, మరమ్మత్తు పనులకు 82 లక్షలు, అక్కెపల్లి లిఫ్ట్ పెండింగ్ పనులకు నిధులను మంజూరు చేస్తామని అన్నారు.

తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని చూస్తుందని, గోదావరి వాటర్ మేనేజ్మెంట్ బోర్డు నుంచి సి.డబ్ల్యూ.సి వరకు ఫిర్యాదు చేసి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ అభ్యంతరాల మేరకు ఆ ప్రతిపాదనను తిరస్కరించడం జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో గోదావరి జలాల ట్రిబ్యునల్, ఏపీ పునర్విభజన చట్టం కు వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ చూస్తుందని, దీనిని అన్ని వేదికలలో, న్యాయ పరంగా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై సుప్రీంకోర్టు జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెడ్తామని తెలిపారు. 3 బ్యారేజీలు ఫౌండేషన్ బలహీనంగా ఉందని, అక్కడ నీరు నిల్వ చేస్తే 44 ఊర్లు , భద్రాచలం కొట్టుకొని పోతాయని ఎన్.డి.ఎస్.ఏ రిపోర్ట్ అందించిందని అన్నారు. 3 బ్యారేజీల మరమ్మత్తు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం 10 వేల కోట్ల ఖర్చు పెట్టి రేషన్ ద్వారా 2.82 కోట్ల దోడ్డు బియ్యం సరఫరా చేసేదని, ఆ బియ్యం 80 శాతం అక్రమాలకు, రీసైక్లింగ్ కు ఉపయోగపడేదని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా 3 కోట్ల 17 లక్షల మంది నిరుపేదలకు 13 వేల కోట్ల ఖర్చు చేసి నెలకు 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు.

ప్రస్తుతం అర్హులైన అందరికీ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. 8 లక్షల 64 వేల నూతన రేషన్ కార్డులు రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేశామని , ప్రస్తుతం 98 లక్షల 58 వేల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రాంతంలో అదనంగా 9600 నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి అదనంగా 19480 మంది పేదలకు రేషన్ అందిస్తున్నామని అన్నారు. దేశంలో ఎక్కడా కూడా 84% జనాభా కు ఉచితంగా సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ**

పార్టీ కార్యకర్త నుంచి మంత్రి వరకు స్థానిక లక్ష్మణ్ కుమార్ ఎదిగారని అన్నారు. ధర్మపురి అభివృద్ధి కోసం అవసరమైన అన్ని పనులు మంజూరు చేస్తామని అన్నారు. గతంలో విధ్వంసం జరిగిన పాలనను గత 20 నెలల కాలంలో గాడిలో పెడ్తున్నామని అన్నారు. నీటిపారుదల శాఖ లో 10 వేల కోట్ల విద్యుత్ బకాయిల, 40 వేల కోట్ల బిల్స్ బకాయి పెట్టారని అన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చే దిశగా శక్తి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీర్వాదం అందించాలని కోరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి ఏ పని ఉన్నా తాను తీసుకురుఖుటానని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని అన్నారు. రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని అన్నారు. వరి, పత్తి, మిర్చి పంటలతో రైతులకు నష్టం వస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం దేశం లక్షల కోట్లు ఖర్చు చేసి ఆయిల్ కొంటున్నామని, సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ**

నూతన రేషన్ కార్డుల జారీ తో పాటు ప్రస్తుతం ఉన్న కార్డులలో నూతన సభ్యుల నమోదు జరుగుతుందని అన్నారు.9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నమోదు చేసి రైతు పండుగ చేశామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్ల పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నామని అన్నారు. శ్రావణ మాసంలో రేషన్ కార్డుల పంపిణీ పండుగ జరుగుతుందని అన్నారు. మహిళలు ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణం చేస్తే 200 కోట్ల జీరో టికెట్లు జారీ చేసి 6680 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. గురుకులాలో 40 శాతం డైట్ చార్జీలు 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంచామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ**

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో పేదల సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు. మంత్రులను కోరిన వెంటనే సమయం అందించారని తెలిపారు. ప్రతి ఎన్నికల సమయంలో తనకు లీడ్ ధర్మారం మండలం ఇచ్చిందని తెలిపారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ ను నిర్మిస్తామని మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు మాట ఇచ్చి తప్పారని, అసెంబ్లీ లో మాజీ సీఎం కేసిఆర్ సైతం ప్రకటించారని అన్నారు. మా ప్రాంతం నుంచి నీళ్ళు ఇతర ప్రాంతాలకు తరలించారని, ఇక్కడ రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసినప్పటికీ పనులు చేయలేదని అన్నారు. ధర్మపురి ప్రాంతంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇవ్వాలని పోరాటాలు చేస్తే గత ప్రభుత్వాలు అణిచివేసాయని అన్నారు. వ్యవసాయం పై ప్రజలు అధికంగా ఆధారపడి ఉంటారని అన్నారు. వెల్గటూర్, ధర్మారం చివరి ఆయకట్టు నీరు వచ్చేలా ప్లాన్ చేయాలని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసేందుకు కోటీ 10 లక్షల మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ముత్తునూరు లిఫ్ట్ మోటార్లు కాలిపోయాయని, 82 లక్షలు మరమ్మత్తు కోసం మంజూరు చేయాలని, 1200 ఎకరాల ఆయకట్టు నీరు వస్తుందని అన్నారు. బొమరెడ్డిపల్లి కాల్వ 60 శాతం పూర్తి చేశామని, 7 నుంచి 8 కోట్ల మంజూరు చేస్తే 8 గ్రామాలకు నీరు అందుతాయని అన్నారు. ఎస్సారెస్పీ మేడారం అనుసంధానం ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన కోరారు. యశ్వతరావు పేట చెరువు పూడికతీత పనులు పూర్తి చేయాలని అన్నారు. గత ప్రభుత్వం ఎప్పుడు పేదల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేయలేదని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం సరఫరా , రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్, అదనపు కలెక్టర్ డి.వేణు, పెద్దపల్లి ఆర్.డి.ఓ బి. గంగయ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ



**జగిత్యాల, ఆగస్టు 03 ( మనం ప్రతినిధి):** జిల్లాలో కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ కార్యవర్గసభ్యుడు, డిక్కి జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐ జె యు జిల్లా అధ్యక్షులు చీటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి లు పాల్గొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలతో ఘన నివాళ్లు అర్పించినారు. ఈ సందర్భాన్ని పుష్కరించుకుని డిక్కీ కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ దేశానికి అంబేద్కర్ అందించిన అమూల్యమైన సేవలు, సమానత్వం, న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు, ఆశయాలను, ఆదర్శాల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి పొందటంతో పాటు స్మరించుకోనుటకై ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈరోజు బడుగు, బలహీన వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం అవుతున్నారు అంటే అంబేద్కర్ చేసిన కృషి ద్వారానే సాధ్యమైందని అన్నారు. వారి జీవితాన్ని త్యాగం చేసి అణగారిన, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి రాజ్యాంగ బద్దంగా సాధించి చట్టరూపంలో కార్యరూపం సాధించుటకు అహర్నిశలు పాటుపడ్డారు. ఆనాటి కాలంలో అంబేద్కర్ ఎదురుకున్న సంఘటనలను భవిష్యత్ తరాలకు మళ్ళీ రావద్దని రిజర్వేషన్స్ అనే రక్షణను, రాజ్య పదవులను రిజర్వేషన్స్ ప్రకారం కేటాయించి అందులో వారే పోటీ చేసి పరిపాలనలో భాగస్వామ్యం అయ్యేలా ఆలోచన చేసిన వారి మేధస్సు ఎలా సాధ్యమైందో అశ్చర్యం వేస్తుందన్నారు. విదేశాలకు వెళ్లి న్యాయశాస్త్రంలో పట్టాపొంది అట్టి జ్ఞానంతో దేశానికి తొలి న్యాయశాఖ మంత్రిగా పని చేసిన వారి సేవలు అనిర్వచనీయం.ఆయన దూరదృష్టి వల్లనే ఈ రోజు బడుగు, బలహీన వర్గాలు పార్లమెంట్, శాసనసభ్యులు కాగలుగుతున్నారు అని స్మరించారు. ఇలాంటి గొప్ప మహనీయుని కార్యక్రమం లో మమ్మల్ని భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు . అనంతరం ఐ.జె.యు జిల్లా ప్రధాన కార్యదర్శి సంపూర్ణ చారి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో అంటరాని కులంగా పాటించబడిన మహర్ కులం లో జన్మించిన అంబేద్కర్ కేవలం చదువు ద్వారానే ప్రపంచ మేధావిగా గుర్తించబడ్డారని కొనియాడారు. విజ్ఞానం వల్లనే అంటరానితనం అనే జడ్యం రూపుమాపుతుందని విశ్వసించి ఆచరణలో చూపారు. దేశంలో మొట్ట మొదటి డాక్టరేట్ పొందిన వ్యక్తి. వారిలా అనేక డిగ్రీలు పొందిన వారు ప్రపంచంలో ఎవరు లేరని అందుకే ఐక్యరాజ్యసమితి ప్రపంచ మేధావి అని ప్రశంస అందించింది.

ప్రపంచంలో అగ్రరాజ్యం గా చెప్పుకునే అమెరికా కూడా వాళ్ళ స్వాతంత్రా రాగానే మహిళలకు ఓటు హక్కు ఇవ్వలేదు. కానీ భారతదేశ స్వతంత్రం సిద్ధించగానే దేశంలో ఉన్న మహిళలకు ఓటుహక్కు ఉండాలని పోరాడి రాజ్యాంగంలో అంబేద్కర్ పొందుపరిచారు అని అన్నారు. అయన జీవిత కాలం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, హక్కుల కోసమే పోరాడరని అన్నట్లు. అంబేద్కర్ ఆశయాలను భవితరాలకు అందించు కార్యక్రమం లో అన్ని రకాలుగా తమ అసోసియేషన్ సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఐజేయు ట్రెజరర్ సిరిసిల్ల వేణుగోపాల్ , సహాయ కార్యదర్శి రాజ్ కుమార్ , టి డబ్ల్యూ జె ఎఫ్ ప్రధాన కార్యదర్శి మేనేని రవీందర్ రావు, సహాయక కార్యదర్శి తెలంగాణ శక్తి ఎడిటర్ అనంతుల కాంతారావు , మట్టి పూలు ఎడిటర్ తక్కళ్ళ దేవయ్య , అక్షర న్యూస్ ప్రతినిధి ప్రసాద్ , అంబేద్కర్ సంఘం నాయకులు రిటైర్డ్ ఎంఈఓ మద్దెలనారాయణ , కాయితి శ్రీనివాస్, బొల్లం ప్రభాకర్, దాసరి లచ్చయ్య, కంటె అంజయ్య, దాసండ్ల కమలాకర్,జవ్వాజి శంకర్, చెటపెల్లి రాజనర్సు,నర్ర రాజేందర్, బుయ్య శాంతయ్య, మూగల జలందర్, బత్తుల రాజేందర్, శ్రీపతి మనోహర్, గుంటూరు నారాయణరెడ్డి,సుద్దాల జలాదిశ్వర అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ



**జైపూర్ ఆగస్టు 3 (మనం న్యూస్):** భీమారం మండల కేంద్రంలో,ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేసి సీనియర్ జర్నలిస్టు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి.మధు జాతీయ కార్యదర్శి కొంకటి.లక్ష్మణ్, ల చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నెరువట్ల,రాజలింగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో,జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు.భీమారం మండల ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ అధ్యక్షులు మంతెన. సమ్మయ్య ఉపాధ్యక్షులు ఆవిడపు. సురేష్ఉపాధ్యక్షులు గాలిపెల్లి. నాగభూషణ్ ప్రధాన కార్యదర్శి దుర్గం. తిరుపతి ప్రచార కార్యదర్శి కుమ్రే. సాగర్ సహాయ కార్యదర్శి దాసరి. నరేందర్ కోశాధికారి పోతం. సమ్మయ్య, ధరవత్. శంకర్ లు కార్యవర్గం సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షులు మంతెన సమ్మయ్య మాట్లాడుతు. జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకుల దిశా నిర్దేశంలో,ఆల్ ఇండియా అంబేద్కర్ యువ సంఘం,మండలంలోని పలు గ్రామాలలో, పూర్తిస్థాయిలో,మండల కమిటీ సభ్యులము నిర్మాణం కోసం కృషి చేయడం జరుగుతుందని, అధ్యక్షులు గా బాధ్యతలు అప్పగించినందులకు ప్రతి ఒకరికి ప్రత్యేక జై భీమ్ లు తెలిజేస్తూ శిరస్సు వంచి ధన్యవాదములు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా కో కన్వీనర్లు, ఆసంపల్లి శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు కొల్లూరి రవికుమార్, పానుగంటి. రాజలింగు సింగరేణి ఎస్ సి, ఎస్ ఎస్టీ ఏంప్లాయిస్, జాడి. నరేష్, మద్దెల. నరసింహులు జిల్లా నాయకులు,యువకులు, ఆటో,ట్రాలీడ్రైవర్ లు తదితరులు పాల్గొన్నారు.నూతనంగా నియమితులైన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, కమిటీకి, జాతీయ,రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆరోగ్య యోగా కేంద్రాన్ని ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే



**నిజామాబాద్, ఆగస్టు 03 ( మనం బ్యూరో ):** మోదీ ప్రధాని అయిన తర్వాత యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని వినాయక నగర్ శ్రీనగర్ కాలనీలో ఆదివారం ఆరోగ్య యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో మానవుడు శారీరకంగా, మానసికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందే అవకాశం ఉందని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల స్థాపన ద్వారా ప్రజారోగ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి దినచర్యలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పంచ రెడ్డి లావణ్య లింగం, యోగా గురువులు రంజిత్, బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, మఠం పవన్, హరీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు

- ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- ములుగు జిల్లా ఎస్పీ శబరిష్



**ములుగు, ఆగస్టు 3, మనం ప్రతినిధి:** మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానా మరియు జైలు శిక్ష తప్పవని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ హెచ్చరించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా గత నెల(జూలై)లో 456 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలియచేశారు. ఇకపై కేసులు నమోదు చేయడం తో పాటు నిందితులకు శిక్ష విధించడంపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలియచేశారు . గడిచిన వారంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 17 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి కోర్ట్ ద్వారా అట్టి 17 మందికి 2 రోజుల జైలు శిక్షతో పాటు 2వేల రూపాయల జరిమానాలు విధించడం జరిగింది అని తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే అట్టి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని,జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని,తరచు డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారస్సు చేయడం జరుగుతుందన్నారు. తాగి వాహనాలు నడపవద్దని తద్వారా జరిగే ప్రమాదాలను, కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయే అంశాలపై పోలీస్ శాఖ వారు కౌన్సిలింగ్ ద్వారా వివరించడం, పట్టుబడిన వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ కోర్టులో హాజరు చేయడం జరుగుతుంది అని అన్నారు. మద్యం సేవించి మొదటిసారి పట్టుబడిన, రెండవసారి పట్టుబడిన వారు సేవించిన మద్యం మోతాదులను బట్టి తప్పనిసరిగా శిక్షలు విధించబడతాయి అని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణపైన, మద్యం తాగి వాహనాలు నడిపేవారిపైన కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారికి నిరంతరం కౌన్సిలింగ్లు ఇవ్వడం, సూచనలు చేయడం జరుగుతుందన్నారు. అంతే కాక పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులతో మమేకమై పాటించాల్సిన నియమాలు వివరించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలను, అన్యాయాన్ని వివరించిన బీజేపీ నాయకులు




**నాగిరెడ్డిపేట్, ఆగస్టు 03 ( మనం న్యూస్ ):** భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్నికల కార్యాచారణలో భాగంగా స్థానిక సంస్థల నాగిరెడ్డిపెట్ ప్రభారీ ప్రముఖ శాస్త్రవేత్త రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి చేతుల మీదుగా పోలింగ్ బూత్ సంపర్క్ అభియాన్ బ్రోచర్ ఆవిష్కరణ చేసారు. అనంతరం గోపాల్ పేట్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని తెలియజేశారు. అనంతరం నాగిరెడ్డిపెట్ మండలానికి ఇటీవల నూతనంగా వచ్చిన ఎస్త్రు భార్గవ్ గౌడ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమాన్లు, నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిలు కిషన్ భాస్కర్, ఉపాధ్యక్షులు, ఈశ్వర్, శేఖర్, రాజ గంగాధర్, వెంకట్ రెడ్డి, నాయకులు కృష్ణ, అంజయ్య, విష్ణు, సిద్దిరాములు, రాజు, వెంకట్ రాములు, భావేశ్ యాదగిరి, విజయ్ గౌడ్, కినేష్ రాజు బూత్ అధ్యక్షులు, బుచ్చిరెడ్డి, నారాయణ,సాయి బాబా, నారాయణ, గోపాల్, శివ కుమార్, రాములు, సాయిలు, రాజు, గోపాల్, అనిల్ రెడ్డి, బల్ సింగ్, సురేందర్ పాల్గొన్నారు.

# శిలాజ శాపం!

## శిలాజ ఇంధనాలపై అతిగా ఆధారపడుతున్న ఆహారవ్యవస్థలు





**అద్భుతమైన మానవశక్తిని, కృషిని కూడా తోసిరాజంటూ ఇవాళ మన ఆహార లభ్యత మరోరకమైన శక్తి మీద ఆధారపడుతోంది- అదే శిలాజ ఇంధనాలు. శిలాజ ఇంధనాలు మన జీవితంలోని ప్రతి పార్శ్వాన్ని స్పృశిస్తూనే ఉంటాయి. దైనందిన జీవితంలో మనం ఎక్కడికైనా ప్రయాణించాలన్నా, మనకు ఇష్టమైన బట్టల్ని తొడుక్కోవాలన్నా, మన ఇంట్లో లైట్లు వెలగాలన్నా, సూపర్‌మార్కెట్లలోని షెల్ఫ్‌ల్లో సరుకులు పాడుకాకుండా ఉండాలన్నా.., ఇలా ఒకటేమిటి మన జీవితం అడుగడుగునా శిలాజ ఇంధనాలతో ముడిపడే ఉంది. శిలాజ ఇంధనాలు మన ఆహారవ్యవస్థకు కీలకచోదకాలుగా ఉన్నాయి. కానీ మన ఆహారవ్యవస్థలో శిలాజ ఇంధనాల పాత్ర నానాటికీ పెరిగిపోతుండడం మాత్రం ఆందోళనకరంగా మారింది. మన పళ్ళెరంలోని ఆహారం శిలాజ ఇంధనాల లాభాలకు సరికొత్త వేదికగా శరవేగంగా మారుతోంది. ఆధునిక ఆహార వ్యవస్థలు ప్రపంచ పెట్రో కెమికల్ వినియోగంలో 40 శాతం వాటాను కలిగి ఉన్నాయని ఒక తాజా నివేదిక చెబుతోంది. 'ఇంధనం నుండి ఫోర్క్ వరకు : మన ఆహార వ్యవస్థల నుంచి శిలాజ ఇంధనాల్ని విడదీయడానికి వీలవుతుందా?' అనే శీర్షికతో గత నెల విడుదలైన ఒక అంతర్జాతీయ నివేదిక సింథటిక్ ఎరువులు, పురుగుల మందుల నుంచి ఆహారపదార్థాల ప్లాస్టిక్ ప్యాకేజింగ్, వంట, ఇంధనాలు, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వరకు ప్రపంచ ఆహార గొలుసులోని ప్రతిదశలో చమురు, సహజవాయువు, వాటి ఇతర ఉత్పన్నాలు ఎంత లోతుగా చొచ్చుకు వెళ్ళాయో వివరిస్తోంది.**

**మీరొక సూపర్‌మార్కెట్‌కు వెళ్ళారనుకోండి, అక్కడ మీరు ఏదైనా కొనాలనుకుంటే, ఆ పదార్థం మీకు ప్లాస్టిక్ ఆధారిత ప్యాకేజింగ్‌లోనే లభిస్తుంది కదా! ఈ ప్లాస్టిక్ ప్యాకేజింగ్ శిలాజ ఇంధనాలతో తయారైందే! అంతెందుకు, మీరు ఆ సూపర్‌మార్కెట్‌కు చేరుకోవడానికి ఎక్కిన ఆటో లేదా బైక్ కూడా శిలాజ ఇంధనాల సహాయంతోనే కదా నడుస్తుంది! ఆ సూపర్‌మార్కెట్‌లో ఆహారపదార్థాలు పాడవకుండా సురక్షితంగా ఉండడం వెనుక కూడా శిలాజ ఇంధనాల పాత్రే ప్రధానంగా ఉంటుంది. మన జీవితంలోని ప్రతి అంశం ఇలా శిలాజ ఇంధనాలతో ముడిపడి ఉన్న విషయం స్థూలదృష్టికి కనిపించక పోవచ్చు, కానీ ఇది నిజం! 'గ్లోబల్ అలయెన్స్ ఫర్ ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్', ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ ఆన్ సస్టయినబుల్ ఫుడ్ సిస్టమ్స్ (ఐపిఇఎస్-ఫుడ్) సంయుక్తంగా వెలువరించిన నివేదిక ప్రకారం, అన్ని పెట్రోకెమికల్స్‌లో దాదాపు మూడింట ఒకవంతు (34 శాతం) సింథటిక్ నైట్రోజన్ ఎరువులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తున్నారు. మరో ఆరుశాతాన్ని ప్లాస్టిక్ తయారీకి వినియోగిస్తున్నారు. అంటే దీని అర్థం ఆహారవ్యవస్థలు ప్రపంచ పెట్రోకెమికల్స్‌లో 40 శాతం వరకు వినియోగిస్తున్నాయి.**



**55.6 % మంది భారతీయులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేక పోతున్నారు.**

మన ఆహార వ్యవస్థలలో శిలాజ ఇంధనాలపై ఆధారపడడమన్నది 1900ల ప్రారంభంలో, అంటే 'హరిత విప్లవం' కాలం నుంచే ప్రారంభమైంది. కాగా 1980లకు వచ్చేటప్పటికి ఆహారవ్యవస్థల్లో శిలాజ ఇంధనాల వినియోగం పతాకస్థాయికి చేరుకుంది. ఈకాలంలోనే వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోక్యం చేసుకుంది. ఇది వ్యవసాయంలోకి శిలాజ ఇంధన ఆధారిత ఎరువులు, పురుగుమందులు, హైడ్రోకార్బన్-ఇంధన నీటిపారుదల వ్యవస్థల వాడకాన్ని తీసుకురావడం ద్వారా పంట దిగుబడిని ఊహాతీతంగా పెంచింది. హేబర్-బాష్ ప్రక్రియలో నత్రజని, హైడ్రోజన్ వాయువుల నుండి అమ్మోనియాను సంశ్లేషణ చేస్తుంది, ఇది నత్రజని ఎరువుల భారీ ఉత్పత్తికి దారితీస్తుంది. వాస్తవానికి 2008 నాటికే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఆహారంలో దాదాపు సగం సింథటిక్ నత్రజని ఎరువులపై ఆధారపడి ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.

మానవ ఆరోగ్యానికి, వాతావరణ సంక్షేమానికి విడదీయరాని అనుబంధం ఉంది. కానీ ఇవాళ వాతావరణ సంక్షోభం కారణం కోటానుకోట్లమంది ఆరోగ్యం ప్రమాదంలో పడింది. విషపూరిత వాయు కాలుష్యం, ఆహార భద్రత తగ్గడం, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం, తీవ్రమైన వేడి, కరువు, వరదలు వంటి విపరిమాణాల ద్వారా మానవ ఆరోగ్యం ఊహాతీతమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అభిప్రాయం ప్రకారం 2030 - 2050 మధ్య, వాతావరణ మార్పు వల్ల పోషకాహార లోపం, మలేరియా, విరేచనాలు, వేడి, ఒత్తిడి కారణంగా సంవత్సరానికి సుమారు 250,000 అదనపు మరణాలు సంభవిస్తాయి. అంతేగాక 2030 నాటికి అసహజ వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రత్యక్ష ఆరోగ్య ఖర్చులు సంవత్సరానికి రెండు నుంచి నాలుగు బిలియన్ డాలర్ల మేరకు పెరిగిపోతాయని అంచనా. అసహజ వాతావరణ మార్పు మానసిక రుగ్మతలతోపాటు అనేక సామాజిక, పర్యావరణ ప్రమాద కారకాలను కూడా తీవ్రతరం చేస్తుంది. తీవ్రమైన వాతావరణ అసమతుల్యత, స్థానభ్రంశం, కరువు, పోషకాహార లోపం వంటివి మానసిక రుగ్మతలకు దారితీస్తాయి. మరి ఈ ఉపద్రవాన్ని ఎలా ఎదుర్కోవాలి? ఈ ఉపద్రవాన్ని మరింత తీవ్రతరం చేస్తున్న సమస్య శిలాజ ఇంధనాలు. పర్యావరణ సమతౌల్యతను దెబ్బతీస్తున్న సమస్యలకు శిలాజ ఇంధనాల వినియోగం పెరగడం కూడా ఒక కాదనలేని కారణమవుతోంది. శిలాజ ఇంధనాలను దశలవారీగా తొలగించడం ద్వారా, స్థిరమైన రవాణా, ఆహారం, ప్రత్యామ్నాయ శక్తి పరిష్కారాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడం ద్వారా మానవ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ముఖ్యంగా వాయు కాలుష్యం తగ్గడం, ఆరోగ్యకరమైన ఆహారం, ఎక్కువ శారీరక శ్రమ ద్వారా అనారోగ్యాలు దూరమవుతాయి. పర్యావరణ సంక్షేమానికి సంబంధించిన పారిస్ ఒప్పందం లక్ష్యాలను చేరుకోవడం వల్ల 2050 నాటికి వాయు కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి పది లక్షల మంది ప్రాణాలను కాపాడవచ్చు. వాతావరణ సంక్షేమ చర్యల వల్ల కలిగే ఆరోగ్య లాభాల మొత్తం విలువ గ్రీన్హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి ప్రపంచదేశాలు పెడుతున్న ఖర్చుకంటే దాదాపు రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనాలు సూచిస్తున్నాయి. ఈ దిశగానే ఆహార వ్యవస్థల్లో శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది.

**'చమురు డిమాండ్ పెరుగుదలకు పెట్రోకెమికల్స్ ఏకైక అతిపెద్ద చోదకశక్తిగా ఉండడం వల్ల ప్రపంచంలోని ఇతర రంగాలు డీకార్బనైజేషన్ వైపు అడుగులు వేస్తున్నప్పటికీ, ఆహార రంగానికి సంబంధించిన వ్యవస్థలు మాత్రం దానికి విరుద్ధంగా పెట్రోకెమికల్స్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నాయి' అని ఐపిఇఎస్-ఫుడ్ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. 'గ్లోబల్ అలయన్స్ ఫర్ ది ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్' అంచనా ప్రకారం, 2023 ప్రారంభంలో ఆహార వ్యవస్థలు మొత్తం శిలాజ ఇంధన వినియోగంలో కనీసం 15 శాతం వాటాను కలిగి ఉన్నాయి, ఇది ఇప్పటికే అనేక భారీ పరిశ్రమల కంటే ఎక్కువగా ఉంది. 'ఉదాహరణకు, ఉక్కు పరిశ్రమ ప్రపంచ శక్తిలో ఎనిమిది శాతాన్ని (ప్రధానంగా బొగ్గు) వినియోగిస్తుంది, అయితే కాగితం, మైనింగ్ పరిశ్రమలు వరుసగా ఆరు శాతం, 1.7 శాతాన్ని వినియోగిస్తాయి' అని నివేదిక పేర్కొంది.**

### దశలవారీగా తొలగించడం

శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువుల ఉత్పత్తి, దహనం వాతావరణ మార్పుకు దారితీసే గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు కారణమవుతాయి. అదే సమయంలో, శిలాజ ఇంధనాలు మానవ ఆరోగ్యానికి హానికరమైన వాయు కాలుష్య కారకాలకు మూలం. ఉదాహరణకు బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు, డీజిల్ ఇంధన వాహనాల నుండి వచ్చే వాయు కాలుష్య కారకాల వల్ల శ్వాసకోశ, హృదయ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, మధుమేహం, నాడీ సంబంధిత రుగ్మతలు, గర్భధారణ సమయంలో ప్రతికూల ఫలితాలు వంటి విపరిమాణాలు చోటుచేసుకుంటాయి. బొగ్గు లేదా డీజిల్ వంటి శిలాజ ఇంధనాలను మండించడం వల్ల వెలువడే సూక్ష్మ కణపదార్థం వాయు కాలుష్యంలో అత్యంత విషపూరితమైన రకాల్లో ఒకటి అని ప్రపంచ బ్యాంకు అధ్యయనం స్పష్టం చేస్తోంది. దీని వల్ల ఉబ్బసం, క్యాన్సర్, గుండె జబ్బులు, అకాల మరణం సంభవించే అవకాశం ఉంది. శిలాజ ఇంధనాలకు దూరంగా ఉండటం వల్ల శిలాజ ఇంధనాల నుండి ఉత్పన్నమైన పరిసర కణపదార్థానికి గురికావడం వల్ల సంవత్సరానికి 1.2 మిలియన్ల మరణాలను నివారించవచ్చు. ప్రపంచ బ్యాంకు ప్రకారం, వాయు కాలుష్యానికి గురికావడం వల్ల కలిగే ఆరోగ్య నష్టాల విలువ సంవత్సరానికి 8.1 ట్రిలియన్ డాలర్లు, ఇది ప్రపంచ జిడిపిలో 6.1 శాతానికి సమానం. శిలాజ ఇంధనాలను దశలవారీగా తొలగించడం ద్వారా, పవన లేదా సౌరశక్తి వంటి పునరుత్పాదక శక్తిలో పెట్టుబడి పెట్టడం ద్వారా వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవచ్చు. ఇది గాలిని శుద్ధి చేయడానికి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడానికి అవకాశాల్ని ద్విగుణీకృతం చేస్తుంది. ఇక రవాణా రంగం విషయానికొస్తే, క్లీన్ ఎనర్జీతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలకు మారడం, డ్రైవింగ్ చేయడానికి బదులుగా నడక లేదా సైక్లింగ్‌ను ప్రోత్సహించడం వంటివి సత్ఫలితాలనిస్తాయి.



**వీక్షణం**



### వంటిల్లు కూడా..

గృహాలలో కలప, కిరోసిన్ లేదా బొగ్గు వంటి కాలుష్య కారకాలైన ఇంధనాలతో వంట చేయడం వల్ల వచ్చే పొగ వల్ల సంవత్సరానికి మూడు మిలియన్లకు పైగా అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ఇది బహిరంగ వాయు కాలుష్యంతోపాటు కార్బన్ డయాక్సైడ్, బ్లాక్ కార్బన్ వంటి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు కూడా దోహదం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రెండు బిలియన్లకు పైగా ప్రజలు ఇప్పటికీ శుభ్రమైన వంట సదుపాయాలకు అందుబాటులో లేరు.

### ఆహారాన్ని మార్చాలి

మనం తినే ఆహారం, ఆ ఆహారం ఎలా ఉత్పత్తి అవుతుందన్న అంశాలు మన ఆరోగ్యంతోపాటు, పర్యావరణ సమతుల్యతను కూడా ప్రభావితం చేస్తాయి. ఆహారాన్ని పండించడం, ప్రాసెస్ చేయడం, రవాణా చేయడం, పంపిణీ చేయడం, తయారు చేయడం, వినియోగించడం, కొన్నిసార్లు పారవేయడం అవసరం. ఈ దశల్లో ప్రతి ఒక్కటి సూర్యుని వేడిని బంధించి వాతావరణ మార్పులకు దోహదపడే గ్రీన్‌హౌస్ వాయువులను సృష్టిస్తాయి. మానవుని వల్ల కలిగే గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో దాదాపు మూడింట ఒక వంతు ఆహారంతో ముడిపడి ఉన్నాయి. రెడ్‌మీట్ (మాంసాహారంలో ఒకరకం), పాల ఉత్పత్తులు, రొయ్యల పెంపకం వంటివి భూమిపై ఎక్కువగా వినియోగించే జంతు ఉత్పత్తులు. వీటి వినియోగం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యమే ఆహార సంబంధిత ఉద్గారాలలో అతిపెద్దది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, బీన్స్, బఠానీలు, గింజలు, కాయధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాల ఉత్పత్తిలో సాధారణంగా శక్తి, భూమి, నీరు తక్కువ మోతాదులోనే ఖర్చవుతాయి.

**- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)**

# ఎందుకు హానికరం?

**కిటికీ**

బొగ్గు , చమురు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాలు చాలా కాలంగా మానవ నాగరికతకు ప్రాథమిక శక్తి వనరుగా ఉన్నాయి. అయితే, ఆధునిక మానవజీవితం వీటిపై అతిగా ఆధారపడడం వల్ల, అవి పర్యావరణంపై, మానవ ఆరోగ్యంపై గణనీయమైన ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావాల గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**వాతావరణంలో అసహజ మార్పులు:** శిలాజ ఇంధనాలను మండించడం వల్ల వాతావరణంలోకి పెద్ద మొత్తంలో కాలుష్యకారక గ్రీన్‌హౌస్ వాయువులు, ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్ (సిఒ2) విడుదలవుతాయి. ఈ వాయువులు వేడిని బంధించి గ్రీన్‌హౌస్ ప్రభావానికి దోహదం చేస్తాయి, దీనివల్ల భౌగోళికతాపం పెరగడం, అసహజ వాతావరణ మార్పులు, సగటు ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల, సముద్ర మట్టాలు పెరగడం వంటి అనేక హానికరమైన ప్రభావాలు చోటుచేసుకుంటాయి. జీవవైవిధ్యానికి కూడా ఇది తీవ్రహానిని తలపెడుతుంది.

**వాయు కాలుష్యం:** శిలాజ ఇంధనాల దహనం వల్ల సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, కణిక పదార్థాలు, అస్థిర సేంద్రియ సమ్మేళనాల వంటి కాలుష్య కారకాలు మనమందరం శ్వాసించే గాలిలోకి విడుదలవుతాయి. ఈ కాలుష్య కారకాలు వాయు కాలుష్యానికి, పొగమంచు ఏర్పడడానికి, గాలి నాణ్యత విస్తృతంగా క్షీణించడానికి దోహదం చేస్తాయి. అవి మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను చూపుతాయి, దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు, హృదయ సంబంధ సమస్యలు, ఇతర ప్రాణాంతక వ్యాధులు పెరుగుతాయి.

**నీటి కాలుష్యం:** శిలాజ ఇంధనాల వెలికితీత, శుద్ధి, రవాణా కూడా నీటి కాలుష్యానికి దారితీస్తుంది. ఉదాహరణకు చమురు సముద్ర, నదీజలాల్లోకి చిమ్మడం, కలవడం (ఆయిల్ స్పిల్) వంటివి జల పర్యావరణ వ్యవస్థలపై దుష్ప్రభావాన్ని చూపి, వినాశకరమైన పరిణామాలకు దారితీస్తుంది. సముద్ర జీవులను చంపుతుంది, పర్యావరణ వ్యవస్థలకు దీర్ఘకాలిక నష్టాన్ని కలిగిస్తుంది. అదనంగా, ఫ్రాకింగ్ కార్యకలాపాల నుండి వచ్చే మురుగునీటిని పారవేయడం తరచుగా భూగర్భ జలాలను, తాగునీటి వనరులను కలుషితం చేస్తుంది.

**వనరుల క్షీణత:** శిలాజ ఇంధనాలు పరిమిత వనరులు, ఇవి ఏర్పడడానికి కోటానుకోట్ల సంవత్సరాలు పట్టింది. ఈ వనరులను నిరంతరం వెలికితీసి వినియోగించడం వల్ల భూమిలోని శిలాజ ఇంధన నిల్వలు క్షీణిస్తాయి. ఈ నిల్వలు తగ్గుతున్న కొద్దీ, వెలికితీత ఖర్చు, కష్టం పెరుగుతుంది, ఇది మరింత విస్తృతమైన చొరబాటు, వెలికితీత పద్ధతుల వైపు మొగ్గు చూపడానికి, తద్వారా పర్యావరణ నష్టానికి దారితీస్తుంది.

**ఆరోగ్య ప్రభావాలు:** శిలాజ ఇంధనాల వాడకం, ముఖ్యంగా పారిశ్రామిక ప్రదేశాలు, అధిక కాలుష్య స్థాయిలు ఉన్న ప్రాంతాలలో అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ముడిపడి ఉంటుంది. శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా విడుదలయ్యే వాయు కాలుష్య కారకాలకు గురికావడం శ్వాసకోశ సమస్యలకు, హృదయ సంబంధ వ్యాధులకు, ఉబ్బసం వంటి వ్యాధులతోపాటు అకాల మరణాలకు కూడా దారితీస్తుంది. పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తిలేని వారి ఆరోగ్యం దుష్ప్రభావాలకు గురవుతుంది.

**పర్యావరణ విధ్వంసం:** శిలాజ ఇంధనాల వెలికితీత, రవాణా వంటి ప్రక్రియల్లో తరచుగా పర్వత శిఖర తొలగింపు మైనింగ్, స్ట్రిప్ మైనింగ్, అటవీ నిర్మూలన వంటి విధ్వంసక పద్ధతులు ఉంటాయి. ఈ కార్యకలాపాల ఫలితంగా జనావాస ప్రాంతాల నాశనం, నేలకోత, జీవవైవిధ్యం కోల్పోవడం, పర్యావరణ వ్యవస్థలకు అంతరాయం కలగడం వంటి విషపరిణామాలతోపాటు వన్యప్రాణులు, వృక్ష జాతుల మనుగడకు హాని కలుగుతుంది.

ఈ సమస్యలను పరిష్కరించే దిశగా పునరుత్పాదక ఇంధన వనరుల వంటి పరిశుభ్రమైన, మరింత స్థిరమైన ప్రత్యామ్నాయాల అన్వేషణ, వినియోగం వంటి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. సౌరశక్తి, గాలి, జల విద్యుత్‌ల రూపేణా అసహజ వాతావరణ మార్పుల్ని నివారించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, మానవ ఆరోగ్యాన్ని కాపాడడానికి అవసరమైన చర్యల దిశగా ప్రభుత్వాలు, ప్రజలు దృష్టి సారించాల్సి ఉంది.



**- కల్కి**

**ఎస్ఒఎఫ్ఐ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో దాదాపు 8.2% మంది గత సంవత్సరం ఆకలి బారిన పడ్డారు. 2015తో పోలిస్తే ఈ రోజు 96 మిలియన్ల మంది దీర్ఘకాలిక ఆకలితో బాధపడుతున్నారు.**

# మనదేశంలో...

ఐక్యరాజ్యసమితి జూలై 24, 2024న ప్రచురించిన 'స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్' (ఎస్ఒఎఫ్ఐ) నివేదిక ప్రకారం, భారతదేశ మొత్తం జనాభాలో సగానికి పైగా (55.6 శాతం) ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోతున్నారు. ఈ నిష్పత్తి నిరంతరం తగ్గుముఖం పడుతుండగా (2020లో కోవిడ్-19 మహమ్మారిలో చిక్కుకున్నప్పుడు తప్ప), ఇది ఇప్పటికీ అన్ని దక్షిణాసియా దేశాల సగటు అంటే 53.1 శాతం కంటే ఎక్కువగా ఉంది. 'ఆరోగ్యకరమైన ఆహారం' పేరిట ఐక్యరాజ్యసమితికి చెందిన ఐదు అనుబంధ సంస్థలు ప్రచురించిన నివేదిక ఆహారానికి సంబంధించి నాలుగు కీలకాంశాల్ని పేర్కొంది. ఆహార వైవిధ్యం, తగినంత ఆహారం(అవసరాలతో పోలిస్తే అన్ని ముఖ్యమైన పోషకాల సమృద్ధి), ఆహార నియంత్రణ (ఆరోగ్య ఫలితాలకు సంబంధించిన ఆహారాలు, పోషకాలు), ఆహార సమతుల్యత (శక్తిమంతమైన స్థూల పోషకాల్ని తీసుకోవడం) అనే నాలుగు అంశాల్ని ఆ నివేదిక చర్చించింది. భారతదేశంలో ఆహార భద్రత, పోషకాహారంపై ప్రభుత్వ వ్యయం ఇలా ఉంది - ఈ వ్యయంలో 83 శాతం ఆహార వినియోగం కోసం (ఇందులో ఆహార లభ్యత, ప్రాప్యతతో సహా) కేటాయించారు. ఆహార అభద్రత, పోషకాహార లోపానికి ప్రధాన కారకాల నివారణ కోసం కేవలం 15 శాతం మాత్రమే కేటాయించారు.

గ్లోబల్ ఫుడ్ పాలసీ రిపోర్ట్ 2024: ఫుడ్ సిస్టమ్స్ ఫర్ హెల్తీ డైట్స్ అండ్ న్యూట్రిషన్ ప్రకారం, భారత జనాభాలో 2024లో కనీసం 38 శాతం మంది అనారోగ్యకరమైన ఆహారాన్ని తిన్నారని, ఐదు సిఫార్సు చేసిన ఐదు ఆహార సమూహాలను కేవలం 28 శాతం మంది మాత్రమే తిన్నారని తేలింది. వీటిలో కనీసం పిండి పదార్థం కలిగిన ఒక ప్రధాన ఆహారం, ఒక కూరగాయ, ఒక పండు, ఒక పప్పు, గింజ లేదా



విత్తనంతోపాటు ఒక జంతు ఆధారిత ఆహారం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 35.4 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేక పోతున్నారు.

### భారతీయుల్లో పోషకాహార లోపం

'పోషకాహార లోపం' అంటే 'ఆహార, వ్యవసాయ సంస్థ' లేదా ఎఫ్ఎఒ నిర్వచనం ప్రకారం, 'ఒక వ్యక్తి ఒక సంవత్సరం పాటు రోజువారీ కనీసశక్తికి అవసరమైన తగినంత ఆహారాన్ని పొందలేక పోవడం'. భారతదేశంలో 2021-2023 మధ్య 194.6 మిలియన్ల మంది పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. ఇది మొత్తం జనాభాలో 13.7 శాతం.

**- కావేరి**

# 2030 లో ఎంత మంది?

ఎస్ఒఎఫ్ఐ నివేదికలోని ప్రస్తుత అంచనాల ప్రకారం, 2030 నాటికి 512 మిలియన్ల మంది లేదా ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది దీర్ఘకాలిక పోషకాహార లోపంతో బాధపడవచ్చు, ఇది ఆకలి రహిత ప్రపంచ లక్ష్యాన్ని సాధించడంలో ఉన్న సవాలు తీవ్రతను స్పష్టం చేస్తోంది. 2030 నాటికి పోషకాహార లోపం ఉన్నవారి సంఖ్య 65 మిలియన్లు మాత్రమే తగ్గుతుందని విశ్లేషణలో తేలింది.

'రాబోయే ఐదు సంవత్సరాలలో అన్ని ప్రాంతాలలో మెరుగుదలలు ఆశించినప్పటికీ, గణనీయమైన తేడాలు మిగిలి ఉన్నాయి. 2030 నాటికి ప్రపంచంలోని పోషకాహార లోపం ఉన్న వారిలో 60 శాతం మంది ఆఫ్రికాలో ఉంటారు, అక్కడ జనాభాలో 17.6 శాతం మంది దీర్ఘకాలిక ఆకలిని ఎదుర్కొంటున్నారు. ఆసియాలో, అలాగే లాటిన్ అమెరికా, కరేబియన్లలో, పోషకాహార లోపం ప్రాబల్యం ఐదు శాతం కంటే తక్కువగా ఉంటుంది' అని నివేదిక పేర్కొంది.

ఎస్ఒఎఫ్ఐ నివేదిక అనేది యుఎన్ సంస్థలు - ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ), ఐఎఫ్ఎడి (ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్),యూనిసెఫ్, డబ్ల్యుఎఫ్‌పి (వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్), డబ్ల్యుహెచ్ఒ (వరల్ హెల్త్ ఆర్గనైజేషన్) తయారుచేసిన వార్షిక నివేదిక. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆకలి, ఆహార భద్రత, పోషకాహారంపై తాజా వివరాలను, విశ్లేషణను అందిస్తుంది.

**- అభిరామి**

# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీటేది?



**సూర్యాపేట, ఆగస్టు 03 (మనం ప్రతినిధి):** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో జరిగిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహించి మండల కేంద్రాలలో ఆందోళన, పోరాటాలునిర్వహిస్తామన్నారు.జిల్లాలో అనేక సమస్యలు దశాబ్దాలుగా ఉన్నాయని వాటిని పాలకులు పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల మూలంగా ప్రజలుటైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ప్రతి ఇంట్లోఒకరు జ్వరంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విష జ్వరాలు, అంటూ వ్యాధుల బారి నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించడంలో వైద్య, ఆరోగ్యశాఖ మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. అంటూ వ్యాధులు,విష జ్వరాలు ప్రబలకుండా ఉన్నందుకు అన్ని గ్రామ, పట్టణాలలో పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేసి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. పి.హెచ్.సి సెంటర్లలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. అన్ని వార్డులలోవైద్య, ఆరోగ్య సిబ్బందిని పంపించి సంచారా వైద్య బృందాల ద్వారా ప్రజలందరికీ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కో లిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టి పెళ్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి ఆర్థిక సాయం

### రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరం: గార్లపాటి శివారెడ్డి



**పెన్ పహాడ్ ఆగస్ట్ 03 (మనం న్యూస్):** జగదేవపూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన మరో రైతు బునారి నరేందర్ అప్పుల పాలై ఇటీవల ఉరి వేసుకుని హాత్మహత్య చేసుకొని మృతి చెందగా అతనికి కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు కాగా మరో మారు మానవత్వాన్ని చాటుకున్న సూర్యాపేట జిల్లా పెన్ ఫహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి కుమారుడు గార్లపాటి శివారెడ్డి తిగుల్ గ్రామానికి విచ్చేసి స్థానిక పిఎసిఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్యతో కలిసి ఆదివారం మృతుని కుటుంబ సభ్యులను పపరామర్శించి కుమార్తె పేరున రూ. 20000వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రైతులు ఆత్మహత్యకు పాల్పడడం ఎంతో బాధాకరమని ఇలాంటి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఐలయ్య, యూత్ నాయకులు మహేందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మనోజ్, నిఖిల్ రెడ్డి, లోకేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ పోతురాజు విగ్రహాల ప్రతిష్ట



**చింతలపాలెం, ఆగస్టు 3 (మనం న్యూస్):** మండల పరిధిలో దొండపాడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆదివారం దొండపాడు మాలపల్లి కాలనీలో గోపిరెడ్డి పుల్లారెడ్డి మంగమ్మ దంపతులు, రేలా చిన్న వెంకటరెడ్డి దంపతులు నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ దేవాలయంలో విగ్రహ పుణఃప్రతిష్ట సందర్భంగా గణపతి పూజ, జల బిందలు, బలి ఆహారం, ప్రతిష్ట యజ్ఞ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రేపు జరిగే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. దైవచింతలతో మానసిక ప్రశాంత లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాడు గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం




**సూర్యాపేట ఆగస్టు 03 (మనం ప్రతినిధి):** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారని చండూరు ఆర్డీఓ వందనపు శ్రీదేవి అన్నారు.ఆదివారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో యోగాసన సెలక్షన్స్ నిర్వహించారు ఇందులో భాగంగా పది సంవత్సరాలనుండి యాభై అయిదు సంవత్సరాల వయస్సు మధ్య వివిధ విభాగాలలో యోగాసన పోటీలు

**విజయవంతంగా నిర్వహించారు.**

తొమ్మిది విభాగాలలో ప్రథమంగా నిలిచిన తొమ్మిది మంది నీ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక కావడం జరిగింది ఆరోగ్యమే మహా భాగ్యమని, అందుకు ప్రతి ఒక్కరికి యోగ నేర్చుకోవాలని, ఆరోగ్యం బాగుంటేనే కుటుంబం,సమాజం, దేశం బాగుంటాయని వందనపు శ్రీదేవి అన్నారు. ప్రపంచ ఆరోగ్యం కోసం మన ప్రధాని యోగాను ప్రపంచంలోని సుమారు నూటా ఏనబై నాలుగు దేశాలకు అందించారని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి అన్నారు.జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి, పాల్గొన్నవారికి సూర్యాపేట మండలవిద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ.... జిల్లాలోని ఔత్సాహికులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు యోగ శిక్షనను ఇచ్చి ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అఖిల భారత స్థాయిలో మెడల్స్ పొంది మన సూర్యాపేట జిల్లాకు మంచిపేరు తేవాలని యోగసాదకులను కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు మాటాడుతూ సూర్యాపేట కు యోగ సాధనలో మెడల్స్ సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాము అన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరుగబోయే పోటీలలో గెలుపొందిన వారు పాల్గొని సూర్యాపేట కు మంచిపేరు తెస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు.ప్రథమ స్థానం పొందిన యోగ సాదకులు ఉగ్గం సమాన్విత, కీత శ్రీకార్తీకేయవర్మ, జి.వైష్ణవి, తోకల మహేశ్వరి, గరు డాచలం బానుప్రసాద్, సంగబోయిన బిందు, దేశగాని ఉప్పలయ్య, గూడూరు నాగేశ్వర్ రావు, కీత శ్రీనివాస్ రావు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో పి. డి. అయితగోని శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శులు జుట్టుకొండ నవీన్,రవిరాల చంద్రశేఖర్, బానుప్రకాష్, రంగారావు, ఉప్పలయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

# వైశ్య రాజకీయ రణభేరి సభకు తరలి వెళ్లిన ఆర్యవైశ్యులు



**తుంగతుర్తి, ఆగస్టు 3 ( మనం న్యూస్ ):** హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగిన ఆర్య వైశ్య రాజకీయ రణ భేరి సభకు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఈగ నాగన్న ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఆదివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ సీతయ్య బస్సుకు జెండా ఊపి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాకు మా జనాభా దామాషా ప్రకారంగా అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు విద్య, ఉద్యోగం, సంక్షేమ పథకాలు వర్తించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలని, వైశ్య బంధు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఈగ లక్షయ్య, బండారు దయాకర్, గోపారపు సత్య నారాయణ, ఓరుగంటి అశోక్, తల్లాడ కేదారి, ఓరుగంటి శ్రీనివాస్, గుమ్మడివెల్లి సోమయ్య, గుండా శ్రీనివాస్, అమంచి సోమన్న, ఈగ సోమయ్య, చెర్వీరాల మల్లయ్య,మాశెట్టి వెంకన్న తో పాటు అన్ని గ్రామాల వైశ్యులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ పరీక్ష

- 215 మంది అభ్యర్థులు హాజరు
- జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు





**సూర్యాపేట ఆగస్టు 03 (మనం ప్రతినిధి):** నీట్ పిజి పరీక్ష సందర్భంగా జిల్లాలో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. ఆదివారం ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీ నందు జరుగుతున్న నీట్ పిజి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ నందు 179 అభ్యర్థులకు గాను 171 మంది హాజరైనారని 08 మంది గైర్హాజరు అయినారని అలాగే కోదాడ సన ఇంజనీరింగ్ కాలేజీ నందు 50 మందికి గాను 44 హాజరైనారని, 6మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జయలత, తహసీల్దార్ కృష్ణయ్య,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**సూర్యాపేట, ఆగస్టు 03 (మనం ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని మోరిశెట్టి అంతయ్య మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల 2005 -6 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సరదాగా ఆనందంగా గడిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో 19సంవత్సరాల తరువాత స్నేహితులు.ఒక చోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ప్రస్తుత స్థితి గతులు తెలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద విద్య బుద్ధులు నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థితిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు..ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు వై వెంకటేశ్వర్లు, రమణాచారి, ఎం సోమయ్య, వి మంగయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలి

- గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో భాగం
- ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి
- ముస్తాబు తో ఆకర్షణగా నిలుస్తున్న ఎడ్ల బండి....
- పభ బండి ప్రారంభించి నాయకులు లక్ష్మీ నారాయణ రెడ్డి, వంగవీటి రామారావు.
- పాడిపంటలకు, ఆయురారోగ్యాలకు గ్రామదేవతల ఆశీస్సులే



**కోదాడ, ఆగస్టు 03(మనం న్యూస్):** గ్రామ దేవతలను ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. ఆదివారం ముత్యాలమ్మ పండుగ సందర్భంగా గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టేలా ఎడ్ల బండి ప్రభను ముస్తాబు చేసి భారీ ఊరేగింపుతో ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఆయన మాట్లాడుతూ ముత్యాలమ్మ తల్లి దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నారు. గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, పాడి పంటలపై గ్రామదేవతల ఆశీస్సులు ఉండాలన్నారు. ప్రజలు సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. పట్టణ ప్రజలకు ముత్యాలమ్మ తల్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్ల బండి ప్రభ ముస్తాబుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎడ్ల బండి భారీ ప్రదర్శనతో పట్టణంలో గత సంస్కృతి సంప్రదాయాలు కనిపించాయి. ప్రజలంతా ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. కాగా తొలుత ఎర్నేని ఇంటి వద్ద ప్రభ బండినీ టీపీసీసీ డెలిగేట్ సీహెచ్ లక్ష్మీ నారాయణ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు లు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రావేల కృష్ణారావు, వంటిపులి వెంకటేష్, వంటిపులి శ్రీను, లైటింగ్ ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**జగిత్యాల ఆగస్టు 03 ( మనం ప్రతినిధి):** జిల్లాకు చెందిన ఎనమిది మంది లబ్బిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 1,60,000/- రూపాయలు విలువగల చెక్కులను ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ,మాజీ పాక్స్ ఛైర్మన్ సాగి సత్యం రావు, వొళ్ళేం మల్లేశం, అల్లాల ఆనంద్ రావు,వొళ్ళాల గంగాధర్, దయ్యాల మల్లారెడ్డి, కోరుకంటి రాము, కుడిక్యాల సర్వేశ్వర్ ,తేలు రాజు,ఆరవెల్లి లక్మన్,గంగిపెల్లి వేణుమాధవ్, తుమ్మ గంగాధర్,గంగిపెల్లి శేకర్,నీలి ప్రతాప్,గంగిపెల్లి పవన్ కుమార్,గాజుల శ్రీనివాస్, అజ్జర్, చెట్టే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




**చిలుకూరు, ఆగస్టు 3 (మనం న్యూస్):** మండల కేంద్రంలో మత్తుపదార్థాలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మత్తు బారినబడి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నా యువతకు సందేశాలతో కనువిప్పు కలిగిస్తూ మత్తు రహిత సమాజ స్థాపన కోసం తన వంతు కృషి చేస్తున్న సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాచకొండ ప్రభాకర్ జాతర లు ఉత్సవాలు మరియు రద్దీగా ఉన్న ప్రాంతాలలో సెలవు రోజులలో ఖాళీ సమయాలలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు మధ్యపానం ధూమపానం ఆరోగ్యానికి హానికరం నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచుతూ చేతిలో మైక్ పట్టుకుని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, వీరబాబు , మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం

- మోడీ ప్రభుత్వ అభివృద్ధి, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి...
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకు వెళ్ళాలి...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**హుజురాబాద్, ఆగస్టు 3 (మనం న్యూస్):**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల మూడు నాలుగు తేదీన కరీంనగర్ జిల్లాలో తలపెట్టిన ఇంటింటికి ఘర్ ఘర్ బిజెపి (బిజెపి- ప్రతి ఇంటికి) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వీణవంక మండలం బేతిగల్ లో బిజెపి మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘర్ ఘర్ బిజెపి ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూనే... మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 3, 4, తేదీలలో తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటికి బిజెపి- ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమం చేపట్టాలని రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చిందని తెలిపారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో సాధించిన ప్రగతిని, చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే 'ఘర్ ఘర్ బిజెపి' ముఖ్య ఉద్దేశమన్నారు. బిజెపి ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ విస్తృత కార్యక్రమమని , ఇది కేవలం ఓ ప్రచార కార్యక్రమం కాదని , . స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడానికి, బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు పార్టీని సంసిద్ధం చేయడానికి చేపట్టిన కార్యాచరణ అని చెప్పారు. ఈ ప్రోగ్రాం ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్ళబోతున్నారని తెలిపారు. ప్రతి బూత్ కమిటీ అధ్యక్షుడు కనీసం 100 ఇండ్లను సందర్శించి, ప్రధాని మోదీ సందేశం అందించాలనన్నారు. మోదీ మిమ్మల్ని ఆశీర్వదించమని పంపారు అనే భావనతో ప్రచారం చేపట్టాలని సూచించారు. మద్దతు తెలిపేందుకు 92400 15366 అనే మిస్డ్ కాల్ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇది కేవలం ఓ ప్రచారం కాదని ప్రస్తుత కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాల అవినీతి పాలనను ప్రజల్లో బహిర్గతం చేసేలా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను మేల్కొల్పేలా.. ప్రజల నుంచి ఆ పార్టీలపై ధిక్కారం వెల్లువెత్తేలా చేసే ఉద్యమం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందో.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తోందని ఈ వివరాలన్నింటినీ ప్రజలకు తెలియజేస్తామన్నారు. 'తెలంగాణలో మార్పు రాలే... బతుకులు మారలే... అనే నినాదంతో ప్రజల మధ్యలోకి వెళుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో, ప్రతి కుటుంబంలో ఓ గోస ఉందని, నిధుల్లేక చాలామంది తాజా మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నారని , కౌలు రైతుల బాధ వర్ణనాతీతం అన్నారు. బీసీలకు సంబంధించి - 42 శాతం రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలనీ, ముస్లింలను కలిపి బీసీలకు ద్రోహం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను , పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా భారతీయ జనతా పార్టీ - నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామాలలో ఎలాంటి వివక్షత లేకుండా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు వివరిస్తారని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాల నుంచి మొదలుకొని, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్ల విస్తరణ వరకు అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయి. అంత్యోదయ లక్ష్యంగా, రేషన్ కార్డుల ద్వారా ప్రతి కుటుంబానికి బియ్యం అందిస్తున్నారు. తాజాగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేసి రైతు కుటుంబాలను ఆదుకుంటుంది మోడీ ప్రభుత్వమేనన్నారు.గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం అనే నినాదంతో ప్రతి గ్రామాన్ని చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహారాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కుల సంపత్ రాజు, కిషన్ ప్రధాన కార్యదర్శి మాడుగురి సమ్మిరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సిలువేరు గణపతి, రామిడి ఆదిరెడ్డి, ఆరిచర్ల రాజు, దాసరి భాస్కర్, ముత్యాల రవీందర్ మడికొండ వెంకన్న ఉడుత కుమార్, పెద్ది మల్లారెడ్డి, కొండల్ రెడ్డి, దేవాలు రెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

# పాకాల కింద ముందస్తు సాగన్నారు..!

- నీటిని అందివ్వలేక ముఖం చాటేసిన కాంగ్రెస్ నాయకులు
- పంట కాలువలను పరిశీలించిన బీఆర్ఎస్ మండల నాయకులు



**ఖానాపురం ,ఆగస్టు 3(మనం న్యూస్ ) :** పాఖాల ఆయకట్టు కింద ఖరీఫ్ ముందస్తు సాగు అని హడావుడి చేసి మురిపించిన అధికార పార్టీ నాయకులు సాగు నీటిని అందించడంలో విఫలమై ముఖం చాటేశారని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు నర్సంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ బీఆర్ ఎస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ సదర్ లాల్ అన్నారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు ప్రధాన ఆయకట్టు తుంగబంధం కాలువ చివరి పారకం గ్రామాలైన రాగంపేట, కొత్తూరు, రంగాపురం రైతుల పొలాలకు నీరు అందక ఎండిపోతున్నా నారుమల్లను, నెర్రబట్టిన దుక్కు మళ్లను స్థానిక రైతులతో కలిసి పరిశీలించిన బిఆర్ఎస్ మండల నాయకులు అదివారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు సాగు అని హడావుడి చేసిన ఎమ్మెల్యే అడ్రస్ లేకుండా పోయిండు.సాగునీరు అందక రైతులు ఆరిగోస పడుతుండ్రు. రైతుల పంట పొలాలకు నీళ్లు ఇచ్చే నాధుడు లేకుండా పోయారని విమర్శించారు. ఖానాపురం మండలంలో తలాపున నిండుకుండలా పాకాల సరస్సు ఉన్న ప్రధాన ఆయకట్టు కాలువైన తుంగబంధం, సంగెం, జాలుబంధం కాలువల ద్వారా సాగునీటిని అందించే నాథుడే లేక కాలువల కింద నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తలాపున చెరువు పెట్టుకుని చేప నీటి కోసం ఏడ్చిన చందంగా పాకాల సరస్సులో 25 ఫీట్ల 6 ఇంచుల నీరు ఉన్న కాలువల్లో నీరు పారించలేని చేతగానితనంలో ప్రభుత్వం, అధికారులు ఉన్నారని ఆరోపించారు. పంట కాలువలు గుర్రపు డెక్కతో పూడుకు పోయాయని ,చివరి ఆయకట్టుకు చుక్క నీరు రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.

**వేసవి రెండవ పంటకు అనుకూలంగా ఖరీఫ్ పంట**

ముందస్తు సాగు చేయాలంటూ అధికార పార్టీ నాయకులు ఆర్భాటాలు, ప్రగడ్బాలతో జూలై 02 న సాగు నీటిని నర్సంపేట అధికార పార్టీ ఎమ్మెల్యేతో విడుదల చేస్తే నేటికీ సరిగ్గా నెల మీద నాలుగు రోజులైనా కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు పారలేదంటే ప్రభుత్వ పనితీరు ఏలా ఉందో తెలుస్తోందని విమర్శించారు. ముందస్తు సాగు అని నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే అడ్రస్ లేకుండా పోయిండని.. కాంట్రాక్టు పనుల కోసం ఎదురుచూసే స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను పట్టించుకునే పరిస్థితిల్లో లేరని చివరికి రైతులు ఆదిలోనే ముంచే దాఖలాలు స్పష్టంగా కనబడుతున్నాయని అన్నారు. ప్రభుత్వంపై స్థానిక ఎమ్మెల్యే పై అధికారులపై స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులపై నమ్మకం లేక మండలంలోని రైతులందరూ వానల కోసం ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఆనాడు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి కఠోర దీక్షతో 336 కోట్లతో పాకాల సరస్సుకు గోదావరి జలాలు తీసుకవచ్చి పాకాల సరస్సులో పోయిస్తే.. దాన్ని మెయింటెనెన్స్ చేసి నీళ్ళందించలేని చేతగానితనంలో అధికార పార్టీ నాయకులు ఉండడం సిగ్గుచేటు అని విమర్శించారు.అధికార పార్టీ నాయకులకు కాలువలపై అవగాహన ఏ మాత్రం లేదని.. అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సొంటి లక్ష్మణ్ పార్టీ నాయకులు జాటోత్ బాలు నాయక్ , పిన్నింటి తిరుపతిరెడ్డి గ్రామ పార్టీ అధ్యక్షులు జాటోత్ రమేష్ , బందారపు శ్రీనివాస్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరే రాము పార్టీ నాయకులు ముద్దంగుల సంపత్, జాటోత్ భద్రు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## మిత్రుల కలయిక తోనే ప్రశాంతత

- ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్
- చిన్న నాటి మిత్రుల తో ఉల్లాసంగా గడిపిన ఎం ఎల్ ఎ సంజయ్ కుమార్



**జగిత్యాల ఆగస్టు 03 (మనం న్యూస్):** జగిత్యాల పట్టణం లో ఎమ్మెల్యే క్వార్టర్ లోజగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ను చిన్ననాటి స్నేహితులు కలిసి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్ మిత్రులతో కేక్ కట్ చేసి మిత్రులతో ఉల్లాసంగా గడిపారు. స్నేహితులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి స్వీట్ తినిపించారు.ప్రతి వ్యక్తి విజయంలో మిత్రుల సహకారం గొప్పదని అన్నారు ఎమ్మెల్యే.

## ప్రభుత్వ ప్లీడర్ బొట్ల సుధాకర్‌ను సన్మానించిన జర్నలిస్టులు



**రేగొండ, ఆగస్టు 3 (మనం న్యూస్ ) :** ఇటీవల భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లిడర్ గా నియమితులైన మండల కేంద్రానికి చెందిన బొట్ల సుధాకర్ ను రేగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పట్టెం కోటిలింగం ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ప్రభుత్వ ప్లిడర్ బొట్ల సుధాకర్ కు జర్నలిస్టులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ చిన్ననాటి నుండి ఎంతో క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి బొట్ల సుధాకర్ జిల్లాస్థాయి పదవి చేపట్టారని అన్నారు. పేదరికంలో పుట్టినప్పటికీ చదువులో వెనుకడుగు వేయకుండా డాక్టరేట్ పట్టా తీసుకొని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడని అన్నారు. యువత ప్రభుత్వ ప్లిడర్ ను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బండి సోమయ్య గౌడ్, అంబాల రవీందర్, బండి సమ్మన్న గౌడ్, రొంటాల శంకర్, నామాల రమేష్, బత్తుల వెంకన్న, సుంకరి శ్రీధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీల అస్తిత్వం కోసమే ఊరూర జెండా ఆవిష్కరణ

- కటకం నర్సింగరావు



**జనగామ ఆగస్టు 3(మనం న్యూస్):** బి.సి. ల రాజ్యాధికారమే లక్ష్యంగా ఆవిర్భవించి ఆ దిశలో ముందుకు సాగుతున్న మన ఆలోచన సాధన సమితి ఆధ్వర్యంలో బి సి ల చైతన్యం లక్ష్యంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టినట్లు మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగరావు అన్నారు. ఆగస్టు 3 ఆదివారం రోజున ఉద్యమాల గడ్డ జనగామ జిల్లా కేంద్రం చౌరస్తా లో ఆయన సాధన సమితి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి సి సంఘాల సమన్వయ వేదిక సమన్వయకర్త కన్న పరశురాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ మా వాటా మాకే, మన ఓటు మనకే నినాదం గ్రామాల్లో వ్యాప్తి జరగాలని అపుడే రాజ్యాధికార సాధన సాధ్యం అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 350 ప్రదేశాల్లో ఈ రోజు జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టినట్లు ఆ కార్యక్రమం తాను జనగామలో ప్రారంభించే అవకాశం కల్పించిన ఈ ప్రాంత నాయకులను ఆయన అభినందించారు. జనగామ గ్రామీన ప్రాంతాల్లో సాధన సమితి జిల్లా కన్వీనర్లు గునిగంటి రామకృష్ణ, పన్నీర్ సత్యం సారధ్యంలో ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు మన ఆలోచన సమితి లక్ష్య సాధన గురించి ప్రచారం చేసే ఈ కార్యక్రమంలో కులాలకతీతంగా బి. సి. నాయకులు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి. క్రిష్ణ, బొమ్మగాని అనిల్ గౌడ్, బైరు బాబు, చంద్రయ్య , సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన పాలకుర్తి ఆలయ చైర్మన్



**రాయపర్తి, ఆగస్టు 3(మనం న్యూస్ ):** మండలంలోని జయరామ్ తండ గ్రామానికి చెందిన లౌడియ బద్రు కుమారుడు వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ టిఎం కృష్ణమాచార్యులు బాధితుడు స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో తోట సుదర్శన్,జక్కుల సారంగం,గజ్జి వెంకటయ్య,గజ్జి చిన్న వెంకన్న,గ్రామ పార్టీ అధ్యక్షులు లౌడ్యా అనిల్,లౌడ్యా శ్రీనివాస్,లౌడ్యా జేతురాం, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు పెంచుతున్ననిందితుడు అరెస్ట్

### 241 గ్రాములు గల 4 గంజాయి మొక్కలు స్వాధీనం

**జగిత్యాల ఆగస్టు 03(, మనం ప్రతినిధి):** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సింగాపూర్ గ్రామంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారని అందిన సమాచారం మేరకు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో నిందితుడు మొతుకు రాజు (వయస్సు: 24 సంవత్సరాలు) 4 గంజాయి మొక్కలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొక్కల బరువు సుమారు 241 గ్రాములు ఉంటుంది.నిందితుడిని అదుపులోకి తీసుకొని రూరల్ పోలీస్ స్టేషన్కు అప్పగించి, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.**ఈ సందర్భంగా సిసిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.....** జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని రకాల అక్రమ కార్యకలాపాలపై కఠినంగా చర్యలు తీసుకుంటూ, నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. మత్తుపదార్థాల వ్యసనాన్ని నివారించేందుకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గంజాయి సాగు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారి సమాచారం అందించాల్సిందిగా ప్రజలను కోరారు.

## పేదలకు అండగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

### బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



**రాయపర్తి, ఆగస్టు 3 (మనం న్యూస్ ):** మండలంలోని ఎర్రకుంట తండా, తేట్టకుంట తండా, తిరుమలయపల్లి, బురాన్ పల్లి, బోజ తండా, పలు గ్రామాలలో ఆదివారం తండా బాట కార్యక్రమంలో భాగంగా భూక్య యాకమ్మ, బానోతు నీల, పలు గ్రామాలలోని బాధిత కుటుంబాల స్వగృహాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పిస్తూ ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం భానోత్ భీమ్లా నాయక్ గత కొద్ది రోజుల క్రితం తండా పర్యటనలో ఉన్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డిని ట్రై సైకిల్ కావాలని అడగగా తక్షణమే స్పందించి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, గారే నర్సయ్య, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతకుల మధుకర్ రెడ్డి, గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్, లేతకుల మహేందర్ రెడ్డి పార్టీ నాయకులు సంకినేని ఎల్లస్వామి,చిలువేరు సాయి గౌడ్ భారీ ఎత్తున కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

## వైకుంఠధామమా.. నరక కుపమా..




**తరిగొప్పుల,ఆగస్టు 03(మనం న్యూస్ ):** మండల కేంద్రం లోని వైకుంఠ ధామం లో అంత్యక్రియలు నిర్వహించాలంటే చాలా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా నీటి సమస్య తో పాటు పిచ్చి మొక్కలు, ఎపుగా పెరిగిన ముళ్ల చెట్లతో ఇబ్బంది ఏర్పడుతుంది. అంత్యక్రియలకు వచ్చేవారికి నిలువ నీడ లేకపోవడం తో పాటు కూర్చోడానికి బెంచీలు కూడ లేకపోవడం తో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఇప్పటికయినా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించి వైకుంఠధామం సమీపంలో బోరు వేసి నీటిని అందుబాటులో కి తెచ్చి శాశ్వత ప్రహరీ గోడను నిర్మించాలని కోరారు.

## పదోన్నతులు పారదర్శకం

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్



**నాగర్ కర్నూల్, ఆగస్టు 03(మనం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం అయిందని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ తెలిపారు. ఇటీవలే విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై ఉపాధ్యాయుల నుంచి డీఈఓ కార్యాలయంలో ఆదివారం అభ్యంతరాలను స్వీకరించినట్లు డిఈఓ తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులను సీనియారిటీ ఆధారంగా పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా మన్నారు. జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి 39 మంది జీహెచ్ఎంలుగా, 109 మంది స్కూల్ అసిస్టెంట్లు, 22 మంది పీఎస్ హెచ్ఎంలుగా పదోన్నతి పొందనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయు ల సీనియారిటీ జాబితా ఆధారంగానే ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముందుగా నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 36 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న జిహెచ్ఎంలు, మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న జిహెచ్ఎంల పదోన్నతులకై జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను హైదరాబాద్లోని ప్రాంతీయ విద్యా సంచాలకులకు పంపించినట్లు తెలిపారు. జిహెచ్ఎంల పదోన్నతుల వివరాలు ఆర్జెడి కార్యాలయం నుంచి వెల్లడి కానున్నాయని డీఈవో తెలిపారు. జిల్లాలో ఖాళీల ఆధారంగా అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జిటి)ల సీనియారిటీ జాబితా ప్రకారం 138 మంది ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా పదోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు. లోకల్ బాడీ పాఠశాలల్లో ఖాళీల వారిగా పదోన్నతులు ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా (ఎల్ఎఫ్ఎల్) 22 మంది, గణితంలో 11మంది, భౌతిక శాస్త్రంలో ఇద్దరికీ, జీవ శాస్త్రంలో 16 మందికి, సాంఘిక శాస్త్రంలో 25 మందికి, హిందీలో 10 మందికి, తెలుగులో 8 మందికి, ఇంగ్లీషులో 8 మందికి, ఫిజికల్ డైరెక్టర్ గా ఒక్కరికి, లోకల్ బాడీ ఉర్దూ మీడియంలో గణితంలో ఒక్కరికి, బయో సైన్సులో ఒక్కరికి, సోషల్లో ఇద్దరికీ, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ లాంగ్వేజ్లో ముగ్గురికి, ఉర్దూ, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్లో 15 మంది లోకల్ బాడీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనున్నట్లు డిఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో గణితంలో ఒక్కరికి, ఫిజికల్ సైన్సులో ఇద్దరికీ, బయో సైన్స్ ఒక్కరికి ఇంగ్లీషులో ఇద్దరికీ, సోషల్లో ఒక్కరికి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నదనీతెలిపారు. సజావుగా సమర్థవంతంగా సీనియర్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో కమిటీని ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను విద్యాశాఖ ఆన్లైన్లో నమోదు చేశామన్నారు. ని, మంగళవారం సబ్జెక్టుల వారిగా పాఠశాలల ఖాళీల వివరాలతో పాటు ఉపాధ్యాయుల ప్రమోషన్ల తుది జాబితాను విడుదల చెయ్యనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్ రావ్, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఎంఈఓ భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు శెట్టి, సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతానికి కార్యకర్తల కృషి అవశ్యం



- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్

**భీంగల్, ఆగష్టు 03 ( మనం న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని గోన్ గొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆయన సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తూ వస్తోందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త భుజంపై ఉందన్నారు. అలా చేసినప్పుడే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో కొత్తూర్ రాజాగౌడ్, కుమ్మరి రాజన్న, కుమ్మరి బాలయ్య, బంగ్లా నర్సయ్య, బండారి సూర్యదాసు, మిట్టపల్లి నర్సయ్య, కొమ్ము నవీన్, శ్రీహరి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో అవకతవకలు




**వేములవాడ, ఆగస్టు 3 (మనం న్యూస్):** వేములవాడలో డబుల్ బెడ్రూమ్ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో భారీ అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆరోపించారు. ఆదివారం వేములవాడ లో బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు.పురపాలక సంఘ పరిధిలో జరిగిన ఇంటి పంపిణీలో సగానికి పైగా ఇండ్లు కాంగ్రెస్ నాయకుల బంధువులు, మద్దతుదారులకు కేటాయించారని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో పారదర్శకత లేకపోవడం దురదృష్టకరమని, న్యాయపరమైన పోరాటానికి సిద్ధమని ప్రకటించారు.ఇండ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాకముందే కేవలం మున్సిపల్ ఓట్లను దృష్టిలో ఉంచుకుని పంపిణీ చేపట్టడం తగదని మండిపడ్డారు. వాస్తవంగా గరిష్ట సంఖ్యలో నిరుపేదలు ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి పూర్తిస్థాయిలో నివాసాలు అందించాలని డిమాండ్ చేశారు. గత ఏడాది డిసెంబరు 28 నుండి 2024 జనవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరించి, జనవరి 21 నుంచి నాలుగు రోజులపాటు వార్డుల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు గుర్తు చేశారు. కానీ ఒక్కో వార్డులో 60-70 మంది అర్హులుండగా కేవలం ఐదుగురిని మాత్రమే ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించారని పేర్కొన్నారు.సామాజిక న్యాయాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ సొంత ప్రయోజనాల కోసం ఇందిరమ్మ కమిటీల ఆధారంగా ఇండ్ల పంపిణీ జరిపిన తీరును వారు తీవ్రంగా విమర్శించారు. అధికార యంత్రాంగం కూడా ఈ వ్యవహారంలో పాత్ర పోషించిందని ఆరోపించారు.వేములవాడ పురపాలక సంఘ పరిధిలో ఇంకా అనేక మంది నిరుపేదలు నివాసం లేక ఇబ్బందిపడుతున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించిన 15 ఎకరాలను లేఅవుట్ చేసి న్యాయంగా పంపిణీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రజలు గుర్తిస్తారని నేతలు పేర్కొన్నారు.గత 20 నెలల కాంగ్రెస్ పాలనలో వేములవాడ పురపాలక పరిధిలో ఒక్క అభివృద్ధి పనీ కనిపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిలో కూల్చిన దుకాణాల మట్టిదిబ్బలను 50 రోజులైనా తొలగించని ప్రభుత్వ పనితీరును విమర్శించారు.

గత పాలకవర్గం కాలంలో కేటీఆర్ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులే ఇప్పటికీ కనిపిస్తున్నాయని గుర్తుచేశారు.ఈ ప్రెస్మీట్లో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, జోగిని శంకర్, ముద్రకోల వెంకటేశం, నాయకులు వాసాల శ్రీనివాస్, నీరటి మల్లేశం, కృపాల్, వెంకట్ రెడ్డి, పోతు అనిల్ కుమార్, పర్వేజ్, రాకేష్, సాయి, రఫీక్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

నిజామాబాద్ జిల్లా

4వ రోజు

# ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాలలో బ్రహ్మరథం

**ఖానాపూర్, ఆగష్టు 03 (మనం బ్యూరో) :** పాదయాత్ర మూడో రోజు నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చేరుకుంది. ఖానాపూర్ నియోజకవర్గం సుర్జాపూర్ గ్రామం వద్ద మీనాక్షి నటరాజన్‌కు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఖానాపూర్ వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, నాయకులు అడుగడుగునా ఆమెకు బ్రహ్మరథం పట్టారు. కార్యకర్తలందరినీ ఆమె ఆప్యాయంగా పలకరించారు. పాదయాత్రకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనసూయ సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. యాత్ర సందర్భంగా సుర్జాపూర్ గ్రామ రహదారులు కిటకిటలాడాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, వేణుగోపాలాచారి, శ్రీహరి రావు, విఠల్ రెడ్డి, ఆత్రం సక్కు, సోయం బాపూరావు, రేఖా శ్యామ్ నాయక్, నారాయణ రావు పటేల్, ఆత్రం సుగుణ, ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు

## రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

## 18 నెలల కాలంలోనే పలు రకాల అభివృద్ధి: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

## పోరాటంతోనే కాంగ్రెస్‌కు చిక్కిన అధికారం : ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ

**నిజామాబాద్, ఆగష్టు 03(మనం బ్యూరో) :** వందేళ్లకు మించి చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పరితపించే, శ్రమించే ప్రతి కార్యకర్తకు ప్రత్యేకంగా గుర్తింపు ఉంటుందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా నాలుగో రోజు ఆదివారం ఆర్మూర్ నియోజకవర్గం ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కార్యకర్తలతో కలిసి శ్రమదానం నిర్వహించారు. అనంతరం, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు వందలాది మొక్కలు నాటారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో గాంధీజీ పాదయాత్ర ద్వారా రవి అస్తమించని బ్రిటీష్ పాలకులను గడగడలాడించారని, గాంధీజీ, వినోభా బావేల స్ఫూర్తితో దేశంలో జరుగుతున్న మత, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా యువనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని, భవిష్యత్తులో చేస్తారని తెలిపారు. 2022లో జిల్లాలో సర్వోదయ యాత్రలో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. ఆనాడు కలువని నాయకులు, కార్యకర్తలను జనహిత పాదయాత్రలో కలవడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలతో మమేకం కావడానికి వారి కష్ట సుఖాలను తెలుసుకునేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారన్నారు. అది ఆగిపోలేదని వాన కాలం, ఎండాకాలం, చలికాలంలో సాగిందని, ముమ్ముందు సాగుతుందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో వెనుకబడిపోలేదని ఆయన నడక నిరంతరం అని గుర్తు చేశారు. సోనియాగాంధీ ప్రధాన మంత్రి పదవిని తిరస్కరించడం ద్వారా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మార్గం చూపారన్నారు. అది భారత దేశంలో సంప్రదాయంగా వస్తున్న త్యాగం అని అన్నారు.

### 18 నెలల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడ్డ 18 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఉచిత ప్రయాణాలు





చేశారని చెప్పుకొచ్చారు. అర్హులకు రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.

### కార్యకర్తల పదేండ్ల పోరాటంతోనే అధికారంలోకి కాంగ్రెస్: షబ్బీర్ అలీ

ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందంటే కార్యకర్తల పదేండ్ల పోరాటం, వారి కష్ట ఫలితమే అని ఆయన అన్నారు. ఇప్పటివరకు కార్యకర్తలు మా కోసం కష్టపడ్డారు, ఇప్పుడు మీ కోసం తిరిగి కష్టపడి మిమ్మల్ని నాయకులుగా చేయడం మా బాధ్యత అని తెలిపారు. రాహుల్ గాంధీ 4 వేల కి.మీ పైగా పాదయాత్ర చేసి దేశ వ్యాప్తంగా ప్రజల మనసులను అర్థం చేసుకుని, తెలంగాణ ప్రజల కావలసిన పథకాలను రూపొందించి అందిస్తున్నారని, వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ జనహిత పాదయాత్రను ప్రారంభించారని అన్నారు. ఈ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పార్టీ చేస్తున్న కార్యక్రమాలు తెలుపుతూ, ప్రజా పాలన అందివ్వడానికే ఈ పాదయాత్ర అని అన్నారు. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొంది పార్లమెంట్‌లో ఆమోదింపచేయడానికి ఈ నెల 5వ తేదీ నుంచి ఢిల్లీలో ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని, దాని రద్దు చేసే కుట్రలు జరిగిన కోర్టు ద్వారా దాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి నిర్వహించిన కుల గణన సర్వే ద్వారా మైనార్టీలు 12 శాతానికి పైగా ఉన్నారని, దీనితో ఇక మైనార్టీ రిజర్వేషన్ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా దాన్ని ఆపలేరని తెలిపారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుపేదల ఓటు హక్కును తొలగిస్తోందని, దేశ సంపదను అంబానీ, అదానీ వంటి ఉన్నత వర్గాలకు దోచిపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కార్, ఎమ్మెల్యేలు, సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, లక్ష్మీ కాంతారావు, రాష్ట్ర కోపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ జనహిత పాదయాత్రపై మనం దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక పేజీని తిలకిస్తున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, తదితరులు.





## బహుత్ అచ్ఛా హై.. ధన్యవాద్..

● మనం దిన పత్రికకు మీనాక్షి ప్రశంసలు

**నిజామాబాద్, ఆగష్టు 3(మనం బ్యూరో):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్ర మొదలు పెట్టినప్పటి నుంచి ప్రతి అడుగు కవర్ చేస్తున్న మనం దిన పత్రిక యాజమాన్యాన్ని, పత్రికా ప్రతినిధులను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూరు మండలంలో శ్రమదానం కార్యక్రమంలో 'మనం' దిన పత్రికలో ప్రచురించిన ప్రత్యేక కథనాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆసక్తిగా తిలకిస్తూ 'మనం కవరేజ్ చాలా బాగుందని, మనం సంస్థకు ధన్యవాదములు' అన్ని ప్రత్యేకంగా తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున మనం దినపత్రికకు ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం, కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, గనుల శాఖ తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందు ప్రియ, పోలీసు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మనం అందించిన స్పెషల్ కథనాలను చదివి ప్రశంసలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ బ్యూరో ఇన్‌చార్జి సుధీర్ కుమార్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల జర్నలిస్ట్ బృందం పాల్గొన్నారు.





మనం దినపత్రికను చదువుతున్న కామారెడ్డి మాజీ మున్సిపల్ ఛైర్మన్ గడ్డం ఇందు ప్రియ.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.